తెలంగాణ జాగృతి

# తంగేడు

తెలుగు సాహిత్య పక్ష పత్రిక

సెప్టెంబర్ 16-30, 2022

సంపుటి 02, సంచిక 23



సమానత్వ ఆలోచనలు రగిలించిన

## తెలంగాణ సాయుధ పోరాటం



తెలంగాణ సాహితీవేత్త, పద్యకవి.

## డా॥ తిరునగరి రామానుజయ్య

జయంతి : సెప్టెంబర్ 24, 1945


*Printed, Published and Owned by :* ***KALVAKUNTLA KAVITHA***
Printed at : **HARSHITHA PRINTERS**, Khairatabad, Hyderabad - 500 004.
Published at : **TELANGANA JAGRUTHI,** Pasham Amruthaaram Residency, H.No. 1-2-234/13/46/4, 4th Floor, Near NTR Stadium Aravind Nagar, Domalguda, Hyderabad - 500 029. Telangana State.
Editor : **KALVAKUNTLA KAVITHA**

# విషయ సూచిక




02 మనిషిలోని లోపాన్ని యుద్ధం చేసి జయించాలి అని చెబుతున్న **శీలం భద్రయ్య** కవిత **"జయించాలి"**



35 పద్యాన్ని దేశభక్తితో రంగరించి ప్రచురించిన **భానుప్రకాష్** **"పద్య ప్రభంజనానికి"** దాస్యం సేనాధిపతి పరిచయం



11 హైదరాబాద్ తొలి కవయిత్రి **"లత్ఫున్నీసా ఇంతియాజ్"** ని పరిచయం చేసిన **రమేష్ బాబు**



13 అద్దె ఇంటి కోసం కష్టాలు పడే మధ్యతరగతి బతుకును చిత్రించిన **భాగ్యలక్ష్మి** కథ **అద్దె ఇల్లు**



17 శిలాలోలిత కవిత్వానికి తన రచనతో కొత్త చూపులద్దిన **వాహెద్**.... **"కొత్త తలుపులు తెరిచే కవిత్వం!"**



31 పోరాటం చేసి ప్రభుత్వం మెప్పు పొందిన ఎల్లమ్మ కథ **ఎడవల్లి**... **"మా చెరువు మాకు కావాలి"**



23 ఇండియాకు వచ్చిన తమవాళ్ళు లాక్‌డౌన్‌లో తనవాళ్ళతో గడిపిన ఆమె మనోగతం తెలిపిన **చిదంబరం** కథ **"అనుకోని అదృష్టం"**

40 హృదయ లోగిలిలో మొలకగా ప్రాణం పోసుకునే **"నాన్న ఆశయం"** తలచుకున్న **జాదవ్ అంబాదాసు** కవిత

34 తడి లేని కన్నీళ్లను చూసిన **రూప్ కుమార్** కవిత... **"శ్వాస ధార"**

అమాయకపు పల్లె జంట ప్రేమను చిత్రించిన **సురవరం ప్రతాపరెడ్డి** నాటికథ **"నిరీక్షణ"**.....పేజీ 05

రేపటి వసంతం కోసం ప్రతిన కావాలి అంటున్న **సంపత్ కుమార్** కవిత **"జీవ తంతువు"** ....పేజీ 16

భారతీయతను అక్షరాల్లో పొదిగిన **చింతల రాకేష్** కవిత **"అద్వితీయ భారతి"** ...పేజీ 26

భాషలోతుల్ని స్పృశించే **విజయలక్ష్మి** కథ **"సిదానం సీకులు"** ...పేజీ 46

వేడి చాయిని వెచ్చగా తాగిస్తున్న **భానుప్రకాష్** కవిత **"రండి చాయ్ తాగుదాం"**....పేజీ 04

స్నేహమాధుర్యాన్ని గురించి **హరినాథ్** కవిత **"ఊహలకే ఊపిరొస్తే"** ....పేజీ 22

మానవ సంబంధాల మాధుర్యాన్ని చిత్రించిన దోరవేటి పయనమెచటికోయి నవలకు **కాంచనపల్లి** ముందుమాట **"దోరవేటికి హాట్సాఫ్"** ...పేజీ 27

**ఇంకా...** మరెన్నో కవితలు, సాహితీ శిఖరం, సమాజం, పుస్తక పరిచయం, స్వీకారం.. మొదలైనవి...

కవిత

# జయించాలి!



శీలం భద్రయ్య, 98858 38288

దేశం ఒక్కటైనప్పుడు
కుల, మతాల గొడవలెందుకు?
దేశం ఒక్కటైనప్పుడు
ఎన్నో రకాల భాషలెందుకు?
భాష ఒక్కటైనప్పుడు
వేవేల పదాలెందుకు?
పాదం ఒక్కటైనప్పుడు
ఇటూ అటూ.. నడకలెందుకు?
మానవ జాతి ఒక్కటైనప్పుడు
మనిషి మనిషికీ అంతరాలెందుకు?

కుల, మతాలెన్ని ఉన్నా
జన్మనిచ్చిన మాతృభూమి ఒక్కటే
మన చుట్టూ ఎందరున్నా
ఊపిరి పోసిన తల్లి ఒక్కరే
దేశభాషలెన్ని ఉన్నా
మదిలో మెరిసే భావ మొక్కటే

నడక ఏవైపునున్నా
అడుగులు సాగినంత వరకే
సమాజ అంతరాలెన్ని ఉన్నా
ఒక్కటైనప్పుడు సమసిపోయే

భూభాగమేకమైతే సరిపోదు
మనిషి మనిషికీ మధ్య హద్దులు చెరిపెయ్యాలి
యంత్రాలను ఆదేశించే మనిషి తెలివి సరిపోదు
వివక్ష లేని విచక్షణ కలిగిన మనిషిని తయారుచేసే తంత్రం కావాలి
శాంతితో శత్రువును జయిస్తే సరిపోదు
మనిషిలోని శత్రువును యుద్ధం చేసైనా జయించాలి!



*(75 వసంతాల స్వాతంత్ర్య సంబరాల సందర్భంగా
నల్లగొండ జిల్లా కేంద్రంలో కవితా సమ్మేళనం
16 ఆగస్టు 2022 కొరకు )*

సంపాదకీయం

తంగేడు

తెలంగాణ జాగృతి
తెలుగు సాహిత్య పక్ష పత్రిక

16-30 సెప్టెంబర్, 2022

సంపుటి 02 సంచిక 23



శ్రీమతి కల్వకుంట్ల కవిత
ఎడిటర్



డా॥ కాంచనపల్లి గో.రా.
అసోసియేట్ ఎడిటర్
9676096614

ఎడిటోరియల్ బోర్డ్ :
ఘనపురం దేవేందర్
రంగు నవీనాచారి

# సామాజిక పరిణామమే సృజన చైతన్యం

సాధారణంగా సృజనరంగంలో ఎవరినైనా ప్రభావితం చేసేది తను జీవించిన నాటి సమాజమే. ఆ సమాజమే సృజనకారునికి ఒక వస్తువును సమకూరుస్తుంది. వస్తువు తన కవసరమైన ప్రక్రియను నిర్మాణం చేసుకుంటుంది. ఇవి అప్రయత్నంగా జరిగే పరిణామాలు. అంటే ప్రధానంగా సాహిత్యానికి అవిభాజ్యంగా నిలబడేది సమాజమే. సమాజ గమనాన్ని ప్రతిఫలించేది నిర్దేశించేది కూడా సాహిత్యమే.

ఇటీవలే జన్మదినోత్సవం (సెప్టెంబర్, 9) జరిగిన తెలంగాణ ప్రాత:స్మరణీయుడు కాళోజి కవిగా ప్రాదుర్భావం చెందడానికి దోహదం చేసిన అంశాలను స్థాలీపులాకంగా అవలోకిద్దాం.

కాళోజి పాశ్చాత్య ఉదారవాదంతో ప్రభావితుడైన కవి. ఆయన 1914లో జన్మించారు. గ్రంథాలయోద్యమం 20వ శతాబ్దంలో ప్రారంభం అయింది. 1930లో ఆంధ్ర మహాసభ ఏర్పడింది. 1901లో హైదరాబాద్ శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం ఏర్పడింది. 1930లో ఆంధ్ర మహాసభ ఏర్పడేనాటికి కాళోజికి 16 ఏండ్లు. 1938లో హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ ఏర్పడేనాటికి ఆయన వయసు 24. తెలంగాణ సాయుధ పోరాటం 1946 నాటికి ఆయనకు 30 ఏళ్ళ ప్రాయం. ఈ విధంగా సమాంతర చారిత్రక సామాజిక పరిస్థితులు ఆయనలోని సహజాతమైన సృజనను మరింత ప్రభావితం చేసింది. తన జీవితకాలంలో వచ్చిన స్వాతంత్ర్యోద్యమం సంఘసంస్కరణోద్యమం, సాహిత్యోద్యమం ఆయనను విపరీతంగా ప్రభావితున్ని చేసింది.

ఆ కాలంలోని మేధావులు సోషలిస్టు లేక కమ్యూనిస్టు ఆలోచనలకు దోహదపడే ప్రభావం అధికం. అదే కాలంలో వచ్చిన రావి నారాయణరెడ్డి, దేవులపల్లి వేంకటేశ్వరరావు, ఆరుట్ల రామచంద్రారెడ్డి లాంటి కమ్యూనిస్టు మేధావులను ఆయన అవగతం చేసుకున్నారు. ఆయన కుటుంబ నేపథ్యాన్ని పరిశీలిస్తే తల్లి కన్నడం, తండ్రి మరాఠీ. ఆయన ఉర్దూ భాషలో కూడా ప్రవేశం కలవాడు. తల్లికి మరాఠీలో అభినివేశం ఉంది. కాళోజి తల్లితో మరాఠీలో, తండ్రితో ఉర్దూలో, మిత్రులతో తెలుగు మాట్లాడేవాడు. ఆ కాలంలో హైదరాబాద్ రాష్ట్ర రాజభాష ఉర్దూ. ఈవిధంగా కాళోజి సమాంతర కుటుంబ, సామాజిక పరిస్థితుల వల్ల నిరలంకార సౌందర్య ప్రదాత అయిన కవిగా రూపాంతరం చెందారు. ఆయనకు అలంకారశాస్త్ర గొడవ లేదు. వ్యాకరణం పట్టింపులు లేవు. సౌందర్య మీమాంసను గురించిన చింత లేదు. ప్రక్రియా నిర్మాణం పట్ల ఆరాటం లేదు. ఆయనకు ప్రత్యేకించి ఏ సిద్ధాంతం కూడా లేదు. సామాజిక దురన్యాయాలను ఎదిరించడమే ఆయన పని. ఎంత పెద్దవాడు అయినా సరే, తప్పు చేస్తే ఆయన కలం నిప్పులు కక్కింది. ఆయన నా గొడవ కావ్యం ఆయన గొడవ మాత్రమే కాదు. అది సమాజం గొడవ. సామాజిక న్యాయం కోసం ఎలుగెత్తిన కవితార్తి.

తెలంగాణను అణువణువు జీర్ణించుకున్న కవి ఆయన. ఇక్కడి భాష, యాస ఆయన అడుగడుగునా ప్రతిఫలించారు. బడి పలుకుల భాష కాదు, పలుకుబడుల భాష కావాలని ఎలుగెత్తారు. ఒక్క సిరాచుక్క లక్ష మెదళ్ళ కలయిక లాంటి కవితాపాదాలు సామెతలుగా నిలిచిపోయాయి.

సమాంతర సమాజ ప్రతిఫలనం సృజనకు దోహదం చేస్తుందనేదే మన ప్రధానాంశం. కాళోజి ఇందుకు బలమైన ఉదాహరణ.

సృజనకారుడు ఒక అవిశ్రాంత పారిశ్రామికుడు. అతని నిరంతర యాత్ర వలననే సమాజం ఒక నైశ్చల్యాన్ని సంతరించుకుంటుంది.

సృజన కొనసాగాలి.

సృజనకారుడు నిటారుగా నిలబడాలి.

జై తెలంగాణ, జై జాగృతి

కవిత కల్వకుంట్ల

కవిత

# రండి చాయ్ తాగుదాం!

అవుసుల భానుప్రకాశ్, 96032 04507



చాయ్ తాగడమంటే..
ఉదయాన్ని స్వాగతించడం
నవనవోన్మేష శక్తిని ఆవహించడం!
దోస్తులతో ముచ్చట్లు చెప్పుకోవడం
హాయిగా గతంలోకి వెళ్ళిపోవడం!!

చాయ్ తాగడమంటే..
అతిథికి మర్యాద చేయడం
ఆనందాలను ఆస్వాదించడం!!

బడలికను దూరం చేసుకోవడం
ఉత్సాహాన్ని తనువెల్లా నింపుకోవడం!
కొత్త ప్రణాళికలకు ఊపిరిపోయడం
ఆలోచనలను ఆచరణవైపు తిప్పడం!!

చాయ్ తాగడమంటే..
ప్రయాణానికి విరామమివ్వడం
మనస్సు బ్యాటరీని రీచార్జి చేయడం!
మందుబిళ్ళను జీర్ణం చేసుకోవడం
మేనికి ఆరోగ్యాన్ని ఆకాంక్షించడం!!

చాయ్ తాగడమంటే..
కంప్యూటర్లను విడిచిపెట్టడం
కమ్మని కబుర్లతో కాలక్షేపం చేయడం!
పని ఒత్తిడిని అధిగమించడం
మాధుర్య భరిత అనుభూతుల్లో మునగడం!!

చాయ్ తాగడమంటే..
గాజు గలాసుతో కరచాలనం చేయడం
వేడిపొగలను అమృతతుల్యం చేయడం!
నకనకలాడే ఆకలిని చల్లబరచడం
ముంచుకొస్తున్న నిద్రకు స్వస్తి పలకడం
మన జీవితాన్ని రసభరితం చేయడం!!

చాయ్ తాగడమంటే..
వేలితో సర్దుబాటు నేర్చుకోవడం
కదుష్ణ చుంబనం జడపదార్థానికి అందించడం!!

బాధలను వన్ బై టూ చేయడం
ఆనందాలను డబల్ శక్కర్ చేయడం!
తీపిజీవితాన్ని అందంగా చేదుకోవడం!
సంతోషంగా చప్పరిస్తూ సంతోషమయం చేయడం!!



నాటి కథ

# నిరీక్షణ

పల్లెటూరి పిల్ల పవిత్రమైన ప్రేమను చిత్రించిన కథ...



సురవరం ప్రతాపరెడ్డి

*సురవరం ప్రతాపరెడ్డి గారి కథలన్నీ చైతన్యవంతమైనవి. వాస్తవికతకు అతి దగ్గరగా రచింపబడ్డాయి. వారు కథారచనలో సిద్ధహస్తులే కాక అనేకమంది కథారచయితలను తయారుచేసినవారు. కవులూ, సంపాదక, వ్యాసరచయితలూ, పరిశోధకులూ, విమర్శకులూ, కథారచయితలూ అయిన సురవరం ప్రతాపరెడ్డి గారి చేతిలో కలం తన ప్రతాపాన్ని వెలిగ్రక్కుతూ చిందులు త్రొక్కేది. వారి రచనలు లెక్కలేనన్ని ముద్రణలు పొందగలిగినవి. రెడ్డిగారి కథలన్నిటిలోకి 'నిరీక్షణ' మణిపూస వంటిది. గొప్ప కథల కోవకు చెందింది.*

"శంకరన్! దినమూ సూర్యుడు తూర్పు సముద్రము నుంచి పైకి లేచి మళ్ళీ పడమటి సముద్రములో మునుగుతూ వుంటాడు. రాత్రంతా యెక్కడ వుంటాడు? మళ్ళీ తెల్లవారేవరకు తూర్పుకెట్లా వస్తాడు?"

"కుమారీ? అది అనాది నియమం. ప్రతివస్తువుకూ ఉదయం అస్తమయం ఉన్నది. అస్తమించే వస్తువు మళ్ళీ ఉదయిస్తుంది. మన యీ వూర్లో తూర్పు పడమటి సముద్రాలు కలుస్తవి. అందుచేత సముద్రంలోనే పుట్టి సముద్రంలోనే మునిగినట్లు కనబడుతుంది."

"అయితే వేరే దేశాల్లో యెట్లా వుంటుంది?"

"ఈ యందం అక్కడ లేదు. ఉత్తరానికి పొయ్యే కొద్దీ భూమిలో మునిగి భూమిలోనుండి పైకి వచ్చునట్లు కనబడుతాడు."

"ఆ అలలు చూస్తివా? యెట్లా వొకటిమీద వొకటి పడుతున్నవో, ఎప్పుడూ వాటికి విరామం లేదా?"

"అఖండ ప్రేమ అంటే అట్లే వుంటుంది... ఈ ముచ్చటకేమిగాని యింక కొంచెంసేపట్లో సూర్యుడు మునుగుతాడు. మనము దినములాగా యిక్కడి నుండి సముద్రం అంచువరకు దొర్లుదాము రా."

"ఊహూం, దినమూ నేనే ముందు దొర్లాలేమి? చూడు, ఎంత యెత్తునుండి దొర్లుతామో? 40 అడుగుల ఎత్తైనా వుంటుంది ఈ యిసుక దిబ్బ."

"నీవే ముందు దొర్లవలె."

"లేదు. నీవే."

"సరే. రా!"

శంకరన్ ముందు ఆ ఏటవాలు సముద్రతీరం యిసుకదిబ్బ మీద అడ్డము పండుకొని పల్టీలు కొడ్తూ కిందికి దొర్లినాడు. కుమారి వాని వెనుకాలినే దొర్లింది. శంకరన్ మీద కుమారి పడింది. కిలకిల నవ్వుతూ ఇసుకంతా దులుపుకొని చేతులు చేతులు పట్టుకొని మళ్ళీ పైకెగబాకినారు. ఇట్లా ఎన్నో మారులు దొర్లినారు. ఇంతలో ప్రొద్దు మునిగింది. ఇద్దరూ వకర్నొకరు రాచుకుంటూ యింటిదారి పట్టినారు.

★ ★ ★

శంకరన్ తల్లిదండ్రులు చిన్నప్పుడే చనిపోయినారు. తన మేనమామ యింట్లో పెరుగుతున్నాడు. ఇప్పటికి వయస్సు 15 వుంటుంది. మంచి స్ఫురద్రూపి. సాధారణంగా తిరువాన్కూరు బెస్తవారు అంటే నల్లగా వుంటారు. కాని శంకరన్ గోధుమ వర్ణమువాడు. దినమూ ఆ కన్యాకుమారి తీరమువద్ద సముద్రములో తన మామ వెంటపోయి చేపలు పట్టుకవచ్చేవాడు. కుమారి తల్లిదండ్రుల కొకే కూతురు. వయసులో చిన్నదైనా చేపలకూర, అరటికాయకూర, పనసకూర, అన్నము, సాంబారు బాగా వండగలదు. మంచి అందమైన పిల్ల. కాస్త నల్లనిదైనా ముక్కూ మొగమూ తీరూ చూచిన చాల ఆకర్షణీయముగా కనపడేది. కొబ్బరి నూనెతో నిగనిగమనే వెంట్రుకలు అప్పుడే బారెడేసి పెరిగినవి. నల్లని పెద్దకండ్లతో నవ్విందంటే శంకరం హృదయంలో మెరుపు మెరసినట్లా వుండేది. పెదవి తెరచి మాట్లాడిందంటే ఏక్తారా విన్నట్లు వినేవాడు. బయలులో తిరిగీ గారాబముగా పెరిగిన పిల్ల అగుటచేత అంగసౌష్ఠవం బాగా వ్యక్తం అవుతూ

నాటి కథ

వుండేది. తన మేనమామ కూతురు అగుటచేత శంకరన్‌కే ఆ పిల్లనిస్తారని అందరూ అనుకునేవారు. కాని వీరి కా పెండ్లిండ్ల ముచ్చట యేమిన్నీ తెలియదు. అన్యోన్య ప్రేమ దినదినమూ పెరుగుతూ వుంది. దినము సాయంకాలము తప్పకుండా సముద్ర తీరముపై ఆ యేటవాలు యిసుకదిబ్బలమీద ఆడుకునేవారు.

★ ★ ★

ఇట్లా కొన్ని సంవత్సరాలు గడచినవి. శంకరన్ ఇరువది యేండ్ల వాడైనాడు. కుమారి 16 యేండ్లదైంది. ఈ నవయవ్వనంలో కుమారి సంపూర్ణవికాసమునకు వచ్చినది. ఆ గులాబిరేకులవంటి పెదవులు, ఆ నవ్వే పెద్ద కన్నులు, ఆ చూపులలో గాఢమైన ప్రేమ, ఆ కిలకిల నవ్వులలో వెన్నెల తేట, ఆ మాటలలో అమాయకత్వము, ఆ గంభీరమైన నడక, ఆ ముందరి కొప్పు, ఆ పొంకమైన వక్షఃస్థలము శంకరన్ మనసులో గాఢముగా నాటుకొని పోయినవి. ఆ కాలంలో మలయాళ స్త్రీలకు యెదలపై రవికలుగాని, కొంగుగాని లేకుండేది. అందుచేత కుమారి సౌందర్యం మరీ ఆకర్షణీయమై, లోభనీయమై వుండేది. ఇట్లు వీరిరువురు పెరిగినా, తాము దినమూ ఆడుకునే ఆటలు మానలేదు. ఆ దిబ్బలపై జారి తనమీద కుమారి పడినప్పుడు శంకరన్ తననే కాదు ప్రపంచాన్నే మరచిపొయ్యేవాడు. ఆ పడుచు చేయిపట్టుకొని రాత్రిలో యింటికి పోతూవుంటే శరీరమంతా గగుర్పొడిచేది. కుమారి కూడా శంకరన్ తొడపై తలమోపి పండువెన్నెల్లో పండుకున్నప్పుడు, తన ప్రియుడు ఆ కథా యీ కథా చెప్పుతూ యేదో మిష పెట్టుకొని వంగి ముద్దు పెట్టుకొన్నప్పుడు తన శరీరములోని రక్తము మహా వేగముగా, ఉష్ణంగా ప్రవహించుతూ వుండేది. చెక్కిళ్ళ కాంతి రెండంత లయ్యేది. ఊర్లో అమ్మలక్కలు వీరిద్దరి యీడూ జోడూ చూచి వీరి అమాయకపు ఆటలుపాటలుచూచి చాల ముచ్చటపడుతూ పావురాళ్ళ జతగా వున్నారని అంటే యిద్దరూ ముసిముసి నవ్వులు నవ్వుతూ వకర్నొకరు వంక చూపుల్తో చూచుకునేవాండ్లు.

ఒకనాడు సాయంకాలము యింటికి వస్తూ వారిద్దరు యిట్లా మాట్లాడుకుంటూ పోయినారు.

**ఆ గులాబి రేకుల వంటి పెదవులు, ఆ నవ్వే పెద్ద కన్నులు, ఆ చూపులలో గాఢమైన ప్రేమ, ఆ కిలకిల నవ్వులలో వెన్నెల తేట, ఆ మాటలలో అమాయకత్వము, ఆ గంభీరమైన నడక, ఆ ముందరి కొప్పు, ఆ పొంకమైన వక్షః స్థలము శంకరన్ మునసులో గాఢముగా నాటుకొనిపోయినవి. ఆ కాలంలో మలయాళ స్త్రీలకు యెదలపై రవికలుగాని, కొంగుగాని లేకుండేది. అందుచేత కుమారి సౌందర్యం మరీ ఆకర్షణీయమై, లోభనీయమై వుండేది. ఇట్లు వీరిరువురు పెరిగినా, తాము దినమూ ఆడుకునే ఆటలు మానలేదు.**



"కుమారీ, ముందు ఆదివారము మనకు పెండ్లంటగా? అత్తమామలు వాండ్లు పందిళ్ళేసి యిల్లంతా అలంకారం చేస్తున్నారు."

"ఆ సంగతి నాకూ తెలుసులే."

"మనము ఇంక ఆలుమగండ్లమైతే మనకు బ్రహ్మానందంగా ఉంటుంది కదూ!"

"ఇప్పుడు లేదా? మనకెప్పుడూ నిత్యానందమే. మనము ఎప్పటివలెనే దినమూ ఆడుకుంటాముగా."

"లేదు. ఇంక మనకు ఆటలాడే అవకాశం వుండదు. మనమింక ఇంటి పనులన్ని చక్కబెట్టుకుంటూ సంసారం చేయవలసింది. నేను దినమూ చేపలు పట్టుకవస్తాను. నీవు ఇంట్లో పనులన్నీ చక్కబెట్టూ ముసలివారైన తల్లిదండ్రుల సేవ జేయవలసి వుంటుంది."

"అట్లైతే నీవు నన్నింక ప్రేమించవూ?"

"ప్రేమించనూ! యెవరంటారు? నిన్ను పూలల్లో పెట్టి పూజిస్తాను. అందరిచేత పూజింపజేస్తాను."

"ఏమో?"

"నేను పగలంతా చేపలు పట్టబోతాను. నీవు ఇంట్లో దంచీ, చెరిగి, వంటచేసి ఇంటిపనులు చూచుకొని సాయంత్రము వరకూ సద్దీ, బుట్ట తీసికొని సముద్ర తీరానికి రావూ?"

"తప్పకుండా, గంటముందేవచ్చి ఎదురుచూస్తూ కూర్చుంటాను."

"మరి నేను పగలంతా సముద్రం మీద వుంటే, నీవు ఇంటిపనుల్లో నన్ను మరచిపోతావా?"

"ఎన్నటికీ మరవను. అమ్మో! నిన్ను మరిస్తే ప్రపంచమునే మరచినట్లు!"

★ ★ ★

శనివారము నాడు మధ్యాహ్నము భోంచేసుకొని కుమారిని వెంట బెట్టుకొని సముద్రతీరానికి శంకరన్ పోయినాడు.

"కుమారీ! మన కులాచారం ప్రకారం మన పెండ్లికోసం నేను వంటిగాపోయి యేడు చేపలైన పట్టుకొని రావాలె. అదెంతపని? గంట లోపలనే వస్తాను. రేపేగా మన పెండ్లి. నీవు ఇంటివద్ద వుండు. ఇప్పుడే వస్తానూ, ఏమి?"

"గట్టిగా వస్తావా?"

"అందుకు సందేహమేమి?"

"చేపల వేటలో నన్ను మరచి పోతావేమో?"

"లేదు, లేదు. నీవే నన్ను మరచిపొయ్యేవు!"

"నీవు జల్దీ రాకుంటే, నేను నీతో ఇంక మాట్లాడను చూడు."

"తప్పకుండా వస్తాను."

అంటూ కుమారిని ముద్దులలో ముంచి చిక్కని బిగికౌగిటిలో ఇరికించికొని కొంతసేపు తన్మయుడై విడిపించుకొని గంతులు వేస్తూ తెప్ప యెక్కి తెడ్డుతో గబగబా నడుపుకుంటూ వెళ్ళినాడు. అతడు చూపు మేరనుండి అదృశ్యుడయ్యేవరకు చూస్తూ కుమారి ఇంటివైపు తిన్నగా నడిచింది. గంట అయింది. రెండు, మూడు, నాలుగు గంటలైంది. సాయంత్రమైంది, చీకటి పడింది. శంకరన్ రాలేదు. 'వెన్నెలరాత్రి ఫర్వాలేదు. ఈవేళ చేపలు దొరలేదేమో. సగము రాత్రికైనా వస్తాడులే' అని కుమారి తల్లిదండ్రులన్నారు. కుమారి మాత్రము రాత్రి అన్నము తినలేదు, నిద్రపోలేదు. ఇంటిముందరనే కూర్చుని సముద్రము దిక్కు చూస్తూ వున్నది. ఏమాత్రము చప్పుడైనా తన శంకరే వచ్చెనని ఆత్రముతో చూస్తూ వున్నది. తెల్లారేవరకు ఒకటే నిరీక్షణ. కుమారి తల్లిదండ్రులు భయపడిపోయినారు. వెంటనే కులస్థులను పదిమందిని జతచేసుకొని తెప్పలు వేసుకొని సముద్రము మీద ప్రయాణమైనారు. పదిమంది పదిదిక్కులా పోయినారు. మధ్యాహ్నము వరకు అందరూ వాపసు వచ్చినారు. శంకరన్ చనిపోయినాడనే నిర్ణయించుకొన్నారు. కానీ తెప్పజాడైనా కనపడవలసివుండె. అదీ దొరకలేదు. వృద్ధులైన కుమారి తల్లి దండ్రులు కుమారిని పట్టుకొని గోడుగోడున యేడ్చినారు. వచ్చిన చుట్టాలంతా అంగలార్చినారు. ఎవ్వరికి తోచినట్లు వాళ్ళు ఓదార్చినారు.

"ఇద్దరికీ లగ్నబలం లేదు, ఏమి చేస్తాము?"

"ఇద్దరు పార్వతీ పరమేశ్వరులలాగా ఎంత ముచ్చటగా వుండేవారు, పాపం!"

"వానికి నొసటిమీదవుండే ఆ పెద్ద మచ్చను చూచి ఎంత అదృష్టవంతుడమ్మా అనుకునేవాండ్లము!"

"ఎంత వినయవిధేయత లనుకున్నారు!"

"శంకరన్ అంటే భోళాశంకరుడేనమ్మా!"

"ఇంకెక్కడి శంకరన్? అయ్యో! కుమారీ! మీ ఇద్దరికీ ఈనాటికి ఋణాను బంధము దెగిపోయెగదమ్మా!"

అని నానావిధాల యెవరికి తోచినట్లు వారు వాపోయినారు.

కాని కుమారి మాత్రం ఒక్క కన్నీటిచుక్క రాల్చలేదు. ఒక మాట అనలేదు. ఒకవిధమైన విషాదహాసముతో సముద్రం దిక్కే చూస్తూ వుంది. ఎవరు పిలిచినా పలుకదు, అన్నము తినదు, ఆ చూపులో ఏదో వెదుకులాట కనపడుతూ వుంది. వచ్చిన బంధువులంతా సాయంత్రం వరకు ఎవరి బాట పట్టుకొని వారు పోయినారు.

★ ★ ★

అస్తమయం అయ్యే సమయంలో ఇంత చేపలకూర, ఇంత అన్నము, ఇంత పెరుగు బట్టులో తీసికొని కుమారి

**గంట అయింది. రెండు, మూడు, నాలుగు గంటలైంది. సాయంత్రమైంది, చీకటి పడింది. శంకరన్ రాలేదు. 'వెన్నెలరాత్రి ఫర్వాలేదు. ఈవేళ చేపలు దొరలేదేమో. సగము రాత్రికైనా వస్తాడులే' అని కుమారి తల్లిదండ్రులన్నారు. కుమారి మాత్రము రాత్రి అన్నము తినలేదు, నిద్రపోలేదు. ఇంటిముందరనే కూర్చుని సముద్రము దిక్కు చూస్తూ వున్నది. ఏమాత్రము చప్పుడైనా తన శంకరే వచ్చెనని ఆత్రముతో చూస్తూ వున్నది.**

నాటి కథ

సముద్రతీరానికి పోయింది. ఎందుకమ్మా అంటే పలుకదు. తల్లిదండ్రులు అడ్డమువచ్చినా వినదు. శంకరన్ తనను విడిచి ఇప్పుడే వస్తానని చెప్పి కడసారి ముద్దు పెట్టుకొని కౌగిలించుకొనిన చోటికే పోయి నిలుచున్నది. అట్లే సముద్రం దిక్కు చూస్తూ నిలబడింది. తల్లిదండ్రులు ఏమి ప్రమాదమౌతుందో అని వెంటనే వున్నారు. చీకటిపడ్డ తర్వాత ఎంతో ప్రయాసతో ఇంటికి తీసుక వచ్చినారు. ప్రతిదినమూ సాయంకాలము సద్దికట్టుకొని కుమారి సముద్రతీరానికి పోయి తాను, శంకరన్ ఆడుకుంటూ వుండిన ఇసుకదిబ్బలపై కొంతసేపు కూర్చొని తర్వాత తనను వదిలిపెట్టిపోయిన చోటికి పోయి నిలుచుండి చీకటిపడిన వెంటనే తిరిగి ఇంటికి వచ్చేది.

"ఏమమ్మా, ఇంకెక్కడి శంకరన్? ఇంకా వస్తాడనుకున్నావా? ఎందుకీ వృథాశ్రమ?" అని తల్లిదండ్రులు కంటనీరు పెట్టుకొని అడిగితే-

"అమ్మా! నా ప్రియుడు, నా ప్రాణము, నా శంకరన్ తప్పక వస్తాడే. తప్పకుండా వస్తానని చేయిలో చేయివేసి పోయినాడు" అనేది కుమారి.

"ఓసి పిచ్చితల్లీ! ఇవెక్కడి పిచ్చి ఊహాలే నీకు?"

"లేదమ్మా! తప్పకుండా వస్తాడు. పోతూపోతూ నన్ను మరచిపొయ్యేవు సుమా అని చెప్పిపోయినాడు."

"వాడే నిన్ను మరచిపోయినాడే, తిక్కతల్లీ! యింక వాని ఆలోచన విడిచిపెట్టు."

"అట్లా కానే కాదు, అతడు నన్నెప్పటికీ మరిచిపోడు. నన్ను పూవుల్లో పెట్టి పూజిస్తానన్నాడు. ఆ అలలవలెనే ప్రేమ అనంతము, అఖండము అన్నాడు."

"బిడ్డా! నీకు మతిపోయిందా ఏమి? వేరే మంచి మనువు చూస్తానులే. చింత చేయవద్దు" అన్నాడు తండ్రి.

"నా శంకరన్ కంటే మంచివాడు ప్రపంచమంతా వెదికినా దొరకడు. నా శంకరన్ తప్పకుండా వస్తాడు. నా పెండ్లి విషయంలో మీరేమీ చింత చేయవద్దు.

**సాయంత్ర మయ్యేవరకు శంకరన్ భాగము మూట కట్టుకొని సముద్రతీరం పోయి తాము చిన్నప్పుడాడుకొన్న చోట్లన్నీ తిరిగి చీకటి పడేవరకు శంకరన్ ఆఖరుసారి తనను విడిచిపెట్టి పోయిన తావుకు పోయి అక్కడ అన్నము పెట్టి యింటికి వస్తుంది. ఇట్లా దినాలు, మాసాలు, సంవత్సరాలు నిండినవి. ఈ 15 ఏండ్ల నుండి అదే దినచర్య.**

చిన్నప్పుడే మాకిద్దరికీ పెండ్లి అయ్యింది. నేనిట్లే యెదురుచూస్తుంటాను. మీకిష్టం వుంటే యింత కూడు వెయ్యండి. లేకుంటే నేనూ సముద్రం మీద పోయి నా ప్రియున్ని, నా భర్తను వెదకుకొని కలుసుకుంటాను."

★ ★ ★

కొన్నియేండ్లు అట్లే గడచిపోయినవి. కుమారి తల్లిదండ్రులు క్రమేణా చనిపోయినారు. కుమారి కిప్పుడు దిక్కెవ్వరూ లేరు. తల్లిదండ్రులు విడిచిపెట్టిపోయిన ఆస్తి కావలసినంత వుంది. దినమూ తనకూ, తన శంకరన్‌కూ వంట వండుతుంది. సాయంత్ర మయ్యేవరకు శంకరన్ భాగము మూట కట్టుకొని సముద్రతీరం పోయి తాము చిన్నప్పుడాడుకొన్న చోట్లన్నీ తిరిగి చీకటి పడేవరకు శంకరన్ ఆఖరుసారి తనను విడిచిపెట్టి పోయిన తావుకుపోయి అక్కడ అన్నము పెట్టి యింటికి వస్తుంది. ఇట్లా దినాలు, మాసాలు, సంవత్సరాలు నిండినవి. ఈ 15 ఏండ్ల నుండి అదే దినచర్య.

ఒకనాడు చాలా జబ్బుచేసి మంచం పట్టింది. ప్రక్కయింటి నాయర్ స్త్రీ వకతె వచ్చి పరిచర్య చేస్తూ వున్నది. "అయ్యో! ఈ దినము శంకరన్‌కు అన్నము తీసుకు పోలేదే! నీవైనా తీసుకపోవూ, అతడు వచ్చేవేళ అయింది" అన్నది నాయరు స్త్రీతో. రెండవ దినము జబ్బింకా జాస్తి అయినది. ఆమె పవిత్రవర్తనము, ఆ నిర్మల ప్రేమ, ఆ అఖండ భక్తి, ఆ అపూర్వ విశ్వాసము చూచి ఆమెను భక్తితో నమస్కరించనివారే ఆ గ్రామంలో లేరు. ఆమెకు రెండు దినాలు చాలా జబ్బైందని వినేవరకు చుట్టుపట్ల వారంతా గుంపైనారు. పగలంతా తీవ్రమైన తాపము. కలవరింతలు. ఆ కలవరింత లంతా శంకరన్ గురించిన కలవరింతలే.

"ఊహూఁ నీవే ముందు దొర్లిపోవాలె."

"మనకు పెండ్లైతే యెప్పటిలాగా ఆడుకోమూ?"

"నన్ను మరిచిపోతావా శంకరన్?"

"లేదు లేదు. నీవు జల్దీరాకుంటే వొట్టు."

ఈ ప్రకారము కలవరించుతూ వున్నది.

సాయంత్రమైంది. అందరూ చుట్టూ మూగి ఉపచారాలు చేస్తూ వున్నారు. తటాలున కుమారి ముఖముపై గొప్పకాంతి బయలుదేరింది. కండ్లల్లో ఆనందజ్యోతి ప్రజ్వరిల్లింది. ఎక్కడలేని బలం వచ్చినది. మంచములో లేచి కూర్చుని దక్షిణముఖంగా చూస్తూ చేతులు చాచి-

"ఆఁ వచ్చితివా, శంకరన్! జల్దీ వస్తానంటివే! ఇప్పుడైనా నన్ను మరచి పోలేదు కదా! నన్నూ రమ్మంటివా? వస్తా, వస్తా, ఇదిగో వస్తున్నాను. వస్తున్నాను శంకరన్!..."

కుమారి మంచముమీద పడిపోయింది. అంతా నిశ్శబ్దం. చూచే వరకు కుమారి శరీరం చల్లబడింది. కండ్లు మూసుకున్నది. ముఖముపై చిరునగవు మాత్రము అట్లే నిలిచిపోయినది.

గ్రామస్థులంతా సర్వవర్ణములవారు ఆమెను ఆ శంకరన్‌తో కడసారి వీడ్కోలు పొందిన స్థలములో సమాధి చేసినారు. అచ్చటనే వక గుడి కట్టినారు. అందు అఖండ ప్రేమజ్యోతిని వెలిగించినారు. నేటికిని కన్యాకుమారి దేవతయై ఆ చోట పూజింపబడుతూ వున్నది. "నిన్ను పూలల్లో పెట్టి పూజిస్తాను. అందరిచేత పూజింప జేస్తాను" అన్న శంకరన్ మాటలు నిజమైనవి.

సాహితీ శిఖరం

1975 సాహిత్య నోబెల్ విజేత....

## ఫాసిస్ట్ వ్యతిరేక రచయిత...

# యుజెనియో మోంటలే






యుజెనియో మోంటలే 12 అక్టోబర్ 1896లో జెనివాలో జన్మించాడు. ఈయన ఒక ఇటాలియన్ కవి, గద్య రచయిత, సంపాదకుడు మరియు అనువాదకుడు. సాహిత్యంలో 1975 నోబెల్ బహుమతి గ్రహీత. మోంటలే ఎక్కువగా స్వీయ-బోధనపై ఆధారపడ్డాడు. అతను ఊహ డాంటే అలిఘీరితో సహా అనేక మంది రచయితలను తన రచనలతో ఆకర్షించాడు. మోంటలే పదికి పైగా సంక్షిప్త సాహిత్యం, కవితా అనువాద పత్రిక, ఇంకా అనేక గద్య అనువాద పుస్తకాలు, రెండు సాహిత్య విమర్శ పుస్తకాలు మరియు ఫాంటసీ గద్యంలో ఒకటి రాశారు. అతని ఊహాత్మక పనితో పాటు అతను ఇటలీ యొక్క అత్యంత ముఖ్యమైన వార్తాపత్రిక కొరియర్ డెల్లా సెరాకు నిరంతరం సహకారిగా ఉన్నాడు. ఈ పత్రిక కోసం అతను సాహిత్యం, సంగీతం మరియు కళపై అనేక కథనాలను రాశాడు. అతను డాంటే అనే రచయిత రాసిన "ది డివైన్ కామెడీ"కి ముందుమాట రాశాడు. అందులో అతను డాంటే యొక్క విశ్వసనీయత మరియు అతని అంతర్దృష్టి మరియు నిష్పాక్షికమైన ఊహ గురించి విశ్లేషించాడు. 1925లో అతను ఫాసిస్ట్ వ్యతిరేక మేధావుల మేనిఫెస్టోపై సంతకం చేశాడు. మోంటలే రాజకీయ అభిప్రాయాలతో పియరో గోబెట్టి మరియు బెనెడెట్టో క్రోస్ యొక్క ఉదారవాదం వైపు మొగ్గు చూపెను. అతను గోబెట్టి యొక్క సాహిత్య పత్రిక ఇల్ బరెట్టి నిర్వహణలో కీలక పాత్ర పోషించాడు. 1925లో కనిపించిన మోంటలే యొక్క రచన, ప్రత్యేకించి అతని మొదటి కవితా సంకలనం ఒస్సీ డి సెప్పియా సమకాలీన జీవితం నుండి విడిపోయి ప్రకృతి యొక్క ఏకాంతంలో ఓదార్పు మరియు ఆశ్రయం పొందిన ఒక ఫాసిస్ట్ వ్యతిరేకిగా చూపిస్తుంది. ఒస్సీ డి సెప్పియా యొక్క ప్రసిద్ధ కవితలోని ఈ రెండు గొప్ప పంక్తులను చూడండి. "కోడెస్టో సోలో ఒగ్గి పోస్సియామో డర్టీ, సియో చె నాన్ సియామో, సియో చె నాన్ వోగ్లియామో ( ఈ రోజు మేము మీకు చెప్పగలిగేది, మనం లేనిది, మనం కోరుకోనిది)". అతని చుట్టూ ఉన్న నిరుత్సాహకరమైన సంఘటనల నేపథ్యంలో అవి అతనికి ఒక విధమైన "వ్యక్తిగత ఏకాంతాన్ని" అందించాయి. అతని కవితలు వ్యక్తిగత ఏకాంతాన్ని మరియు తాదాత్మ్యతను ప్రభావాత్మకంగా ఆకర్షిస్తాయి. మోంటలే మాటల్లో ప్రకృతి "కఠినమైనది, తక్కువ మిరుమిట్లు గొలిపేది". అంతేకాదు ఓటమి మరియు నిరాశతో నిండిన ప్రపంచంలో, ప్రకృతి మాత్రమే గౌరవాన్ని కలిగి ఉన్నట్లు అనిపించింది అని ఆయన చెప్పడం ఎందరి జీవితాలనో తాకింది.

మోంటలే 1927లో పబ్లిషర్ బెంపోరాడ్‌కి ఎడిటర్‌గా పనిచేయడానికి ఫ్లోరెన్స్‌కు వెళ్లారు. ఉంబెర్టో సబా మరియు విన్సెంజో కార్డరెల్లి వంటి ఇతర కవుల ప్రశంసలు పొందారు. 1929లో మోంటలేను గబినెట్టో వియస్సెక్స్ లైబ్రరీకి చైర్మన్‌గా నియమించాడు. ఈ పదవి నుండి 1938లో ఫాసిస్ట్ ప్రభుత్వం అతన్ని బహిష్కరించింది. ఈ సమయంలో మోంటలే కవిత్వం ఫాసిస్ట్ పాలనను నిలదీసింది. అతను సోలారియా మ్యాగజైన్‌లో పనిచేశాడు. పియాజ్జా విట్టోరియా (ఇప్పుడు పియాజ్జా డెల్లా రిపబ్లికా)లోని లి గియుబ్బే రోస్సే ("రెడ్ జాకెట్స్") సాహిత్య కేఫ్‌కి తరచుగా వెళ్లేవాడు. రోజుకు చాలాసార్లు కేఫ్‌ని సందర్శిస్తూ, అతను కార్లో ఎమిలియో గడ్డా, ఆర్టురో లోరియా మరియు ఎలియో విట్టోరిని (పత్రిక యొక్క స్థాపకులు అందరూ) సహా అక్కడి రచయితల సమూహంలో ప్రధాన వ్యక్తిగా మారాడు. అతను ఆకాలంలో దాదాపు అన్ని ముఖ్యమైన సాహిత్య పత్రికలకు వ్రాసాడు. ఆర్థిక సమస్యలు మరియు అధికారులు విధించిన సాహిత్య మరియు సాంఘిక ప్రతిబంధకాలు అడ్డుపడినప్పటికీ, అతని అత్యుత్తమ సంకలనం లే అకేషన్ ("సందర్భాలు", 1939) ప్రచురించబడింది. 12 సెప్టెంబర్ 1981న ఆయన మరణించాడు.

# ఆదర్శజీవి - ఉపాధ్యాయుడు



**గట్టెపల్లి సత్యనారాయణ రాజు**



"బడిపంతుళ్ళది లెక్క యేమనుచు నెవ్వండేని యూహించెనా
నడిసంద్రమ్మున జాతి జీవనము ముస్గంజూచు వాడౌను, నీ
రిడి పోషించెడి తోటమాలులగ నుత్ప్రేక్షించి వీక్షించెనా?
పుడమిన్ నందన వాటికల్ బెనుప సంపూర్ణమ్ముగా తోడ్పడున్"

"అటులె యధ్యాపకులు వృత్తియందుఁ గ్రొత్త
క్రొత్త విజ్ఞాన దీప్తులు గూర్పవలయు,
నిత్య చైతన్య మూర్తులై నిర్విరామ
సత్కళా స్ఫూర్తులై ముందు సాగవలయు?

కొందరున్నారు తమ వృత్తి నిందజేసి
కొనుచు తామోదొ మొనగాళ్ళ మనెడివారు
వృత్తి నవమాన పఱచు వీరికి మరేది
దొఱక కుండెనే బ్రదుకెల్ల మురిసిపోవ"

"ఆచార్యత్వమటన్న నల్పమె? సమగ్రాలోచనా విస్ఫుర
ద్వాచా ప్రౌఢి మనోజ్ఞ బోధనకళా వ్యాసంగమున్ కల్పనా
రోచి: పూర్ణ సమన్వయ ప్రతిభ, చిద్రూపాత్మ విజ్ఞానమున్
ప్రాచీనాధునిక ప్రపంచ విషయ ప్రావీణ్యమున్ గావలెన్"

"వేలకొలది బాలికలయు,
బాలుర చిత్తములు, పూల బంతులవోలెన్
దేలించి యాటలాడుచు
పాలించు గురుండు నిఖిల భావి జగమ్ముల్"

***(స్వప్న ఫలం కావ్యం నుండి...)***

వ్యాసం

# హైదరాబాద్ తొలి కవయిత్రి లత్ఫున్నీసా ఇంతియాజ్

తొలి కవయిత్రి, ఆమె కవిత్వం...




హెచ్. రమేష్ బాబు
77807 36386


చరిత్ర లోతుల్లోకి వెళ్ళే కొద్దీ మనకు ఎప్పుడూ కొత్త విషయాలు బయల్పడుతూనే ఉంటవి. పైగా తెలంగాణ చరిత్రలో నూతన అంశాలు బయల్పడే అవకాశాలు మెండు. "త్రవ్వ కొలది రతనాలు"అన్నమాట నిరంతరం నిరూపితమవుతూనే ఉంటుంది. కొత్త అంశం బయలుపడి నిన్నటి దాక తానే ప్రథమం అనే అంశం పక్కకు వైదొలిగి దాని స్థానంలో కొత్తది వచ్చి చేరుతుంది. సరిగ్గా ఇలాంటిదే హైదరాబాదు-దక్కన్‌లో తొలి కవయిత్రి విషయం.

నిన్నమొన్నటి దాక హైదరాబాదు-దక్కన్ లో తొలుత ఉర్దూ కవిత్వం రాసిన కవయిత్రి మహలకా బాయి చందా అనే అందరం రాసుకున్నాము.



అయితే ఇప్పుడు ఆమె స్థానంలో "లత్ఫున్నీసా ఇంతియాజ్" వచ్చి చేరింది. ఇపుడు ఈమెనే ఉర్దూలో "సాహెబాన్ - ఎ-దివాన్"గా చరిత్ర కెక్కుతారు. లత్ఫున్నీసా రాసిన పలు ఘజల్లు, మత్నవీలు, ఖసీదాలు వెలుగులోనికి వచ్చినవి. గడచిన శతాబ్దంలో హైదరాబాదులో ఉర్దూ సాహిత్యకారునిగా పేరొందిన నసీరుద్దీన్ హాష్మి రాసిన పలు విమర్శన వ్యాసాల ఆధారంగా మహలకాబాయి చందా కన్నా ముందుగానే ఉర్దూలో కవిత్వం రాసిన కవయిత్రిగా లత్ఫున్నీసా ఇంతియాజ్ వెలుగులోకి వచ్చింది. ఈమె జీవిత విశేషాలు పూర్తిగా తెలియవలసి ఉన్నది.

మచ్చుకు గాను నసీరుద్దీన్ హాష్మి పేర్కొన్న ఆమె కవితా ఖండికలు అందుబాటులో ఉన్నవి. ఇవన్నీ కూడా కెనెడాలో స్థిరపడిన నసీరుద్దీన్ హాష్మి కూతురు ఖదీజా హాష్మి చొరవతో సాహిత్య ప్రపంచానికి అందుబాటులోకి వచ్చినవి. ఖదీజా హాష్మి తన తండ్రి నసీరుద్దీన్ గురించి రాసిన నేపథ్యంలో ఈ విషయాలన్నీ బయల్పడినవి.

ఇంతకు ఎవరీ లత్ఫున్నీసా ఇంతియాజ్? లత్ఫున్నీసా హైదరాబాదులో జన్మించారు. ఆమె అసలు పేరు లత్ఫున్నీసా బేగమ్. ఇంతియాజ్ అనే కలం పేరుతో రచనలు చేసేవారు.

**లత్ఫున్నీసా ఎపుడు మరణించారో తెలిసి రావడం లేదు. లత్ఫున్నీసా దివాన్ 1797లో ప్రచురితమైతే, ఏడాది తరువాత మహలకా బాయి చందా దివాన్ "గుల్జార్ -ఎ-మహలఖా" 1798లో ప్రచురితమైంది. ఈ అంశం మహలఖా బాయిని తక్కువ చేసి చూపడానికి కాదు గానీ చరిత్రలోని వాస్తవాలను వెలికి చెప్పడానికే. ఒక రకంగా వీరిని సమకాలికులుగా కూడా మనం పేర్కొనవచ్చు.**

చిన్నతనంలోనే తల్లి మరణించింది. సంపన్నమైన, సంప్రదాయ కుటుంబం కావడంతో ఏ లోటూ లేకుండా పెంచారు.

ఆమె వివాహం అసద్ అలీఖాన్ తమన్నాతో జరిగింది. అయితే దురదృష్టవశాత్తు కొద్దికాలానికే 1789-90 ప్రాంతంలో ఆమె తన భర్తను కోల్పోవలసి వచ్చింది. ఆ తరువాత ఆమె తన సమయాన్నంతా ఆధ్యాత్మిక చింతనలో గడపడం మొదలు పెట్టింది. "షా అతవుల్లా" ఆధ్యాత్మిక మార్గంలో రచనా వ్యాసాంగాన్ని ప్రారంభించింది. ఈ భక్తి మార్గంలోనే ఆమె హజ్ యాత్రను చేసి వచ్చారు.

ఈ నేపథ్యంలో లత్ఫున్నీసా తన 36వ ఏట అనగా హిజ్రీ 1212లోతన తొలి "దివాన్" (కవితా సంకలనం) ప్రచురింప జేశారు. ఈ లెక్కన ఆమె హిజ్రీ 1176లో జన్మించినట్లుగా భావించవచ్చు. అంటే హిజ్రీ 1212 ఆంగ్ల సంవత్సరం 1797తో సరిపోలితే, 1761లో ఆమె జన్మించినట్లుగా తెలుస్తున్నది. ఐతే లత్ఫున్నీసా ఎపుడు మరణించారో తెలిసి రావడం లేదు. లత్ఫున్నీసా దివాన్ 1797లో ప్రచురితమైతే, ఏడాది తరువాత మహలకా బాయి చందా దివాన్ "గుల్జార్ -ఎ-మహలఖా" 1798లో ప్రచురితమైంది. ఈ అంశం మహలఖాబాయిని తక్కువ చేసి చూపడానికి కాదు గానీ చరిత్రలోని వాస్తవాలను వెలికి చెప్పడానికే. ఒక రకంగా వీరిని సమకాలికులుగా కూడా మనం పేర్కొనవచ్చు. ఇంకా ఆనందించవలసిన విషయమేమిటంటే సాలార్జంగ్ లైబ్రరీలో నేటికీ ఆమె వ్రాత ప్రతులు భద్రపరచబడి ఉన్నవి. వీటి ద్వారా ఆమె తన కవిత్వంలో సమాజంలోని అన్ని కోణాలను స్పృశించినట్లుగ తెలుస్తున్నది.



"గుల్షా-ఎ-షురా"పేరుతో ఉన్న లత్ఫున్నీసా 'దివాన్' 18 వేల ద్విపదలను కలిగి ఉండటం విశేషం. సమాజం, మానవజీవన విధానాన్ని ఈ ద్విపదలు ప్రతిబింబిస్తాయి.

"కాఫిరులు ముసల్మానులన్న భేదము నేనెరుగను
నా కనులకు ఇదొక వింత ప్రపంచము
మందిరము మసీదు రెండూ ఒకటే నాకు"

అంటూ మత సామరస్యాన్ని చాటుతారు లత్ఫున్నీసా.

అట్లానే ఒక మస్నవీలో-

"తూ ఇష్క్-ఎ-హాకీకత్ సే
మద్హోష్ హై!
షరాబ్ -ఎ- మొహబ్బత్ సే
బే హొష్ హై!!
అతా వహ్ కియా మారీఫత్ కా కలామ్ !
అతవుల్లా సచ్చా మేరా ముర్షద్ కా నామ్ !!
జో లు తుఫున్నీసా సచ్ హైతెరా హీ నామ్ !
తేరా షేర్ కా షోరా తా
రోమ్ ఓ షామ్ !!"

అంటూ గురుభక్తిని చాటుకుంటారామె.

మరొక ఘజల్ లో-

"మైనే అజబ్ ఖ్వాయిష్ ఎ షరాబ్ కియా!
ముహతాసాబ్ కా జిగర్
కబాబ్ కియా!!
ఇంతియాజ్ అబ్ తేరా లఖాబ్ హమ్నే
జాన్ ఫిదా ఎ అబు తూ రబ్ కియా!!"

అంటూ అంత్య ప్రాసలతో అలవోకగా కవిత్వం చెబుతారామె. ఏది ఏమైనా దఖినీ ఉర్దూలో తొలి కవయిత్రిగా లత్ఫున్నీసా ఇంతియాజ్ గురించి ఉర్దూ పండితులు మరిన్ని పరిశోధనలు చేసి ఆమె సాహిత్యాన్ని ఈ తరం వారికి అందించ వలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

# అద్దె ఇల్లు'

**అద్దె ఇంటి కోసం యువకుడి ఆరాటం...**



పింగళి భాగ్యలక్ష్మి
97047 25609

నగరంలో సొంత ఇల్లు ఉన్న వాళ్ళు నా దృష్టిలో కోటీశ్వరులు. విజయవాడ, హైదరాబాద్, గుంటూరు లాంటి నగరాల్లో సొంత ఇల్లు ఉన్న వాళ్ళు నిజంగా పూర్వ జన్మలో ఏదో తపస్సు చేసి ఉంటారు. విజయవాడలో అద్దె ఇల్లు దొరకాలంటే బాటా చెప్పులు కనీసం రెండు జతలైనా కావాలి. ఎంత కష్టపడి తిరిగినా ఒక్క రూమైన దొరకదు. పోనీ ఇల్లు దొరికింది కదాని సంతోషిద్దామంటే ఆ అవకాశమూ ఉండదు. అద్దె ఇంట్లో దిగినప్పటి నుండి అసలు గొడవ మొదలవుతుంది. సొంత ఇల్లు ఉన్న వాళ్ళందరి మనస్తత్వాలు ఒకే విధంగా ఉండవు.

నేను ఒంగోలులో ఒక పేరున్న ప్రైవేటు కంపెనీలో అకౌంటెంటుగా ఉద్యోగంలో చేరాను. ఐదేళ్లు పనిచేసిన తర్వాత విజయవాడ బ్రాంచికి ట్రాన్స్ఫర్ చేశారు ప్రమోషన్ మీద. మా ఆవిడ పిల్లల్ని తర్వాత తీసుకెళ్ళొచ్చు అని నేను విజయవాడ బయలుదేరాను. అద్దెఇల్లు దొరకలేదు కాబట్టి హోటల్లో రూం తీసుకున్నాను. మొదటి రోజు ఆఫీసుకు వెళ్లాను హాయిగా గడిచిపోయింది. ప్రమోషన్ మీద వచ్చాను కదా అందరూ సకల మర్యాదలు చేశారు. కంపెనీ వాళ్లు అద్దె ఇల్లు దొరికేంతవరకు గెస్ట్ హౌస్‌లో ఉండమన్నారు. నా మకాం గెస్ట్ హౌస్ లోకి మారిపోయింది.

రెండవ రోజు నుండి ఆఫీసు నుండి రాగానే అద్దె ఇల్లు వేట మొదలు పెట్టాను. ఒక చోట టూలెట్ బోర్డు చూసి ఇంటి లోపలికి వెళ్లాను. ఇంటి ఓనర్ పడక్కుర్చీలో కూర్చుని ఉన్నాడు, ఏమిటన్నట్లుగా నావైపు చూశాడు. నా పేరు గిరి అద్దె ఇంటి కోసం వచ్చానని చెప్పాను. "అయితే నా షరతులు విను. ప్రతి నెల ఒకటోతారీకునే అద్దె ఇచ్చేయాలి. తొమ్మిదింటికల్లా లైట్లు ఆర్పివేయాలి. పదింటికల్లా గేట్లు మూసివేస్తాము. పిల్లలు ఎక్కువ మంది ఉండటానికి వీలు లేదు. ప్రతి నెల కరెంట్ బిల్లు కట్టి రావాలి. పంపు నీళ్లు పరిమితంగా కట్టుకోవాలి..." అని ఆగి షరతుల లిస్టు రెండవ వైపు మొదలు పెట్టబోయాడు. నేను నమస్కారం చేసి నా కాళ్ళకు బుద్ధి చెప్పాను. ఇంకా రెండు వీధులు తిరిగాను ఎక్కడ అద్దె ఇల్లు దొరకలేదు. ఇక లాభం లేదని హోటల్లో భోజనం చేసి గెస్ట్ హౌస్ కి బయలుదేరాను.

ఆరోజు ఆదివారం. పొద్దున్నే లేచి కాలకృత్యాలు తీర్చుకుని టిఫిన్ కాఫీ లాగించి అద్దె ఇంటి కోసం బయలు దేరాను. మొదట గవర్నర్ పేటలో ఒక వీధికి వెళ్లాను. ఒక ఇంటి ముందు "ఇల్లు అద్దెకు ఇవ్వబడును" అనే బోర్డు రాసుంది. వెళ్ళి తలుపు తట్టాను. 50 ఏళ్ల ఆడమనిషి తలుపు తీసింది. 'చూడు బాబు నేను వంట పనిలో ఉన్నాను, ఏం పని మీద వచ్చావు?"అంటూ ప్రశ్నించింది. వచ్చిన సంగతి చెప్పాను. "నీ పేరు" ప్రశ్నించింది ఆవిడ. గిరి అని చెప్పాను. "నీకు ఉప నయనం అయిందా లేదా?" అని ప్రశ్నించింది. 'అయింది' అని కొంచెం అదురుతున్న గొంతుతో చెప్పాను. "పెళ్లయిందా లేదా?" అని ప్రశ్నించింది ఇంటర్వ్యూ ఆఫీసర్ ఫోజులో. నా గొంతులో ఏదో ఇరుక్కున్నట్లుగా ఫీలింగ్ కలిగింది. భయపడుతూనే 'పెళ్లి కూడా అయింది' అని చెప్పాను.

ఆవిడకి పెళ్లయిందని చెప్పినా ఇంకా అనుమానం తీరినట్లు లేదు, ఏది నీ జంధ్యం ఒకసారి చూపించు అంది. అంతే పాతిక కిలోమీటర్ల వేగంతో పరుగు మొదలుపెట్టాను. లేదని చెబితే ఆవిడ మొహం మీదే తిట్టేటట్లుగా ఉంది. నాకు నిజంగానే జంధ్యం లేదు. మొన్న మా చంటివాడు ఏడుస్తున్నాడు కదాని ఎత్తుకుంటే జంధ్యం తెంపేశాడు. మళ్ళీ వేసుకోలేదు. తిన్న కాఫీ, టిఫిన్ అరిగిపోయాయి. ఇంకో వీధిలో వెతకటం మొదలు పెట్టాను, కానీ ఎక్కడా అద్దె ఇల్లు కనపడలేదు.

మార్కెట్ సెంటరుకి రాగానే నా మిత్రుడు ఒకడు కనపడ్డాడు. ఇద్దరం కాసేపు పిచ్చాపాటి మాట్లాడుకున్నాము. నా పాత మిత్రుడు కాఫీ ఇప్పించాడు.

నేను అద్దె ఇంటి కోసం వెతుకుతున్నట్లు చెప్పి ఏదైనా అద్దె ఇల్లు ఉంటే చెప్పమన్నాను. నన్ను వెంటబెట్టుకుని ఒక అద్దె ఇల్లు చూపించాడు. నాకు చాలా ఆనందం కలిగింది. "ఒరేయ్ గిరి నాకు పనుంది. ఆ ఇంటి ఓనర్ నాకు తెలిసిన వాడే నేను చెప్పానని చెప్పు తప్పకుండా ఇస్తాడు" అని చెప్పి వెళ్ళిపోయాడు. నేను లోపలికి వెళ్లాను, వచ్చిన సంగతి ఇంటి ఓనరుకి వివరించాను. ఆయన పేరు అడిగాడు. 'గిరి' అని చెప్పాను. "ఏం పని చేస్తున్నావు?" అని అడిగాడు. 'అకౌంటెంటుగా పనిచేస్తున్నాను' అని చెప్పాను నేను. ఆయన ఇల్లు చూపించాడు.

ఇల్లు చాలా బాగుంది, నాలుగు గదులు, ప్రత్యేక పంపు. అద్దె ఎనిమిది వేలు చెప్పాడు. నేను వెంటనే ఒప్పుకున్నాను, ఇంటి ఓనర్ పెద్ద కండిషన్లు పెట్టకుండా ఇల్లు అద్దెకి ఇచ్చాడు. నా అదృష్టం అనుకున్నాను. నేను మంచిరోజు చూసి ఒక ఆదివారం మా ఆవిడా, పిల్లల్ని తీసుకొచ్చాను. మా ఆవిడకి కూడా ఇల్లు నచ్చింది. కొత్త ఇంటిని చూసేటప్పటికీ మా పిల్లలకి మంచి ఉత్సాహం కలిగింది. కొంతకాలం బాగానే సాగింది. మా ఇంటి ఓనర్ బ్యాక్ గ్రౌండ్ చెప్పడం మర్చిపోయాను. మా ఇంటి ఓనరుకి ఆరుగురు సంతానం. ఐదుగురు మగపిల్లలు, ఒక ఆడపిల్ల. అమ్మాయికి పెళ్లి చేశారు. మగవాళ్లలో ఇద్దరే ఉద్యోగాలు చేస్తున్నారు. మిగిలిన ముగ్గురు నిరుద్యోగులు. మా ఇంటి ఓనర్ ఈ మధ్యనే పదవి విరమణ చేశారు. ఈ చరిత్రంతా నేను సొంతంగా తెలుసుకోలేదు. ఒక రోజు నేను భోజనం చేస్తుంటే మా ఆవిడ ఈ చరిత్రంతా చెప్పింది.

నేను ఇంటి ఓనరుతో ఫస్ట్ తారీకు అద్దె ఇచ్చేటప్పుడు తప్ప మిగిలిన రోజుల్లో ఎక్కువగా మాట్లాడను. ఒక రోజు సాయంత్రం ఆఫీస్ నుండి వచ్చి మా పెద్దవాణ్ణి తీసుకొని షికారు వెళ్దామని బయలుదేరుతుంటే మా ఇంటి ఓనర్ పిలిచాడు. వాళ్ళ గుమ్మంలోకి వెళ్లగానే కుర్చీ వేసి కూర్చోమన్నాడు. ఇంతలో మా

> **ఒకరోజు** మా ఇల్లు గల ఆవిడ వీధి గుమ్మం దగ్గర ఎదురైంది. కాసేపు ఏవో మాట్లాడింది అసలు విషయానికి రాబోతుంది. "చూడు గిరి నీతో చాలా రోజుల నుంచి ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను" అంది. "ఏమిటి ఆ విషయం" నీరసం మొహంతో అడిగాను. "ఏం లేదు గిరి మా అమ్మాయి పెళ్లి సంబంధం విషయం".

ఇంటి ఓనర్ భార్య టిఫిన్ కాఫీ తెచ్చి అందించింది. నాకు మొదట్లో అర్థం కాలేదు. 'ఏదో పని మీద పిలిచినట్లున్నారు, ఏమిటి పని' అని అన్నాను మా ఓనరుతో. "ఏం లేదు గిరి మా మూడోవాడు రెండేళ్ల నుంచి ఖాళీగా ఉంటున్నాడు మీ ఆఫీసులో ఏదైనా పోస్ట్ ఖాళీగా ఉంటే చూడు. నువ్వు ఎకౌంటెంటువి కదా ఆ మాత్రం ఇప్పించలేకపోతావా. మీ బావమరిదికి నువ్వు గుమస్తా ఉద్యోగం ఇప్పించావని మీ ఆవిడ చెప్పింది. నువ్వు ఇప్పిస్తావన్న నమ్మకంతో అడుగుతున్నాను" అన్నాడు మా ఓనర్. అంతే నా గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లయింది. ఏం చెప్పాలో అర్థం కాలేదు.

ఈయన నాకు ఇల్లు ఇంత తేలికగా ఎందుకు ఇచ్చాడో ఇప్పుడు నాకు అర్థమైంది. నేను ఇంత బ్యాక్ గ్రౌండ్ ఉంటుంది అనుకోలేదు. "ఏం అంటావ్ గిరి" అడిగాడు మా ఓనర్. "మా బావమరిదిని చేర్పించేటప్పటికే తాతలు దిగి వచ్చారు. సారీ సార్ మా కంపెనీలో ఏం ఖాళీలు లేవు. ఈ విషయంలో నేను ఏమీ చేయలేనని" చెప్పేశాను. అంతే మా ఇంటి ఓనర్ ఒక్క ఉదుటున కుర్చీలోంచి లేచాడు. నేను లేచి నిలబడ్డాను. "ఏంటి కుదరదా అయితే వెంటనే ఇల్లు ఖాళీ చేసెయ్యి" అంటూ ఖచ్చితంగా చెప్పేశాడు. "సార్ ఇది చాలా అన్యాయం" అన్నాను మా ఓనరుతో. "ఏంటయ్యా అన్యాయం మీ బామ్మర్దికి ఉద్యోగం ఇప్పించిన వాడివి మా వాడికి ఆ మాత్రం వేయించలేవా. ఈ మాత్రం సహాయం చేయకపోతే ఎందుకయ్యా నువ్వు వెంటనే ఇల్లు ఖాళీ చేయాల్సిందే" అన్నాడు మా ఓనర్. ఇక వాదించడం అనవసరం అనుకొన్నాను. ఇదే అర్థం కాని మా అబ్బాయి ఇంకా చక్రాలు కరకరలాడిస్తున్నాడు. వాణ్ణి ఎత్తుకొని బయలుదేరాను. అద్దె ఇల్లు ఇచ్చినంత మాత్రాన ఇంత ప్రతిఫలమా. ఇల్లు ఊరికే ఇవ్వట్లేదుగా. మా బావమరిది ఉద్యోగం గురించి చెప్పినందుకు మా ఆవిడని గట్టిగా మందలించాను. మా ఆవిడకి సొంత డబ్బా వాయించడం బాగా అలవాటు. మళ్లీ అద్దె ఇల్లు వేట ప్రారంభమైంది.



క
థ

మా ఆఫీసులో పనిచేసే క్లర్క్ సుబ్బారావు పుణ్యమా అని నాకు నాలుగు గదుల ఇల్లు అద్దెకు దొరికింది. మంచి రోజు చూసి భార్యా పిల్లలతో సహా ఆ ఇంట్లోకి ప్రవేశించాను. నాకు భయంగానే ఉంది ఈ ఇంటి ఓనర్ ఏ కోరికలు కోరకుండా ఉంటే బాగుండును అనుకున్నాను. ఒక ఆరు నెలలు కళ్ళు మూసుకుంటే ట్రాన్స్ఫర్ వచ్చేస్తుంది. హాయిగా సొంత ఊరు ఒంగోలు వెళ్ళిపోవచ్చు. ఇక్కడ ఇంటి ఓనర్ చాలా మౌనంగా ఉంటాడు. భార్య మాటలకి తల ఊపుతాడు తప్ప మారు మాట్లాడడు. అంతా మా ఇల్లు గల ఆవిడదే పెత్తనం. ఇక్కడ ఎటువంటి గొడవలు రాలేదు నా అదృష్టం అనుకున్నాను.

ఒకరోజు మా ఇల్లు గల ఆవిడ వీధి గుమ్మం దగ్గర ఎదురైంది. కాసేపు ఏవో మాట్లాడింది అసలు విషయానికి రాబోతుంది. “చూడు గిరి నీతో చాలా రోజుల నుంచి ఒక విషయం చెప్పాలను కుంటున్నాను” అంది. “ఏమిటి ఆ విషయం” నీరసం మొహంతో అడిగాను. “ఏం లేదు గిరి మా అమ్మాయి పెళ్లి సంబంధం విషయం. మా ఆయన ఒట్టి అమాయకులు, ఆయనకేం తెలియదు. నీవు ఆయన్ని వెంటబెట్టుకుని వెళ్ళి రాజమండ్రి సంబంధం మాట్లాడి వస్తావని అడుగుతున్నాను” తెలిగ్గా అనేసింది. నా కాళ్ళు ఎవరో నరికి నట్లయింది, పెళ్లి సంబంధం అంత తేలికగా అయ్యే పనేనా అనుకున్నాను. ఈ ఇల్లు గల వాళ్లకి ఇవేం కోరికలో నాకేం అర్థం కావట్లేదు. ఈ రోజుల్లో పెళ్లి సంబంధం వెతకాలంటే అదొక బ్రహ్మవిద్య లాంటిది. ఏం సమాధానం చెప్పాలో నాకేం అర్థం కావట్లేదు.

మీ చెల్లెలు పెళ్లి, మీ మరదలు పెళ్లి నువ్వే జరిపించావని మీ ఆవిడ చెప్పింది. ఈ సంగతి మీ ఆవిడ ఇంట్లో చేరక ముందు ఒకసారి సినిమా హాల్లో కలిసినప్పుడు చెప్పింది. మా అమ్మాయి పెళ్లి కూడా జరిపిస్తావనే ధైర్యంతో నీకు ఇల్లు అద్దెకు ఇచ్చాను, ఏమంటావు గిరి” అడిగింది మా ఇంటి ఓనర్. ఇక ధైర్యం చేయకపోతే లాభం లేదు అనుకున్నాను. “ఈ విషయంలో నేను ఏం సహాయం చేయలేనండి, నాకు ఆఫీస్ వర్క్ ఎక్కువగా ఉంది కాబట్టి మరో ప్రయత్నం చేసుకోండి” అని గట్టిగా చెప్పేశాను. అంతే మా ఇల్లు గలావిడ సూర్యకాంతం ఫోజు పెట్టింది, మళ్లీ పాతపాటే ఇల్లు ఖాళీ చేసి పొమ్మంది. నా దురదృష్టం అను కొన్నాను. “ఈ నెలాఖరికి ఖాళీ చేస్తాను” అన్నాను. అయినా మా ఇంటి ఓనర్ రోజూ నసుగుతూనే ఉంది. నెలాఖరు రానే వచ్చింది. సామానంతా సర్దేసి భార్యాపిల్లలతో బయటపడ్డాను. అద్దె ఇంటి కోసం కాదు, రైల్వే స్టేషన్‌కి. చెప్పడం మర్చిపోయాను నాకు ట్రాన్స్ఫర్ వచ్చింది. గుడ్ బై! నగరంలో సొంత ఇల్లు ఉన్న వాళ్ళకి గుడ్ బై!!

## రచయితలకు సూచనలు

- ✓ సమీక్ష కోసం పుస్తకాలు పంపేవారు విధిగా రెండు కాపీలు పంపాలి.
- ✓ పత్రిక కోసం రచనలు పంపించే వారు యునికోడ్‌లో ఉంటే ఓపెన్ ఫైల్ మరియు పిడిఎఫ్‌లో మెయిల్ చేయండి.
- ✓ మా పత్రికకు రచనలు పంపినవారు ఇక్కడ అచ్చయాకనే ఫేస్ బుక్‌లో బ్లాగ్‌లో పెట్టండి.
- ✓ ప్రతి రచనకు ఇది ఎక్కడా ప్రచురణ కాలేదని, ఏ బ్లాగ్‌లో పోస్ట్ చేయలేదని, ప్రచురణ ప్రసారం కోసం ఎవరికీ పంపి ఉండలేదని హామీ పత్రం జత చేయండి.
- ✓ పత్రికలో ఒక కథ లేదా వ్యాసానికి నాలుగు పేజీలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన పదమూడు వందల పదాలకు మించకుండా వ్యాసం, కథ పంపించండి.
- ✓ కవితలు 15 పాదాలకు మించకుండా పంపించండి.
- ✓ వ్యాసాలు, కథలు, కవితలు ఏవైనా పోస్ట్‌లో కూడా ఈ క్రింది చిరునామాకు లేదా ఇ-మెయిల్‌కు పంపవచ్చు.
- ✓ ప్రచురణకు స్వీకరించిన రచనల్ని పత్రికనుగుణంగా మార్పు చేసుకునే హక్కు సంపాదకవర్గం కలిగి ఉంటుంది.

**తెలంగాణ జాగృతి**

పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 3వ అంతస్థు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర, అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in

కవిత

# జీవ తంతువు



బెల్లంకొండ సంపత్ కుమార్, 99085 19151

ఇంత స్థలమిచ్చినంతనే
భూమికి కాళ్లు తనాయించి
నింగి చుక్కలన్నీ కావాలనుకుంటాము
అవి అనంత విస్ఫోటనాల కాలచిహ్నాలని
తరువాతనే అర్థమవుతది

సంధ్యాకాంతులీనుతున్న అంచుల్లో నిలబడి
విసురుతున్న అలలన్నీ దోపుకోవాలనుకుంటాము
ఎన్నో ఆటుపోట్ల హృదయస్పందనలని
ఆలస్యంగానే తెలుస్తుంది

ఘర్షణలేని నాదమేదైనా ఉన్నదో!
గాయాలన్నీ వేణువు చేసే
వాహకమేమైనా ఉన్నదో
గాలాడే ఉదర గమనం
శబ్దించే నాడీకే తెలుస్తుంది
కాలంతో పాటు జీవితం
బహుకోణాల వృత్తం

గాయాలు తాకుతున్న వలయంలో
జీవం లేకుండా జీవించే వాళ్ళు ఉంటారు
ఒక ప్రేరణవుదాము
జీవచ్ఛవాలూ ఉంటాయి
ప్రాణవాయువవుదాము

మర్మం చాటేసిన నీడల నీడలను
బట్ట బయలు చేస్తే చాలు
రంగు బయటపడుతుంది

విశ్వవేదిక మీద నిలబడి
ఇలా పాఠాన్నవుతామా
దీర్ఘంగా శ్వాస నింపుకొని
పతాకమై వెలిగే సూర్యుళ్ళను చూసి
ఆనంద పర్యంతమవుతాము

విత్తనాలైన బీజాలను అలుకుతాము
మొలకై మురిసిందని ఓ కిరణం
పలకరిస్తే పులకించిపోతాము

ఇంకేం చేయాలె!
జీవతంతువు అల్లుకోవాలె
శ్రుతి తప్పిన వినోదమో
మతి తప్పిన విపర్యయమో కావచ్చు
అధ్యయనానికి నిలబడాలె
అనుభవానికి తలపడాలె
రేపటికి వసంతానికి
ప్రతినగావాలె.

వ్యాసం

# కొత్త తలుపులు తెరిచే కవిత్వం!

శిలాలోలలిత కవిత్వానికి భావచిత్రాల బలం...



వాహెద్
70937 88843

శిలాలోలిత తెలుగు కవిత్వంలో పరిచయం అవసరం లేని పేరు. తన కవిత్వసంపుటికి ముందుమాట రాయమని ఆమె కోరడం నిజానికి నేను ఊహించని గౌరవం.

"నేను ఇక్కడి భూమిని" కవిత్వ సంపుటి పేరు చదవగానే మదిలో ఒక భావచిత్రం తటిల్లతలా మెరుస్తుంది. మొత్తం సంపుటిలో ఇలాంటి మెరుపులు చాలా ఉన్నాయి. ఈ కవిత్వ సంపుటికి పెట్టిన పేరు సంపుటిలోని ఒక కవిత శీర్షిక.

ఆ కవితలో కొన్ని పంక్తులు ఒకసారి చదివి, ఈ పుస్తకం గురించి మాట్లాడుకుందాం

"....

ఇన్ని ప్రశ్నల మధ్య - అనుమానాల మధ్య
ఒకే ఒక్క జవాబు
నేను మనిషిని
నేను ఆకాశాన్ని
నేను ఇక్కడ గలగల పారుతున్న సెలయేరును
నా ఉనికి ఇదే
నేనే ఈ భూమిని, ఇక్కడి భూమిని"

ఈ పంక్తులు చదువుతున్నప్పుడు అనివార్యంగా, సహజంగా, అసంకల్పితంగా మనసులో మెదిలే భావచిత్రాల గురించి ఆలోచించండి. నిస్సందేహంగా ఈ



పంక్తుల్లో పోలికలున్నాయి. ప్రతీకలున్నాయి. కాని, అవన్నీ కలిసి పాఠకుడి కళ్ళ ముందు మెరిపించే దృశ్యప్రధాన భావచిత్రాలు గమనించదగ్గవి. పాఠకుడిని కళ్ళు మరల్చనీయకుండా ఒక కాన్వాసునే తదేక దృష్టితో చూసేలా కట్టివేసే మంత్ర జాలం ఈ పంక్తుల్లో ఉంది. ఈ మంత్రజాలమే కవయిత్రి చెప్పదల చుకున్న విషయాన్ని పాఠకుడి మనోఫల కంపై చెరగని సంతకంగా మిగిలిపోతుంది.

ఈ మొత్తం సంపుటిలో ఇలాంటి అనేక కవితలున్నాయి. భావచిత్రాలను బలంగా ఉపయోగించడం తెలిసిన కవయిత్రి శిలాలోలిత. అందుకే, ఈ కవిత్వసంపుటిలో కవితల గురించి మాట్లాడే ముందు భావచిత్రాల గురించి ఒకసారి మాట్లాడుకోవడం అవసరమనుకుంటున్నాను.

భావచిత్రాలు కవిత్వానికి వెన్నెముక వంటివి. భావచిత్రాలు దృశ్యప్రధానమైనవి కానవసరం లేదు. శబ్దం, వాసన, స్పర్శల అనుభూతులను పాఠకుడిలో కలిగించడం ద్వారా కూడా ఇమేజరీని సాధించవచ్చు. ఎజ్రా పౌండ్ ఇమేజరీ గురించి చెబుతూ "something that captures an emotional and intellectual complex in an instant of time." అన్నాడు. ఒక నిర్దిష్ట కాలంలో ఒక అనుభూతిని ఒక చిత్రంలా మలచడమే ఇమేజరీ. ఆ భావచిత్రం మనసులో నాటుకుపోతుంది. ప్రతిసారి కవితను చదివినప్పుడు కొత్త అర్థాల ఫౌంటేన్లకు జన్మనిస్తుంది.

ప్రముఖ కవయిత్రి కమలాదాస్ సురయ్యా కవిత్వంలో మనకు అద్భుతమైన భావచిత్రాలు కనిపిస్తాయి. ఆమె రాసిన కవిత "ది సీ"లో తన గతాన్ని సముద్రానికి సంబంధించిన భావ చిత్రాలతో మన ముందు ఆవిష్కరిస్తుంది. ఒక నోస్టాల్జియా పాఠకుడిని కమ్ము కుంటుంది. "ది ఫ్రీక్స్" కవితలో తన ప్రేమికుడిని సూర్యుడిలా, వేడిని ప్రేమరాహిత్యాన్ని మోసుకొచ్చేదిగా చిత్రీకరించింది.

My love is an empty gift, a glided Empty container, good for show, nothing else (The Descendants).

……Half dead woman, now of no use at all to men (Summer in Calcutta).

కమలాదాస్ కవిత్వంలో ఇమేజరీ మానవశరీరం నుంచి తీసుకున్న చిత్రాలు.

స్త్రీవాద కవయిత్రులు చాలా బలంగా భావచిత్రాలను ఉపయోగించుకున్నారు. మార్గరెట్ అట్వుడ్ రాసిన కవిత ఫోటోగ్రాఫ్ లో భావచిత్రాలను చాలా బలంగా ఉపయోగించుకున్న ఉదాహరణలు దొరుకుతాయి. ఈ కవిత కూడా ఒక మెలాంకలీ అనుభూతి, దాంతో పాటు ఒక స్త్రీ జీవితాన్ని ఒక ఫోటోగ్రాఫ్ ద్వారా నిర్మించిన భావచిత్రాలతో పాఠకుడికి ఆవిష్కరిస్తుంది. ఈ కవితలో సింబాలిజం కూడా గమనించదగింది.

మాయా యాంజిలో కవిత్వంలో కూడా మనకు భావచిత్రాలను బలంగా ఉపయోగించుకున్న అనేక ఉదాహరణలు కనిపిస్తాయి.

Caged bird కవితలో

A free bird leaps on the back

ఈ పంక్తి ఒక బలమైన భావచిత్రం. స్వేచ్ఛగా ఏమైనా చేయగలిగిన ఒక పక్షిని మన కళ్ళ ముందు ఉంచుతుంది.

But a bird that stalks down his narrow cage

ఈ పంక్తి పంజరంలోని పక్షి విషాదచిత్రాన్ని ఆవిష్కరిస్తుంది.

His wings are clipped and his feet are tied

పంజరంలోని పక్షి దుర్భరదృశ్యాన్ని మనకు కవయిత్రి చూపిస్తుంది.

మాయా యాంజిలో రాసిన మరో కవిత Still I rise కూడా భావచిత్రాలను బలంగా వాడుకున్న కవిత.

You may tread me in the very dirt

నువ్వెంత నన్ను అణగదొక్కినా నేను లెక్కచేయను అనే భావాన్ని ఒక భావచిత్రం రూపంలో ఆమె వాడుకుంది.

But still, like dust, rise.

ఈ పంక్తుల్లో ఉపయోగించిన పదాలు Dirt, Dust ఒక అద్భుతమైన భావచిత్రం కళ్ళ ముందు కదిలేలా చేస్తాయి.

Just like moons and like suns

ఈ పదాలు ఒక ఆత్మవిశ్వాసాన్ని దృశ్యరూపంలో ప్రదర్శిస్తున్నాయి.

Does my sexiness upset you?

అనే పంక్తిలో సెక్సీనెస్ అనే పదం కూడా గమనించదగింది. ఈ పంక్తిలో ఒక విసురు ఉంది. కాని అంతకన్నా గమనించదగింది. సెక్సీనెస్ అనే పదం సృష్టించే భావచిత్రం.

a black ocean, leaping and wide,

అనే పంక్తి ఎంత బలమైనదో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఈ కవిత ఇంత బలంగా ఉండడానికి




**నెత్తురోడే పాదాలను బాటంతా పూచిన మోదుగు పూలుగా వర్ణించడంలో ప్రతీకాత్మక అభివ్యక్తి ఉంది. దానితోపాటు ఈ అభివ్యక్తి పాఠకుడి కళ్ళముందు నడుస్తున్న అభాగ్యుల ఎర్రని రక్తమోడే పాదముద్రలను కూడా చూపిస్తుంది. ఎర్రసూర్యుళ్ళుగా శరీరాలను వర్ణించడంలో వారి కడుపులోని ఆకలి మంటలున్నాయి. వారి మనసులో చెలరేగుతున్న నిరాశానిస్పృహల వేడి నిట్టూర్పులున్నాయి.**

ముఖ్యమైన కారణం భావచిత్రాలు.

కేవలం దృశ్యప్రధానమైన భావచిత్రాలు మాత్రమే కాదు. మాయా యాంజిలో రాసిన CAGED BIRDలో ఈ పంక్తి చూడండి

The caged bird sings with a fearful trill

and his tune is heard on the distant hill

ఈ పంక్తులు శబ్దప్రధానమైన భావచిత్రాన్ని సృష్టిస్తున్నాయి.

his shadow shouts on a nightmare scream

ఈ భావచిత్రాలే కవితను బలమైన కవితగా మార్చాయి.

శిలాలోలిత కవిత్వం గురించి మాట్లాడే బదులు నేను మాయా యాంజిలో, కమలాదాస్ ల కవిత్వం గురించి ఎందుకు ప్రారంభించానంటే, వారిద్దరు భావచిత్రాలను ఎంత బలంగా ఉపయోగించుకున్నారో అంత బలంగా తెలుగులో భావచిత్రాలను ఉపయోగించుకున్న కవయిత్రి శిలాలోలిత.

ఉదాహరణకు "అరికాళ్ళ మాటలు" అనే కవిత చూడండి. ఈ

కవిత శీర్షికలోనే ఒక భావచిత్రం ఉంది. అరికాళ్ళు మాటలాడుతున్నట్లు ఒక బలమైన ఊహ. కవిత ఎప్పుడు రాసింది అనేది అంత ముఖ్యం కాదేమో. ఎందుకంటే, నిరసన ప్రదర్శనల కోసం కాలినడకన వచ్చిన రైతుల కాళ్ళు రక్తమోడాయి. లాక్ డౌన్ లో సొంత ఊళ్ళకు తరలిపోతున్న వలసకూలీల కాళ్ళు నెత్తుటి మడుగులయ్యాయి.

ఈ కవితలో

"నెత్తురోడుతున్న పాదాలు
బాటంతా పూచిన మోదుగుపూలు
శరీరాలన్నీ ఎర్ర సూర్యుళ్ళను
తొడుక్కున్నాయి"

బలమైన భావచిత్రాలు. నెత్తురోడే పాదాలను బాటంతా పూచిన మోదుగుపూలుగా వర్ణించడంలో ప్రతీకాత్మక అభివ్యక్తి ఉంది. దానితోపాటు ఈ అభివ్యక్తి పాఠకుడి కళ్ళముందు నడుస్తున్న అభాగ్యుల ఎర్రని రక్తమోడే పాదముద్రలను కూడా చూపిస్తుంది. ఎర్రసూర్యుళ్ళుగా శరీరాలను వర్ణించడంలో వారి కడుపులోని ఆకలి మంటలున్నాయి. వారి మనసులో చెలరేగుతున్న నిరాశానిస్పృహల వేడి నిట్టూర్పులున్నాయి.

ఇలాంటి భావచిత్రాలు ఈ పుస్తకం నిండా కనిపిస్తాయి. "ఒలుకుతున్న రంగులు" కవితలో చూడండి. ఇది చిన్న కవిత. కాని బలమైన ఒక వర్ణచిత్రం.

"రోడ్లన్నీ యుద్ధభూముల్ని
తొడుక్కున్నాయి
బడుగు జీవులు మతకచ్చడాల్లో
బిగించబడుతున్నారు
బస్తాల్లో కూరిన బతుకులన్నీ
గిలగిల్లాడుతున్నాయి
వధ్యశిలకు చెరోవైపు
వేలాడుతూనే ఉన్నాం"

ప్రతి పంక్తిలో ఒక భావచిత్రం ఉంది. యుద్ధభూముల్ని దుస్తుల్లా తొడుక్కున్న రోడ్లు ఏ యుద్ధానికి వెళుతున్నాయి? బతుకులు బస్తాల్లో కూరుకుపోయిన దృశ్యం ఎలాంటి అనుభూతిని సృష్టిస్తోంది? ఈ కవితకు వివరణ ఇవ్వడమంటే కవితను బలహీనపరచడమే అవుతుంది. ప్రముఖ కవి రాహత్ ఇండోరి ఒక సందర్భంలో మాట్లాడుతూ కవితకు వివరణ ఇవ్వవద్దు, అర్థం చెప్పే ప్రయత్నం చేయవద్దు అన్నాడు. ప్రతి పాఠకుడికి కవిత చెప్పే అర్థం వేరుగా ఉంటుంది.

"దవాఖానాలో ఒకరోజు" కవితలో:

"ఉప్పునీటిని తొడుక్కొని కళ్ళన్నీ
సముద్రాల్తో నింపుకున్నాయి"

ఈ పంక్తులు దవాఖానాలో దృశ్యాన్ని చూపించడమే కాదు, నేడున్న పరిస్థితిని కళ్ళకు కట్టి చూపిస్తున్నాయి. సముద్రాలను నింపుకున్న కళ్ళ దృశ్యం పాఠకుడిని ఆలోచనలతో ఉక్కిరి బిక్కిరయ్యేలా చేస్తుంది. ఇంతకన్నా బలంగా నేటి కార్పోరేట్ ఆసుపత్రులపై రాసిన కవిత మరొకటి లేదు. ఈ మొత్తం కవితలో ఇలాంటి భావచిత్రాలు అనేకం కనిపిస్తాయి.

స్త్రీలపై జరుగుతున్న అఘాయిత్యాలు, అత్యాచారాలపై కవయిత్రి ఆగ్రహం అనేక కవితల్లో కనిపిస్తుంది. బలమైన భావచిత్రాలతో పాఠకుడిని ఆగ్రహానికి, ఆవేదనకు, ఆలోచనకు గురిచేస్తుంది. కవిత్వం అనేది Thought, felt అన్నాడు ఒక సందర్భంలో జావెద్ అక్తర్. ఈ కవితలన్నీ ఈ నిర్వచనానికి పూర్తిగా సరితూగేవి. యాస్మిన్, మృదులలు తదితర కవితలతో పాటు 'స్త్రీ' శీర్షికతో వరుసగా రాసిన కవితలు మహిళలు, బాలికలు సమాజంలో ఎదుర్కుంటున్న సవాళ్ళు, ప్రమాదాలపై ఆగ్రహప్రకటనలు. ఆలోచనల సముద్రాలు.

"అందరూ గుర్తొస్తే
ఘనీభవించిన రేఫిల్
మరింక రాయలేనని ఆగిపోయింది"

అనే మాటల్లో భావచిత్రం ఆగిపోయిన కలాన్ని, కదలని కాలాన్ని కళ్ళ ముందు కదిలేలా చేస్తాయి.

ఈ కవిత్వ సంపుటిలో భావచిత్రాల గురించి రాయాలంటే ఒక పరిశోధనా పత్రం స్థాయిలో రాయవచ్చు. "ఒక పక్షి కథ" కవితలో:

"అడవి -భూమి ఇష్టంగా పెంచుకున్న
ఓ అద్భుతమైన పక్షి
....
పాటల్ని ఉరితీసి చెట్ల కొమ్మలమీద
వేలాడదీసి
....
ఆ తర్వాత
పత్రికల్లో అభివృద్ధి ప్రకటన పేజీ
నిండా కనిపిస్తుంది"

ఈ వాక్యాలు మాత్రమే కాదు, ఈ కవితలో ఇలాంటి బలమైన కవిత్వ వాక్యాలు ఇంకా చాలా ఉన్నాయి. అభివృద్ధి పేరిట జరుగుతున్న ఒక దోపిడిని పాఠకుడి కళ్ళముందు ఒక చలనచిత్రంలా చూపించిన కవిత ఇది. ఈ కవితను వివరించడం కన్నా పాఠకులు చదవడానికి వదిలేయడమే మంచిదని అనుకుంటున్నాను.

"తాళాలేసిన కన్నెప్పులు" కవిత శీర్షికలోనే అద్భుతమైన భావచిత్రం వచ్చా అనిపిస్తుంది.

"నీతోనే నా యుద్ధం
బతుకు
సగం తినేసిన చంద్రుడైంది
మంచు సెగ తాకిన సూర్యుడైంది"

ఈ వాక్యాల్లో ఎంత బలమైన భావచిత్రాలున్నాయో ప్రత్యేకంగా చెప్పాలా?

గౌరీలంకేష్ గురించి రాసిన కవిత "శిఖరం నేలకూలింది"లో:

"ధైర్యం ఒరలోంచి నువ్వు విసిరిన
అక్షరాలు
ఊరికే నేలరాలవు
నీ నెత్తుటి విత్తనాలు
మొలకెత్తుతూనే ఉన్నాయి.
ఉంటాయి."

ఇందులో అక్షరాలను కత్తుల్లా చూపించే భావచిత్రం, నెత్తుటి విత్తనాలు మొలకెత్తడం గొప్ప భావచిత్రాల నివాళి.

భావచిత్రాన్ని ఎంత బలంగా వాడుకోవచ్చో చెప్పే గొప్ప ఉదాహరణ "ఏదైనా చేయాలి" కవితలో ఉంది. జుగుప్సను బలమైన కవిత్వప్రకటనగా వాడుకున్న ఉదాహరణ ఇది. ఆ వాక్యం:

"పాలు తాగాల్సిన నోరు వీర్యాన్ని

వ్యాసం

కక్కుకుంటుంది''

ఈ వాక్యం సృష్టించే జుగుప్సాకరమైన, భయంకరమైన సామాజికవాస్తవాల భావచిత్రం ఎందుకు కవయిత్రి వాడారో ఆ కవితలో మీరే చదివి ఆలోచించండి.

భావచిత్రాలకు మరో అద్భుతమైన ఉదాహరణ "పురాస్పర్శ'' కవితలో ఉంది.

"చలి మొదలైంది
స్వెట్టర్ల కోసం, రగ్గుల కోసం
పెట్టెలన్నీ వెతుకుతున్నప్పుడు
ఆ వెతుకులాటలో మొదటగా తగిలిన
మెత్తదనం, అదేమిటో చిత్రంగా
నాన్న జ్ఞాపకంలా అనిపించింది''

చలి అనే పదం ఇక్కడ చాలా బలమైన పదం. ఒక నోస్టాల్జియా, మెలాంకలీ అనుభూతుల్ని వెనువెంటనే సృష్టించే పదం. ఈ పదం వాడడం ద్వారా స్పర్శప్రధానమైన భావచిత్రానికి పునాది వేశారు. మెత్తదనం అనే పదం కూడా గమనించదగింది. నాన్న జ్ఞాపకాన్ని మెత్తదనాన్ని ప్రతీకించడం ద్వారా గొప్ప భావచిత్రాన్ని సాధించారు. నాన్న కోసం కవులు రాసిన గొప్ప కవితల్లో ఇది ఒకటి. ఈ సంపుటిలో నాన్నపై రాసిన మరో రెండు కవితలున్నాయి.

భావచిత్రాలకు ఈ సంపుటిలో అనేక ఉదాహరణలున్నాయి. కొన్ని:

"వర్క్ ఎట్ హోం'' కవితలో

"ఒకప్పుడు
ఇళ్ళు ఇళ్ళుగా ఉండేవి
కర్మాగారాలు, జైళ్ళయిపోయాయి
విహ్వలమైన, దినసరి కూలిబతుకులు
మంచు కురిస్తే ఇక్కడ నేలే కాదు
మనుషులు గడ్డకడ్తున్నారు''

"ఏకబహువచనం'' కవితలో:

"బతుకు బొక్కెనతో
చేదుతున్న కొద్దీ
నీటిముఖంతో మనుషులు
మనసు కురుస్తోంది
వెయ్యి కాళ్ళతో నీళ్ళు
ముంచెత్తుతున్నాయి
శరీరపు మట్టిగోడలు
కూలిపోతున్నాయి
ఆకలి కాగడాల కోరలు చాస్తూ

**చలి అనే పదం ఇక్కడ చాలా బలమైన పదం. ఒక నోస్టాల్జియా, మెలాంకలీ అనుభూతుల్ని వెనువెంటనే సృష్టించే పదం. ఈ పదం వాడడం ద్వారా స్పర్శప్రధానమైన భావచిత్రానికి పునాది వేశారు. మెత్తదనం అనే పదం కూడా గమనించదగింది. నాన్న జ్ఞాపకాన్ని మెత్తదనాన్ని ప్రతీకించడం ద్వారా గొప్ప భావచిత్రాన్ని సాధించారు. నాన్న కోసం కవులు రాసిన గొప్ప కవితల్లో ఇది ఒకటి. ఈ సంపుటిలో నాన్నపై రాసిన మరో రెండు కవితలున్నాయి.**

మండుతోంది
చెరువులు ఇళ్ళల్లో ఈదుతున్నాయి
ఎప్పటికీ వలలో చిక్కని
పెద్ద చేపలు బాజాప్తాగా
తిరుగుతూనే ఉన్నాయి''

ఈ వాక్యాల్లో భావచిత్రాలు గమనించండి. మనుషులు గడ్డకట్టడం అంటే భావావేశాలు, సంతోషాలు, సానుభూతులు, దుఃఖాలు లేని మరమనుషుల్లా మారిపోవడం, బతుకు బొక్కెనతో చేదడం అనే అభివ్యక్తిలో రోజువారి చూస్తున్న మనుషుల బాధలు, నీటిముఖంతో మనుషులు అనే అభివ్యక్తిలో విషాదజీవితాలు, వెయ్యికాళ్ళతో నీళ్ళు అనే అభివ్యక్తిలో వెయ్యికాళ్ళ జెర్రిలాంటి బతుకు, కూలుతున్న శరీరపు గోడలు, ముంపులా కన్నీటి ప్రవాహాలు, ఇళ్ళల్లో ఈదుతున్న చెరువుల అభివ్యక్తిలో విషాదమయమైన జీవితాల దృశ్యం. మొత్తం కవిత బలమైన భావచిత్రాలకు ఉదాహరణ.

1958 జూలై 12 న పుట్టిన శిలాలోలిత అసలుపేరు పి. లక్ష్మి. పుట్టింది, పెరిగింది హైదరాబాద్ కు సమీపంలోని శంషాబాద్. తండ్రిగారు కీ.శే. పురిటిపాటి రామిరెడ్డి హిందీ పండిట్ గా హైదరాబాద్ పరిసరాల్లోనే ఉద్యోగ బాధ్యతలు నిర్వహించడం వల్ల బాల్యమంతా నింబోలిఅడ్డ, మలక్ పేటలలో గడిచింది.

తెలుగుసాహిత్యంలో ఎంఏ, ఎంఫిల్, పిహెచ్‌డిలు పూర్తిచేసి తెలుగు అధ్యాపకత్వంలో ఉండి 2016లో ఉద్యోగ విరమణ చేశారు.

'పంజరాన్నీ నేనే, పక్షినీ నేనే'(1999), 'ఎంతెంత దూరం'(2005), 'గాజునది'(2013)కవితా సంపుటులు, 'కవయిత్రుల కవిత్వంలో స్త్రీ మనోభావాలు'(1993), 'తెలుగు కవయిత్రుల కవితా మార్గం'(2005), 'నారి సారించి'(2006) పరిశోధన గ్రంథాలు వెలువరించారు. 'వర్తమాన లేఖ' కవయిత్రులకు లేఖలు పుస్తకం 2018 లో వెలువడింది.

విజేత, భూమిక, మానవి, విశాలాక్షి, నెచ్చెలి (ఆన్లైన్ పత్రిక) వంటి సాహిత్య పత్రికలలో కాలమిస్టుగా నిరంతరం రాస్తున్నారు. అనేక పుస్తకాలకు సంపాదకత్వ బాధ్యతలను వహించడమేకాక, 'భూమిక' స్త్రీవాద పత్రికకు కొంతకాలం సహ సంపాదకులుగా ఉన్నారు.

శిలాలోలిత కవిత్వంపై ప్రముఖ కవి సౌభాగ్య 'పరిణత కవయిత్రి శిలాలోలిత' పేరిట ప్రశంసా గ్రంథం వెలువరించారు.

తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం, ప్రతిభా పురస్కారం, రమ్యభారతి పురస్కారం, హృదయభారతి పురస్కారం, ద్వానాశాస్త్రి ఉత్తమ పరిశోధన గ్రంథం' పురస్కారం, గుంటూరు జిల్లా రచయితల సంఘం ఉత్తమ కవితా పురస్కారం, ఖమ్మం సాహితీ మాణిక్యం పురస్కారం, వెంకటసుబ్బు పురస్కారం వంటివి అందుకున్నారు.

2008 సంవత్సరం 'ఆకాశవాణి జాతీయకవి' గా తెలుగునుంచి ఎన్నుకోబడి భువనేశ్వర్ లో తన కవిత 'లోగిలి బయట' వినిపించారు.

కవయిత్రిగా తెలుగు సాహిత్యంలో తనదైన అధ్యాయం రాసుకుంటున్న శిలాలోలిత "నేను ఇక్కడి భూమిని'' కవిత్వసంపుటి ద్వారా తెలుగు కవిత్వంలో స్త్రీప్రధాన కవిత్వానికి కొత్త తలుపులు తెరిచారు

## మరాఠా సాహిత్య సమ్రాట్

# విష్ణు సఖారాం ఖాండేకర్



విష్ణు సఖారాం ఖాండేకర్ పేరుపొందిన మరాఠీ రచయిత ఖాండేకర్ 1898 జనవరి 19న మహారాష్ట్రలోని సాంగ్లీలో జన్మించారు. ఈయన జ్ఞానపీఠ పురస్కారమందుకున్న తొలి మరాఠీ రచయిత. తన పాఠశాల రోజుల్లో ఖాండేకర్ అనేక నాటకాలలో కూడా నటించాడు. అతను 1913లో బాంబే యూనివర్సిటీ నుండి మెట్రిక్యులేషన్‌లో మంచి మార్కులతో ఉత్తీర్ణుడయ్యాడు. తర్వాత పూణే వెళ్లి 'ఫెర్గూసన్ కాలేజ్'లో అడ్మిషన్ తీసుకున్నాడు. అతని తండ్రి చనిపోవడంతో అతని మేనమామ అతన్ని దత్తత తీసుకున్నాడు. మేనమామ చదువు మాన్పించడంతో విష్ణు సఖారామ్ ఖాండేకర్ కళాశాల వదిలి ఇంటికి తిరిగి రావాల్సి వచ్చింది. మూడేళ్లు తీవ్ర వ్యాధులతో బాధపడ్డ ఆయన 1920లో కోలుకున్న తర్వాత ఇంటి నుంచి దాదాపు 24 కి.మీ. సుదూర గ్రామంలోని 'షిరోడ్' అనే పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేశారు. అతను 1938 వరకు ఈ పాఠశాలలో బోధించాడు. శిరోద్ ప్రాంతం ఖాండేకర్ యొక్క సాహిత్య రచనలకు చాలా సారవంతమైనదని నిరూపించబడింది, ఎందుకంటే అతను ఈ కాలంలో అనేక రచనలు చేశాడు. 1941లో వార్షిక మరాఠీ సాహిత్య సమ్మేళనానికి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. సాహిత్యం మరియు విద్యారంగంలో 1968లో భారత ప్రభుత్వం ఆయనను పద్మభూషణ్‌తో సత్కరించింది. నవలలు, చిన్న కథలే కాకుండా నాటకాలు, వ్యాసాలు, విమర్శనాత్మక వ్యాసాలు కూడా రాశారు. ఖాండేకర్ యొక్క చక్కటి వ్యాసాలు అతని భాషా శైలి కారణంగా బాగా నచ్చాయి. అతను రచించిన యయాతి నవలకు 1960లో సాహిత్య అకాడమీ అవార్డు (మరాఠీ) లభించింది. ఖాండేకర్ యయాతితో సహా 16 నవలలు రాశారు. వీటిలో హృదయాచి హాక్, కంచన్మృగ్, ఉల్కాపాతం, ఫస్ట్ ప్రేమ్, అమృతవేల్, టియర్‌డ్రాప్, సోనేరి స్వప్నే భాంగ్లేలీ ఉన్నాయి. అతని రచనల ఆధారంగా, ఛాయా, జ్వాల, దేవత, అమృత్, ధర్మపత్ని మరియు పరదేశి వంటి చిత్రాలు మరాఠీలో నిర్మించబడ్డాయి. హిందీలో కూడా జ్వాల, అమృత్, ధర్మపత్ని పేర్లతో సినిమాలు తీశారు. మరాఠీ చిత్రం లగ్నా పహావే కరూన్‌కి స్క్రీన్‌ప్లే మరియు సంభాషణలు కూడా రాశారు. ఆయనకు అనేక మరాఠీ అవార్డులతో పాటు సాహిత్య అకాడమీ మరియు భారతీయ సాహిత్యంలో అత్యున్నత గౌరవమైన జ్ఞానపీఠ్ అవార్డు లభించింది. భారత ప్రభుత్వం ఆయనను పద్మభూషణ్‌తో సత్కరించింది. 1998లో ఆయన గౌరవార్థం ప్రభుత్వం స్మారక పోస్టల్ స్టాంపును విడుదల చేసింది. ఖాండేకర్ ఆరోగ్యం బాగోలేక జీవితాంతం బాధపడాల్సి వచ్చింది. అతని దృష్టి పోయింది, కానీ 78 సంవత్సరాల వయస్సులో కూడా, అతను ప్రముఖ మరాఠీ వార్తాపత్రికలు మరియు మ్యాగజైన్‌లకు క్రమం తప్పకుండా కూర్పు-మద్దతు ఇస్తూ సాహిత్య ప్రపంచంలో ప్రతి కొత్త కార్యాచరణతో సన్నిహితంగా ఉండేవాడు. ఈ ప్రసిద్ధ మరాఠీ రచయిత 2 సెప్టెంబర్ 1976న మరణించారు.

**విష్ణు సఖారాం ఖాండేకర్‌కు మరాఠీ అవార్డులతో పాటు సాహిత్య అకాడమీ మరియు భారతీయ సాహిత్యంలో అత్యున్నత గౌరవమైన జ్ఞానపీఠ్ అవార్డు లభించింది. భారత ప్రభుత్వం ఆయనను పద్మభూషణ్‌తో సత్కరించింది.**

కవిత



# ఊహలకే ఊపిరొస్తే...



కోరుప్రోలు హరనాథ్, 97035 42598

మధురమే కదా స్నేహం
ఎదలు పొంగగా
సుధలు కురియగా
ప్రణవనాద గానమై
ప్రణయ హృదయ కుసుమమై
అద్భుతమైన స్నేహ మాధుర్యం
స్నేహానికే ప్రతిరూపం
ఏ స్నేహమైనా కలకాలం ఉన్నప్పుడు
ఏ కళాకారుడైనా, చిత్రకారుడైనా
కవిపుంగవుడైనా
ఎన్నెన్నో కవితలల్లుతూ
తన ఊహల్లో ఆ స్నేహశిఖ ఉంటే
తనే ఒక గ్రంథం
మాసిపోని బంధం
మమతల మల్లెలై
సమతల సన్నజాజులై
కలువ పువ్వులా
చిరకాలం చిరునవ్వు లొలికించే
ఆ స్నేహశిఖకే
ఆ ఊహసుందరికే
నా కవితలన్నీ అంకితం
ఎక్కడో ఆ ఊహ స్నేహసుందరి
ప్రేరణనిచ్చే ప్రేమ సుందరి
కలలోనైనా రావా
ఓ వనితా
నా ఓ... స్నేహ స్వప్నసుందరి.

కథ

# అనుకోని అదృష్టం

ఇంట్లో తనవాళ్లతో గడిపిన పెద్దావిడ అనుభూతి...



కూర చిదంబరం
86393 38675

జానకమ్మకు ఇద్దరు కూతుళ్ళు, ఇద్దరు కొడుకులు. ఆమె సంతానాన్ని, వారి పిల్లల్ని కలిపి లెక్కిస్తే, మొత్తం ఇరవయి మంది. అయినా, ఆమెది ఒంటరి బ్రతుకే!

అలా అని ఆ లంకంత ఇంట్లో జానకమ్మ ఒక్కర్తే ఉండటం లేదు. డెబ్బయి అయిదేళ్ళ ఆమె భర్త రాఘవ రావు, రెండు ఆవులు, లేగదూడలు, ఇరవయి అయిదు ఎకరాల వ్యవసాయం, పాలేర్లూ, పని మనుషులు ఉంటారు.

ప్రొద్దున వీరందరితో ఆ ఇల్లు కళకళలాడుతూ కనిపిస్తుంది. పొద్దెక్కక ముందే భర్త పొలం వేపు పోతాడు. ఆవుల్నీ దూడల్నీ తోలుకుని, పాలేర్లూ, పనిమనుషులూ పొలాల వేపు వెళ్తారు. భర్త పొలం వేపు వెళ్ళగానే, పడగ్గది అంత విశాలంగా ఉన్న పూజగది శుభ్రం చేసుకుని పారాయణం చేసుకుంటుంది. పొయ్యిమీదకు ఎసరు ఎక్కించి, కూరా, నారా తయారు చేసుకునేసరికి కాస్త అటూ, ఇటుగా పన్నెండవుతుంది. పాలేరు రంగడికి భర్త గురించి కారియర్ కట్టి ఇచ్చి తన భోజనం కానిస్తుంది.

దూరంగా ఉంటున్న ఇరుగు పొరుగు వారెవరయినా ప్రత్యేకంగా, పనిగట్టుకుని పలకరిస్తే గాని, పిల్లలు 'వాట్సప్'ల్లో అప్పుడప్పుడు ఆమెతో సంభాషిస్తే తప్ప సాయంకాలం భర్త తిరిగి వచ్చేంతవరకూ, ఆమె ఒంటరే!

జానకమ్మకు పెళ్లయిన కొత్తలో, ఆమె అత్తగారిని పలకరించేందుకు ఇరుగు పొరుగువారు వచ్చి కూర్చునేవారు. వత్తులు చేసుకుంటూనో, రాట్నం వడుక్కుంటూనో, విస్తళ్ళు కుట్టుకుంటూనో కాలక్షేపం చేసేవారు, వారపత్రికల్లోని కథలూ, సీరియల్ కథలు జానకమ్మతో చదివించుకునేవారు. కథల్లోని పాత్రలైన రాజు సింహుడు భువన సుందరిని వచ్చేవారమైనా పెళ్ళాడుతాడా, లెక్చరర్ విశ్వంను ఆరాధిస్తున్న స్టూడెంటు శైలజ మరెన్ని అడ్డంకుల్ని ఎదుర్కొంటుందీ అన్న ఉబుసుపోని కబుర్లతో సాయంత్రం దాకా గడిపేవారు. ఆ కబుర్లలో జానకమ్మ పాలుపంచుకోకున్నా, ఆమెకూ మంచి కాలక్షేపంగా ఉండేది.

జానకమ్మ హయాము వచ్చేసరికి టీవీలు వచ్చాయి. నలుగురు అత్తలు ఒకచోట చేరితే, 'తమ గురించి ఏమి మాట్లాడుకుంటారో' అని అనుమానపడే కోడళ్ళు వచ్చారు. అందువల్ల ఆమె ఈడువారందరూ ఇళ్ళకూ, టీవీ సీరియళ్ళకు పరిమితం అయ్యారు. రాఘవరావు హయాము వచ్చేసరికి విశాలంగా ఉంటుందని ధాన్యం, ఎరువులు బస్తాలు, ట్రాక్టర్లు, తదితర పనిముట్లు ఉంచుకోవటానికి అనువుగా ఉంటుందని ఊరికి కొంచెం దూరంగా ఓ భవంతిని కట్టించాడు. ఉద్యోగాలు అంటూ కొడుకులు, పెళ్ళిళ్ళు అంటూ కూతుళ్ళు వెళ్ళిపోయాక జానకమ్మ మరీ ఒంటరిదయింది.

మామూలు రోజులు ఎలా ఉన్నా, ఎలా గడిచిపోయినా, కనీసం పండగ నాడైనా, పిల్లలందరి మధ్య వేడుకగా జరుపుకోవాలన్న ఆమె కోరిక ఎండమావిలానే ఉండిపోతోంది. ఎంత పట్టుపట్టి ప్రయత్నించినా, ఎంతముందుగా నిర్ణయించుకున్నా, తీరా సమయానికి ఒకరిద్దరు గైరుహాజరు! పని ఒత్తిడి, సెలవులు దొరక్కపోవటం, స్కూళ్ళలో పిల్లలకు 'ప్రాజెక్టు వర్క్'ల్లాంటి కారణాలు వారిని రాకుండా అడ్డుపడేవి.

ఆడపిల్లలయినా, మగపిల్లలైనా, చదువు ఉండాల్సిందేనని రాఘవరావు తన సంతానాన్ని కాలేజీ వరకు చదివించాడు. స్థితిమంతులైన కుటుంబాల్లోంచి అల్లుళ్ళను, కోడళ్ళను తెచ్చుకున్నాడు. పెద్ద కూతురు రమాసుందరి. డిగ్రీ వరకు చదివింది. అల్లుడు ప్రభుత్వరంగ బ్యాంకులో జనరల్ మేనేజరు, ఢిల్లీలో ఉంటారు. పెద్ద హోదా, ఇల్లూ, కారు ఉంది. పదేళ్ళ వయసున్న కవలలిద్దరూ స్కూలుకి వెళ్ళుతారు. అవటానికి గృహిణే! అయినా, క్షణం తీరిక లేదు అంటుంది రమాసుందరి. తల్లిదండ్రుల ఒంటరి తనాన్ని అర్థం చేసుకున్న ఆమె తల్లితో

కథ

అప్పుడప్పుడు మధ్యాహ్నం వేళ ఫోను చేసి మాట్లాడుతుంది. రమాసుందరి తర్వాత ఇద్దరు కొడుకులు, చివరగా కూతురు అమెరికాలో స్థిరపడ్డారు. అందరూ ఉద్యోగాలు చేస్తారు. ఎంత పెద్ద ఉద్యోగంలో జానకమ్మకు తెలియదు. కాని, వారాంతాల్లో తప్ప వాళ్ళకు మాట్లాడే తీరిక కూడా ఉండదు. అందునా, ఇక్కడి పగలు వాళ్ళకు రాత్రి. అర్ధరాత్రి, అపరాత్రి పిల్లలను డిస్టర్బ్ చేయడం రాఘవరావుకు ఇష్టం ఉండదు.

'అత్త కొట్టినందుకు కాదు, తోటి కోడలు నవ్వినందుకు' అన్నట్లు జానకమ్మ బంధువుల పిల్లలు, పరిచయస్తులు దసరానాడు జమ్మిపత్రి చేతిలో పెట్టి ఆశీర్వాదం తీసుకోవటానికి వస్తేనో, సంక్రాంతి నోము నోచుకుని, పంచటానికో, మరేదైనా శుభసందర్భాల్లో, పిన్నీ అనో, అత్తా అనో ఆమెను కలవటానికి వస్తే జానకమ్మ మనసు కలిచివేసేది. శూన్యం అయ్యేది.

పిల్లలందరి మధ్య సంతోషంగా కనీసం నాలుగు రోజులైనా గడపాలన్న ఆమె కోరిక అసాధ్యం కాకున్నా 'అందని పండు' అనిపించేది.

**"జానకీ! నీ పిచ్చిగాని, ఇప్పటి జనాలు ఫస్టు జనవరికి క్రొత్త సంవత్సరం వచ్చిందనుకుంటారు. విరోధికో, శార్వరికో క్రొత్త సంవత్సరం వచ్చిందనుకోరు. పైపెచ్చు వాళ్ళందరికీ ఒకేసారి సెలవు దొరకటం కష్టం. మరోమాట నీకు తెలుసును కదా! నాకు ఈ పుట్టినరోజు వేడుకలు జరుపుకోవటం ఇష్టం లేదు. పిచ్చిపిచ్చి ఆలోచనల్లో బుర్రపాడు చేసుకోవద్దు" అంటూ సున్నితంగా మందలించాడు.**

★ ★ ★

క్రొత్త సంవత్సరం 2020 వచ్చింది. ఎప్పటిలానే 'హాయ్ అమ్మా!' అనో, 'హాయ్ గ్రాండ్ మా!' అనో ఫోనులోనే చెప్పుకున్నారు. పెద్ద పండగ సంక్రాంతి కూడా జానకమ్మకు 'మామూలు'గానే గడిచిపోయింది.

ఏదో ఓ సందర్భంలో ఉగాది శార్వరి మరో రెండు నెలలకు వస్తుందనుకున్నారు ఆ దంపతులు. శార్వరి అనగానే జానకమ్మకు రాఘవరావు పుట్టినరోజు గుర్తుకు వచ్చింది. ఆయన పార్థివనామ సంవత్సరం సరిగ్గా ఉగాది నాడే పుట్టాడనీ, శార్వరి ఉగాదితో ఆయనకు 75 వెళ్ళి 76లో అడుగిడతాడని గుర్తుకు తెచ్చుకున్నది. అత్తామామలున్నపుడు రాఘవరావు పుట్టిన దినమంటూ ఉగాది నాడు ప్రత్యేకంగా జరిపేవారు. వాళ్ళతరం గడిచాక రాఘవరావు నిరాసక్తత వల్ల ఆయన పుట్టిన దినం ఏ విశేషము లేకుండానే గడిచిపోయేది.



75 సంవత్సరాలు పూర్తి చేసుకోవటాన్ని వజ్రోత్సవం అంటారని, జానకమ్మకు గుర్తుకు వచ్చింది. పండగలు మళ్ళీ మళ్ళీ వస్తాయి. కాని వజ్రోత్సవం లాంటి సందర్భం మరోసారి రాదు. ఈతేప ఉగాది 25 మార్చి వస్తోంది. క్రిస్మస్, న్యూ ఇయర్, దసరా, దీపావళులకు సెలవులు దొరకటం కష్టం. మార్చి నెలలో మరే పెద్ద పండగ, విశేషం లేదు. కనుక, ప్రయత్నిస్తే పిల్లలకు సెలవులు దొరుకుతాయనిపించింది. పెద్ద కూతురు రమతో 'వజ్రోత్సవం సాకుతోనైనా, పిల్లలందరినీ చూడాలని ఉంద'ని మనసు విప్పుకుంది.

రమ కాస్త మెత్తబడగానే, తమ్ముళ్లను చెల్లెలు వాళ్లను ఒప్పించే బాధ్యత నీదేనంది.

సమయం చూసి ఓ రోజు భర్త రాఘవరావుతో విషయం ప్రస్తావించింది.

ఆయన తేలిగ్గా కొట్టిపారేసాడు.

"జానకీ! నీ పిచ్చిగాని, ఇప్పటి జనాలు ఫస్టు జనవరికి క్రొత్త సంవత్సరం వచ్చిందనుకుంటారు. విరోధికో, శార్వరికో క్రొత్త సంవత్సరం వచ్చిందనుకోరు. పైపెచ్చు వాళ్ళందరికీ ఒకేసారి సెలవు దొరకటం కష్టం. మరోమాట నీకు తెలుసును కదా! నాకు ఈ పుట్టినరోజు వేడుకలు జరుపుకోవటం ఇష్టం లేదు. పిచ్చిపిచ్చి ఆలోచనల్లో బుర్రపాడు చేసుకోవద్దు" అంటూ సున్నితంగా మందలించాడు.

రాఘవరావు పైకి అలా అన్నాడు గాని,

కథ

ఆయనకూ పిల్లలందరినీ ఒకేచోట ఓసారి చూసుకోవాలని ఉంది. ఆయన స్నేహితులు పొలాల దగ్గర మధ్యాహ్నం వేళ కలిసి భోంచేస్తారు. వాళ్ళందరూ తమ మనవలు, మునిమనవల గురించి, వాళ్ళ ఆట పాటల సంరంభం గురించి వెండి మీసాల మధ్య గర్వరేఖలు - పొడసూపగా చెబుతోంటే, ఆయన మనసు పైకి కనబడకున్నా చిన్నబోయేది.

అందుకు కావొచ్చు; జానకమ్మ తలపెట్టిన ఆ వజ్రోత్సవ వేడుక వేళా విశేషమే కావచ్చు. రాఘవరావు కూడా తన సహకారాన్ని పరోక్షంగా అందించాడు.

శార్వరి ఉగాది అంటే మార్చి ఇరవయి అయిదున పిల్లల మధ్య ఆయన వజ్రోత్సవం జరపటానికి నిశ్చయం అయింది.

అటు రమాసుందరి తన తమ్ముళ్ళను, మరదళ్ళను, చెల్లెల్నీ, మరిదినీ ఒప్పించింది. 'పెద్దవాళ్ళు అవుతోన్న తలిదండ్రుల చిన్నచిన్న సరదాలు అప్పుడప్పుడు తీర్చగలిగితేనే బిడ్డల విలువ' అంది.

నలుగురు పిల్లలు వాళ్ళ వాళ్ళ పిల్లలతో మార్చి మొదటివారం ఇండియాకు వచ్చి, చివరి వారం తిరిగి స్వస్థలాలకు వెళ్ళాలని నిశ్చయించుకున్నారు. జానకమ్మ ఆనందానికి అవధులు లేవు. అందరినీ ఒక్కసారి ఒక్కచోట చూసి ఎన్నాళ్ళయిందో లెక్క పెట్టే ప్రయత్నం చేసింది. ఆ లెక్కకు ఆమె రెండు చేతులవ్రేళ్ళు సరిపోలేదు.

అంచెలంచెలుగా మార్చి మొదటి వారానికల్లా జానకమ్మ పిల్లలు, వారి సంతానం ఇల్లు చేరారు. వాళ్ళు అమెరికా నుండి బయలుదేరే వరకే కోవిడ్ మహమ్మారి, ఆ దేశాన్ని వణికిస్తున్నది. ఎలా వ్యాపిస్తుంది? నివారణ చర్యలు ఏమిటి? అన్న విషయాల మీద పలువురు పలు రకాలుగా సలహాలు ఇస్తున్నారు. ఉద్యోగాలు చేస్తున్న వారికి 'ఇంటి నుంచే పని' అని ఆయా, సంస్థలు ఆదేశాలిచ్చాయి.

మార్చి 22న దేశంలోనూ 'కోవిడ్ -19' అంటూ 'లాక్ డౌన్' ప్రకటించారు. మాస్కులు ధరించాలని, 'సామాజిక దూరం' పాటించాలని ఆదేశాలిచ్చారు.

ఊరికి దూరంగా ఉన్నా, ప్రశాంతమైన గాలి, వాతావరణంలో ఉన్నా, రాఘవయ్య ఆదేశాల మేరకు అందరూ నియమాలను పాటిస్తున్నారు.

మనవలు, మనవరాండ్ర మధ్య గడుపుతోన్న జానకమ్మకు ఇరవయి నాలుగు గంటలు సరిపోవటంలేదు. "గ్రాండ్ మా" అంటూ, ఆమె వెంటవెంటే తిరుగుతున్నారు. రెండో అబ్బాయి కొడుక్కు, చిన్నమ్మాయి కూతురుకు మూడేళ్ళు నిండుతాయి. వాళ్ళు తమ వచ్చీరాని మాటలతో తెలుగూ ఇంగ్లీషు కలగలిపిన భాషతో ఆమెకు ఆనందాన్ని కలగచేస్తున్నారు. 'గ్రాండ్ మా' కూడా చిన్నచిన్న ఇంగ్లీషు పదాలు నేర్చుకుంటున్నది. ఎన్నడూ చూడని ఆవులు, లేగదూడలు వాటితో ఆటలు పిల్లలకూ సర్దాగానే ఉంది. రాత్రవగానే పిల్లలందరూ ఆమె పక్కన చేరి కథలు చెప్పించుకుంటున్నారు. 'గ్రాండ్ మా నాది' అంటే 'నాది' అంటోన్న వారి పోట్లాటలకు జానకమ్మ పులకించిపోతోన్నది.

కొంచెం వయసు వచ్చిన మనవలు, మనవరాండ్రు వాళ్ళ ట్యాబ్ 'స్క్రాబిల్స్' లాంటి ఆటవస్తువుల్ని ప్రక్కకు పెట్టి 'తాతయ్య'తో పొలాల వేపు వెళ్తున్నారు. అక్కడ పొలాలు, చెట్లు, పక్షుల గురించి వింతగా తెలుసుకుంటున్నారు. పెద్ద మనవడికైతే ఏకంగా ట్రాక్టర్ నడపటం, ఎడ్లబండి తోలటం వచ్చింది. ఆస్ట్రోనాట్ అవాలనుకున్నవాడు ఇప్పుడు తాతయ్య దగ్గరే ఉండిపోయి సేద్యం చేస్తానంటున్నాడు. కాలంతో పోటీపడుతూ, ఉరుకుల పరుగుల తల్లిదండ్రుల కంటే, రాఘవరావు జానకమ్మల ప్రేమ, వాళ్ళని ఎంతోగానో ఆకట్టుకుంటున్నది.

**75 సంవత్సరాలు పూర్తి చేసుకోవటాన్ని వజ్రోత్సవం అంటారని, జానకమ్మకు గుర్తుకు వచ్చింది. పండగలు మళ్ళీ మళ్ళీ వస్తాయి. కాని వజ్రోత్సవం లాంటి సందర్భం మరోసారి రాదు. ఈతేప ఉగాది 25 మార్చి వస్తోంది. క్రిస్మస్, న్యూ ఇయర్, దసరా, దీపావళులకు సెలవులు దొరకటం కష్టం. మార్చి నెలలో మరే పెద్ద పండగ, విశేషం లేదు. కనుక, ప్రయత్నిస్తే పిల్లలకు సెలవులు దొరుకుతాయనిపించింది.**

జానకమ్మను ప్రక్కకు తప్పించి ఆడపిల్లలు వంటింటి బాధ్యత తీసుకున్నారు. క్రొత్తక్రొత్త వంటకాలు రుచి చూపిస్తున్నారు. ఉదయం కాంటినెంటల్ బ్రేక్ఫాస్టు అయితే, మధ్యాహ్నం షడ్రసోపేతమైన తెలుగు వంటకాలు. సాయంత్రం చైనీస్ స్నాక్స్ అయితే, రాత్రి ఉత్తర భారతదేశపు రోటీ, పరోటాలు...

కాస్త తీరిక చిక్కితే చాలు. పచ్చీసు, గవ్వలాట, గచ్చకాయలు. అటకెక్కిన వామన గుంటల పీట వాళ్ళను ఇప్పుడు సంతోషపరుస్తున్నది.

జానకమ్మ వడిలో పిల్లలు కరువు తీరా కమ్మని కబుర్లు చెప్పుకుంటున్నారు. ఆమెకూడా అంతే సంతోషంగా ఉంటోంది.

'ఇంట్లోంచే పని' చేస్తున్న మగవారు నాలుగైదు గంటలు గది తలుపులు బిగించుకున్నా. సాయంత్రం పొలాలవేపు షికారు వాళ్ళను ఉత్తేజపరుస్తున్నది. జనారణ్యపు అమెరికాకంటే ఈ వనారణ్యం వారిని ఉల్లాసపరుస్తున్నది.

శార్వరి ఉగాది, రాఘవయ్య వజ్రోత్సవం, ఏ హంగూ, ఆర్భాటం లేకుండా కుటుంబసభ్యుల మధ్య ఆనందంగా గడిచిపోయాయి.

స్తంభించిన విమానయానాలు జులై చివరి వారానికి గాని తెరుచుకోలేదు.

'నాలుగు వారాలు, నా వారు, నా మధ్య ఉంటే ఉంటే బావుండును' అని అనుకున్న జానకమ్మకు ఈతేప పిల్లల రాక ఆయాచితంగా దొరికిన అపురూపమైన అదృష్టం అనిపించింది.

# అద్వితీయ భారతి



డా॥ చింతల రాకేశ్ భవాని, 92466 07551

ఇప్పుడు మేమిక్కడ
స్వేచ్ఛను మువ్వన్నెలుగా ఎగరేస్తున్నాము
ఈ దేశకీర్తి, ఏ సరిహద్దులాపలేని
గాలితో కలసి ప్రపంచమంతా విస్తరిస్తుంది

సింధూ నాగరికతతో శోభిల్లిన నేల
సహనాన్ని, జ్ఞానాన్ని, శౌర్యాన్ని
సంస్కృతీ వారసత్వంగా నూరిపోసింది
ప్రపంచానికే శాంతిభిక్ష పెట్టిన బోధివృక్షం
లోకశ్రేయస్సుకై మౌనముద్రలో శ్వాసిస్తుంది
మా పొలాలలో పండిన
మానవత్వం, సౌభ్రాతృత్వం
విశ్వవీణియపై సామగానాన్ని పాడుతాయి

వైవిధ్యాల మధ్య ఏకత్వంగా
భాసిల్లే ఈ దేశంలో
సౌహార్ద్రం, సామరస్యం సూర్యచంద్రులుగా పుడతాయి

రాళ్ళూ రప్పలకు, చెట్లూ చేమలకు
మొక్కే సుగుణం
జీవిజీవిలో దైవాన్ని దర్శిస్తుంది
సత్యం, అహింసలను
ఒకటిగా అల్లుకుపోయిన జాతి
ప్రపంచానికి ఆదర్శమై నిల్చుంది

ఈ నేల అణువు అణువు
ఓ మౌనిగానో, ఓ తపస్విగానో,
ఓ యోగిగానో జన్మనెత్తింది

గంగా, యమునా, కృష్ణా,
గోదావరీ, కావేరీ, తపతీ, నర్మదా
నది ఏదైనా, నీరమేదైనా అమృతమే పారుతుంది

త్యాగధనుల భుజాల మీద నిలబడ్డ ఈ దేశకీర్తి
తల్లిభారతి అందెల రవళుల సుశ్లోకమై,
అద్వితీయమై యుగాలవరకు ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది.



వ్యాసం

# దోరవేటికి హాట్సాఫ్

మతం కన్నా మానవత గొప్పది అని
ఫలశ్రుతి కలిగిన నవల...

డా॥ కాంచనపల్లి
గోవర్ధన రాజు

దోరవేటి పద్యకవిగా ప్రసిద్ధులు. కథా రచయితగా గత ముప్పై ఏళ్ళ నుండి ప్రస్థానిస్తున్నారు. పాటల రచనలో కూడా హస్తవాసి చూపిస్తారు. ఒక కవిగా నేనెరిగిన దోరవేటిని నవలారచయితగా చూసేసరికి ఆశ్చర్యం కలిగింది. సంప్రదాయిక దుస్తులతో, చెరగని చిరునవ్వుతో ప్రేమగా మర్యాదగా పలకరించే దోరవేటిలో ఇన్ని ప్రక్రియలు దాగి ఉన్నాయి. తగిన శిల్పనైపుణి కూడా వుంది.

సాధారణంగా కవులు నవలా రచన వైపు వచ్చినప్పుడు వాళ్ళకు సహజంగా ఉన్న వర్ణనాలౌల్యం, తన కిష్టమైన విషయాన్ని చెప్పేటప్పుడు మైమరచి విస్తరించడం, అనవసరమైన అలంకార ప్రయోగాలు లాంటివి చూస్తుంటాం. మొదట్లో దోరవేటి నవలను గురించి నేనూ అట్లాగే అనుకున్నా. చదవక తప్పదు కాబట్టి చదవడం మొదలుపెట్టాను.

నాలుగైదు పేజీలు బలవంతంగానే చదివాను. ఇక తరువాత మనం చదవాల్సిన అవసరం లేదు. ఆయన చెప్పే విధానమే మనల్ని చివరి వరకు లాక్కెళు తుంది.

ఇది చాలాకాలం క్రితమే ఆంధ్రప్రభలో సీరియల్‌గా వచ్చిన నవల. ఇన్నిరోజులు చదవకపోవడం నాకు చాలా మిస్ అయ్యానని అనిపించింది.

దోరవేటి తాత్విక దృక్పథం



జాతీయవాదం. దాన్ని నిరూపించడానికి ఆయన ఎంచుకున్న ప్లాటు, దాన్ని క్రమంగా ముందుకు నడిపించిన తీరు నన్ను చకితుణ్ణి చేసింది.

నవలలో కనిపించే పాత్రలన్నీ మనకు నిత్యం సమాజంలో కనిపించేవే. ఈశ్వర్, ఎజాజ్, అక్బర్, చారి, విశారదుడు, ఉష, సంతోష, ఆనందవర్ధనుడు, వైజయంతి, సబ్‌ఇన్స్‌పెక్టర్ రవీందర్, హెడ్ కానిస్టేబుల్ మల్లారెడ్డి ఇట్లా అంతా మనముందు సజీవంగా కనిపిస్తారు. "By reading narratives, we can empauthise and understand others" అన్న Judith Caesar మాటలు గుర్తుకు వస్తాయి. కథలో ఈశ్వర్ అనే యువకుడు పట్టుదలకు మారుపేరు.

మావోయిస్టు అయిన అన్న కోసం పోలీసులు వస్తే భయపడి అక్కన్నపేట అనే తన ఊరి నుండి లింగమడుగుపల్లెకి వెడతాడు. అక్కడ కౌముది అనే అందాలరాశిని చూస్తాడు. ఆమెపై ఖలీల్ అనే మరో వ్యక్తి యాసిడ్ దాడి చేస్తే రక్షించబోయి మరో ప్రమాదంలో ఇరుక్కుంటాడు. తన దెబ్బలకు ఖలీల్ చనిపోయాడని భయపడి హైదరాబాద్ పారిపోతాడు.

చిట్టంపల్లి అనే గ్రామంలో రహీం రషీద్‌ల కొడుకు, అక్బర్ రియల్ ఎస్టేట్ వ్యాపారంలో గొడవ పడుతుంటే రషీద్ కొడుకు ఎజాజ్ (అక్బర్ వరుస అన్న) వారించబోతే అక్బర్ తిరుగబడి అతన్ని కొడతాడు. అక్బర్ అన్నైన తనను ధనం పొగరుతో తిరగబడి కొట్టాడని అవమానం తో తాను పట్నం వెళ్ళి బాగా డబ్బు సంపాదిద్దామని బయలుదేరుతాడు. ఈశ్వర్-ఎజాజ్ రైల్వేస్టేషన్‌లో పోలీసులకు చిక్కుతారు. ఎస్.ఐ. రవీందర్, మల్లారెడ్డి వాళ్ళను అనేకరకాలుగా పరీక్షిస్తారు. ఎజాజ్ తన చిత్రకళతో బయట పడతాడు. ఎజాజ్, రహమాన్ అనే మోసగాని వల్ల చివరికి ముస్లిం తీవ్రవాద సంస్థకు చిక్కి చివరికి వాళ్ళ శిక్షణ వల్ల తీవ్రవాదిగా మారుతాడు. మతం కోసం ప్రాణం ఇచ్చే స్థితికి వస్తాడు. హత్యలు చేస్తాడు. కాఫిర్లను అంతం చేయడమే

లక్ష్యం అనుకొంటాడు. ఎజాజ్‌తో పాటు పోలీసులకు చిక్కిన ఈశ్వర్ నిస్సహాయంగా ఉండిపోతాడు. చివరికి పోలీసులకు ఈశ్వర్ సిన్సియారిటీ అర్థమౌతుంది. ఎస్.ఐ. రవీందర్ అతన్ని ఒక అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌గా ఉంచుతాడు. అక్కడ పర్‌వర్టెడ్‌గా ఉన్న వైజయంతి పరిచయమౌతుంది. ఈశ్వర్ ఆమెని సరిగా అర్థం చేసుకోవడం వల్ల తన సహనంతో ఆమెని తనవైపు మలచుకొంటాడు. వైజయంతి ఈశ్వర్‌కి తల్లిలాగా మరింత చేరువౌతుంది. చివరికి ఖలీల్ బతికే ఉన్నాడని తెలుస్తుంది.

కౌముదిని ఆమె బంధువు సుధీర్ అనుభవించాలనుకొని భంగపడతాడు. ఖలీల్ అన్న దుండగులతో కలిసివెళ్ళి ఈశ్వర్ ఇంటిపై దాడిచేసి సర్టిఫికెట్లు చింపివేస్తారు.

చివరికి ఖలీల్ అన్న సుధీర్ కలిసి ఈశ్వర్‌ని చంపాలని కుట్ర పన్నుతారు. తీవ్రవాదిగా మారిన ఎజాజ్ తాను చేసే అరాచకాలన్ని అల్లాకు ప్రియమే అనుకుంటాడు. చివరికి తాను హత్యకు నియోగించిన నయీమ్ వల్లే అతనికి కనువిప్పు కలుగుతుంది. పశ్చాత్తాపం కలిగినా నిస్సహాయంగా కర్తవ్యం నిర్వహించాలనుకుంటాడు. ఒక ముస్లిం యుద్ధ సైనికుని అంతిమయాత్రలో పాల్గొంటాడు. అతనికి దేశభక్తి తెలుస్తుంది. అమ్మ, ఇల్లు తమ్ముడు గుర్తుకు వస్తుంటారు. మానవ సంబంధాలలోని మాధుర్యం అవగతమౌతుంది.

ఈశ్వర్ - కౌముదిల ప్రణయం మరింత వికాసం చెందుతుంది. చివరికి ఎజాజ్ బాంబు ప్రయోగం చేస్తుంటే ఈశ్వర్ - ఎజాజ్‌లిద్దరూ గాయపడతారు. కౌముది - ఈశ్వర్‌ల కలయికతో నవల ముగుస్తుంది.

నేను మొదటే అన్నాను. దోరవేటి పద్యకవి అని. అది ఒక సందర్భాన్ని ప్రకటించి ఆయన ఓ పద్యం పలికిస్తారు. అదేవిధంగా కౌముదిని వర్ణించేటపుడు ఈ రచయిత గడుసుదనం చూడండి. "భూమికలోని ముగ్ధత్వం, త్రిషలోని వయ్యారం, కత్రినాలోని తాజాదనం కలబోసినట్టుందామె.

ఇంకా ఈ నవలలో గమనించదగిన మరో విశేషం ఒక ముస్లిం కుటుంబం యొక్క జీవనగతికి హిందూ కుటుంబం యొక్క జీవనగతికి పెద్దగా బేధం కనిపించదు. అక్బర్ రియల్ ఎస్టేట్ చేయడం, అతను ఒక వ్యక్తితో గొడవ పడడం, అన్న ఎజాజ్ కల్పించుకొని సమజ్ చేయడం, అక్బర్ వినకపోవడం, అన్నపై తిరగబడడం, తాను డబ్బు సంపాదిస్తున్నానని తన దాయాది అయిన అన్న ఈర్ష్యపడుతున్నాడని అక్బర్ భావించడం, ఇదంతా మత స్వభావానికి అతీతమైన మానవ స్వభావంగా భావించాలి.

చిట్టంపల్లిలో రహీమ్ రషీద్ కుటుంబాలకు మంచి పేరుంది. హిందూ కుటుంబాలలోని మర్యాదస్తుల కుటుంబ లక్షణాలు మనకు కనబడతాయి. ఎజాజ్ వెళ్ళిపోయాక అక్బర్ పశ్చాత్తాపడడం, తనవాళ్ళతో కలిసి అక్బర్ కూడా హైదరాబాద్ వెళ్ళి ఎజాజ్‌ని వెతకడం మానవ సంబంధాలలోని మమకారం తెలియజేస్తుంది. అట్లాగే ఎజాజ్ తల్లి ఎజాజ్ దీర్ఘకాల వియోగం సహించలేక వ్యాధిగ్రస్తురాలౌతుంది. ఆమె మానసిక



వేదన సార్వజనీనకమైన మాతృప్రేమని చిత్రించింది.

కథలో మరో అమానవీయమైన పాత్ర సుధీర్‌ది. చిన్న ఉద్యోగం చేసినా గొప్పకు పోవడం, వాగాడంబరం అతని లక్షణాలు. దీనికంటే కామదాహం అతని ప్రవృత్తి. కౌముది అతనికి దూరపు బంధువు. తనని బాబాయ్ అని పిలుస్తుంది. కాని, కౌముదిని అనుభవించడానికి వ్యూహం పన్నుతాడు. భార్య వారించినా వినడు. స్నానాల గదిలో ఉన్న తనను అతడు చూస్తున్నాడని గ్రహించిన కౌముది పిన్నుతో లోపలినుండి అతని కంటిలో గుచ్చుతుంది. అతను హాహాకారాలు చేస్తాడు. డాక్టర్ దగ్గరికి వెళ్ళినపుడు తన భర్త పరువు పోతుందని అసలు విషయం చెప్పవద్దని బతిమాలుతుంది. భారతీయ సగటు స్త్రీ అయిన అతని భార్య.

రచయిత తాను నమ్మిన తాత్వికత వైపు పాత్రల్ని నడిపిస్తాడు. కొన్ని సీరియస్ నవలల్లో 'మాలపల్లి' (ఉన్నవ), 'జననీ జన్మభూమి' (మాదిరెడ్డి), 'బలిపీఠం' (రంగనాయకమ్మ) తాత్విక చర్చ పర్యవసానములాంటి విషయాల వైపుకు ఈ రచన వెళ్ళలేదు. చాలా నిశ్శబ్దంగా తాననుకున్న గమ్యం వైపు రచన అడుగులు వేస్తుంటుంది.

ఒక వ్యక్తి ముస్లిం తీవ్రవాది కావడానికి దారి తీసిన పరిస్థితులు రచయిత చిత్రించిన తీరు మనసుని హత్తుకుంటుంది. ఇవన్నీ అనుభవ పూర్వకమైన వర్ణనలే అనిపిస్తుంది. అయితే రచయితలోని సమాంతర పరిస్థితుల సూక్ష్మగ్రాహ్యత అతన్ని ఈ టెక్నిక్‌లు పాటించేలా చేసి వుంటుంది.

ఇందులో స్త్రీ పాత్రలన్నీ పితృస్వామిక భావజాల పరిధిలోనే ఉంటాయి. ఈశ్వర్, రవీందర్, మల్లారెడ్డి, చారి లాంటి పాత్రల్లో స్వాభావికమైన సగటుదనం కనబడుతుంది. ఆ స్వాభావికతలోనే మంచి చెడు రెండు ఉన్నా పై పాత్రలన్నీ దార్శనికత కంటే ఉదారవాదులు గానే కనిపిస్తాయి. పౌరసత్వంలోనూ ప్రజాస్వామికవాదిలోనూ ఉండే బాధ్యత వీటిలో కన్పిస్తుంది.

వ్యాసం

చాలా నవలల్లో ఒకే ప్లాటు సాధారణంగా సాగిపోతుంటుంది. కాని ఇందులో ఈశ్వర్ కథ, ఎజాజ్ కథ, చారి కథ, వైజయంతి కథ, సుధీర్ - కౌముదిల కథ... ఇట్లా అనేక ఉపాంగాల విభిన్నమైన సమాహారం కనబడుతుంది. కాని మూలకథకు ఎక్కడా భంగం కలుగదు. ఈశ్వర్ - ఎజాజ్‌లు ఈ కథకు మూలమైన వ్యక్తులు.

అక్కడక్కడ ముస్లిం జీవితాన్ని హైందవీకరించడం చూస్తాం. ముస్లిం నోట తనకుమాలిన ధర్మం (పే.25) అనే మాట పలకడం, మంగల్‌కా దిన్ బాహర్ నికల్నా అచ్ఛానైహై బేటా (పే.33) మంగళవారం బయటకు వెళ్ళడం మంచిది కాదు లాంటి సెంటిమెంట్స్, ప్రాతర్విధులు అనే మాట ఎజాజ్ నుండి (పే.71) రావడం ఇట్లా అనేక ఉదాహరణలు చెప్పవచ్చు. ఇప్పటికి తెలంగాణ గ్రామసీమల్లో ముస్లిమ్‌లు అనేకచోట్ల హిందూ సంప్రదాయాలు పాటిస్తారు. హిందూ ముస్లిమ్‌లు మామా, తమ్మీ, అక్కా, మరదలు పిల్లా లాంటి వరుసలతో పిలుచుకుంటారు.

కథలలో ఉపకథలతో నడిచే నవల షేక్స్‌పియర్ (Shakespeare), హామ్లెట్ (Hamlet), టెంపెస్ట్ (Tempest) లాంటి నాటకాలను గుర్తుకు తెస్తుంది. ఈయన శైలి, సస్పెన్స్ సృష్టించడం ఇర్వింగ్ వాలెస్ (Irving Wallace) సిడ్నీషెల్డన్ (Sidney Sheldon) ని గుర్తుకు తెస్తుంది. ఈయన కూడా తాననుకున్నది చేతన్ భగత్ (Chetan Bhagat) లాగా చాలా Detail గా చెబుతాడు. ఒక Chapterని ముగించి, ఇంకో Chapter వెళ్ళేటప్పుడు ఆయన ఇట్లా నాటి యండమూరి వీరేంద్రనాథ్, ఇర్వింగ్ వాలెస్ లాంటి వాళ్ళ టెక్నిక్ Technic వాడడం కనిపిస్తుంది. 2వ చాప్టర్ అయిపోయేటప్పుడు "అతన్నే గమనిస్తున్న ఓ వ్యక్తి అతనికి తెలియకుండా అడుగుల్లో అడుగేస్తూ దగ్గరికి చేరుకోవడం చూసుకోలేదు". అట్లాగే అలాగే పేజి 14లో ఒక Sub Chapter endingలో ఆ ప్రయాణం అతన్ని అనుకోని ప్రమాదంలోకి ముంచుతుందని కోలేదు". 3వ Chapter చివర్లో కౌముది కోసం చూశాడు ఈశ్వర్ కనిపించలేదు కాని వరంగల్లు నుండి పోలీసు జీపు రావడం చూశాడు. 7వ Chapter చివర్లో అసలు రహమాన్ ఉద్దేశం తెలిసి ఉంటే ఎజాజ్ ఈ పని చేసేవాడు కాదు". ఇలాంటి ఉదాహరణలు ఎన్నైనా ఇవ్వవచ్చు.

ఇంత సీరియస్ నవలలో కూడా దోరవేటి సందర్భం చెడకుండా చారి అనే తెలుగు పండితుని కుటుంబం ద్వారా చక్కని హాస్యం కల్పించాడు. దర్శకుడు జంధ్యాల గుర్తుకువస్తాడు ఇది చదివితే.

విశారదుడు చారి బావమరిది. అతనడిగే ప్రశ్నలు గమ్మత్తుగా ఉంటాయి. దుష్టులంగూడి అనే పదంలో లంగూడి అంటే ఏమిటి అని తన బావను (పే.85) తికమకపెడతాడు. దు:ఖభాగులు అని అందరినీ కలిపి అంటే దు:ఖభాగిని లేక దు:ఖభాగి అని ఏడ్చే ఆడవాళ్ళని అనాలా అని అడుగుతాడు. ఇక ఉష అనే మరో పాత్ర ప్రతి సందర్భానికి ఒక పాట అందు కుంటుంది. సంగీత గురువు పాదాలను విడగొట్టి పాడాలని చెబితే ఆమె తన శరీరంలోని రెండు పాదాలని ఎడం చేసి పాడుతుంది. సంతోష కవయిత్రి. ఈమె కూచీలు అనే ఒక కవితా ప్రక్రియ సృష్టిస్తుంది. ఈ ప్రక్రియ ఈనాటి చిన్నిచిన్ని కవితా ప్రక్రియల మీద ఒక సెటైర్ లాంటిది. మొమ్మోడ్రన్ పోయెట్రీ అని ఆధునిక కవిత్వం మీద కూడా ఒక విసురు ఉంది.

దోరవేటి మొదలే చెప్పినట్టు సహజంగా కవి. నవలలో ఆయనలోని కవి అకస్మాత్తుగా బయటికి రావడం చూస్తాం. కొన్ని ఉదాహరణలు చూడండి.

"అంధకారం అనే అజ్ఞానంలో నీడ కూడా దయ్యంలా భయపెడుతుంది". (పే.33).

"బెలూను లాంటి ఆవరణని ఏ క్షణంలోనైనా పేల్చేసే అగరొత్తిలా..." (పే.6).

"ఆమె చెక్కిళ్ళపై నిలువలేక జారిపడే పడేచెమట బిందువులు గులాబీరేకులను వదలలేక వదులుతున్న తుషార బిందువుల్లా ఉన్నాయి". (పే.33)

అయితే కవిత్వమే అంతటా పరచుకోకుండా అది వస్తువుని మరింత ఉద్దీపింపజేస్తుంది. తొంగి చూసిన కవి త్వరలోనే నిష్క్రమిస్తాడు. నవలాకారుడు తన పని కొనసాగిస్తాడు.

కవిత్వమే కాక తిరిగిన మగాడు చెడిపోడు (పే.6); మంచి తరుణం మించిన దొరకదు (పే.24) లాంటి సామెతలు కూడా అలవోకగా అప్రయత్నంగా వచ్చి చేరుతాయి.

వైజయంతి లాంటి పర్వర్టెడ్ పాత్రలోని సానుకూలత ఈశ్వర్ ద్వారా బయటకు వస్తుంది. ఆమె ఏకాకితనం, దైన్యం ఆమెను అలా వింతమనిషిని చేస్తాయి. ఇట్లాగా పాత్ర చిత్రీకరణలో హేతువు కూడా తెలిసివస్తుంది. దోరవేటి నవలలోని ప్రతిపాత్ర ఒక సజీవ చైతన్యమే. అన్నీ మనముందు కదులుతున్నట్టే ఉంటాయి. ఒక మంచి దర్శకుడి చేతిలో పడితే ఇది మంచి చలనచిత్రంగా రూపొందుతుంది.

ఇన్ని పాయలను ఒకటి చేసి పాత్రల విభిన్న మనస్తత్వాలను ఒక ప్రవాహానికి అనువుగా ఇమిడించడం ఈయన వాడిన అసాధారణ శిల్పం. అనేక సంఘటనలు అంతస్సూత్రం తెగకుండా నడిపించడం ఆయనకే చెందిన సంవిధానం. సీరియస్ వస్తువులో సస్పెన్స్, కథీకరణలోనే సంభాషణ, సమయాన్ని, ప్రదేశాన్ని, సందర్భాన్ని బట్టి చిత్రించడం, అవసరమైనపుడు గమనంలో నిలకడ, సందర్భాన్ని బట్టి వేగం ఈ రచనలో ప్రత్యేకతలు.

మతం గొప్పదే అంతకన్నా మమత గొప్పది అని తీవ్రవాది ఎజాజ్ పాత్ర అంటుంది. ఈ నవలకు దీన్ని ఫలశ్రుతిగా భావించాలి. తన తాత్విక దృక్పథాన్ని శిల్పంతో సమన్వయం చేయడానికి ఎంత కృతకృత్యుడయ్యాడో చెప్పడానికే నేను పరిమితుడనయ్యాను.

మానవ సంబంధాల చిత్రణలోనే జాతీయతను ఇమిడించిన దోరవేటికి నా హాట్సాఫ్.

కవిత



# గృహకవచం



డా॥ బాణాల శ్రీనివాసరావు, 94404 71423

యాంత్రిక జీవన పోరాటంలో
నిద్రలేమితో అలసిపోయి
కళ్ళకింద నల్లని దట్టమైన అరణ్యాల్ని
దిండులా చేసుకుని
సేదతీరుతుందేమో!

సూర్యున్నీ నిద్రలేపి
కిరణాల్ని ఇంటినిండా పరిచి
బాక్సులతో పిల్లల్ని స్కూలుకి పంపి
అలా నడుం వాల్చిందేమో!

వాళ్ళు వెళ్లిన క్షణంనుంచి
కంటిపాపల్లో కదలాడుతున్న
తనపాపల్ని తలుచుకుంటూ
ఎదురు చూస్తుందేమో!

ఆమె కష్టాన్ని చూసి
జాలిపడిన పెరట్లోని మొక్కలు
పూలను కానుకగా ఇస్తున్నాయేమో!

జీవితపు ఆటుపోట్లను
కంటి రెప్పలకేలాడే
కన్నీటి సముద్రాల్ని
దాటుకుంటూ
ఒడ్డుకుచేరి సేద తీరుతున్న నావలా!

ఎప్పటి నుంచో ఎత్తుకుపోవాలని
ఎదురు చూస్తున్న గద్దనుంచి
తన పిల్లల్ని రెక్కలకింద
ఆత్మీయంగా పొదువుకొని
దాచుకున్న తల్లికోడిలా!

స్వేదంతో భూమిని దున్ని
పండించిన తొలిపంటను
కంటిరెప్పలతో కాపాడుకొంటూ
ఆప్యాయంగా అరచేతుల్లోకి తీసుకొని
అనుభూతికి లోనవుతున్న
కష్టజీవి కళ్లలోని మెరుపులా!

ఆమె ఒంటరితనాన్ని చూస్తూ
అప్పుడప్పుడు కిటికీలోంచి
కిచకిచ శబ్దాల్ని చేస్తూ
ఊరట కలిగిస్తు ఓ చిన్నపిచ్చుకలా!

శత్రు సైన్యాలపై గుండ్ల వర్షం కురిపించి
కన్నభూమికి విజయాన్ని అందించిన
వీరసైనికుణ్ణి కన్న వీరమాతలా!

ఎప్పటికి ఎర్రకోటపై
రెపరెపలాడే జాతీయ జెండాలా
దేశ సరిహద్దుల్లో కాపలా కాస్తున్న భద్రతాదళంలా
శ్రమకు నిలువెత్తు రూపంలా
ఎల్లవేళలా కుటుంబాన్ని కాపాడుకునే
రక్షణవలయంలా
ప్రతి రాత్రి ఇంటిని వెలిగించే వెన్నెల దీపం

కథ

# మా చెరువు మాకు కావాలి

ఒక బర్రె, మనిషి కుటుంబ సభ్యత పొందిన కథ...



యడవెల్లి సైదులు
70321 88578

తెలంగాణ రాష్ట్రంలో మారుమూల పల్లెటూరైన అప్పన్నపేట ఇప్పుడు వార్తల్లోకెక్కి దేశస్థాయిలో చర్చనీయాంశమైంది. ఆ ఊరి ప్రజలకు వ్యవసాయానికి, పశువుల దాహార్తికి ప్రధాన జీవనాధారం ఆ ఊరి మధ్యనున్న 'అప్పన్న చెరువు'. ఇప్పుడు ఆ చెరువుని సగం పూడ్చి ఊరి అవతల ఉన్న డాంబరు రోడ్డును జాతీయ రహదారిగా మార్చి చెరువు మధ్యలోంచి వేశారు. సగం చెరువు రోడ్డు ఆక్రమించగా మిగిలిన చెరువునిండా కాంక్రీటు, ఇసుక, ఇనుప చువ్వల కుప్పలు పోసి చెరువు చెరువు తీరుగా లేదు. అక్కడేదో సిమెంట్ ఫ్యాక్టరీ నడుస్తున్నట్లుగా తయారైంది వాతావరణం. 'చెరువులో నీళ్ళన్నీ మోటార్లతో గుంజి భూమినంతా సిమెంట్ మయం చేస్తున్నారు. మా పొలాలు ఈ నీళ్ళతోటే పండుతాయి. ఇప్పుడు మా వ్యవసాయం ఏమైపోవాలి? అని ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై ఎన్.హెచ్. అథారిటీ (నేషనల్ హైవే) వారు, రోడ్డు కాంట్రాక్టర్లు కేసులు పెట్టుతున్నారు. ఆ ఊరిలో చాలామంది అక్షరాలు నేర్వనివారే. వారంతా వ్యవస్థని ఎదురించలేక, పూడి పోతున్న చెరువుని చూస్తూ ఉండలేక గుండెలు చెరువులు అయ్యేలా రోదిస్తూ జీవితాన్ని నెట్టుకొస్తున్నారు. ఒక్క ఎల్లమ్మ మాత్రం తన బర్రె చనిపోవడానికి కారణమైన ఈ రోడ్డుని ఎలా అయినా తమ ఊరికి దూరంగా వెలుపల నుంచి వేసేలా ప్రభుత్వంపై, కాంట్రాక్టర్‌పై కొట్లాడాలని నిర్ణయించుకొని రోజూ ప్లకార్డు పట్టుకొని రోడ్డు పక్కన కూర్చుని మౌనంగా నిరసన తెలపసాగింది.

నెలరోజుల క్రితం జరిగిన ఎల్లమ్మ బర్రె మరణం ఆ వూరి జనం హృదయాల్ని కలచివేసింది. ఎల్లమ్మకు ఆ బర్రెకు చిన్నప్పుడే 'లక్ష్మి' అని పేరు పెట్టింది ఎల్లమ్మ. చాలా మంచి మనిషి. బట్టలు ఉతికే చాకలి కుటుంబంలో పుట్టి ఊరిలో పెళ్ళిళ్ళకు, శుభకార్యాలకు అందరికీ తలలో నాలుకలా ఉంటూ కలుపుగోలుగా నడుచుకునే ఆమెను ఆ ఊరిలో అందరూ ఎంతో అభిమానిస్తారు.

ఎల్లమ్మకు ఇద్దరు పిల్లలు ఇప్పుడిప్పుడే బడికి పోతున్నరు. పెద్దోడు రెండో తరగతి. చిన్నోడు ఈ మధ్యనే బడిలో చేరిండు. భర్త లచ్చుముడికి చిన్నప్పటి నుంచి చుట్ట తాగే అలవాటు ఉండటంతో సంవత్సరం క్రితం పక్షవాతం వచ్చింది. ఆ ఊరిలోనే పది ఇండ్ల బట్టలు ఉతుకుతూ లక్ష్మి ఇచ్చే పాలను అమ్ముకుంటూ సంసారాన్ని నడుపుతుంది ఎల్లమ్మ.

లక్ష్మి ఎల్లమ్మ దగ్గరకు చేరడం ఒక విచిత్రంగా జరిగింది. ఒకరోజు ఎల్లమ్మ రోజూలాగే బట్టలు ఉతకడానికి వాగుదగ్గరికి వెళ్ళింది. బట్టలన్నీ తడిపి వాగు ఒడ్డున బండమీద పెట్టింది. పక్కనే ఉన్న చౌడు గడ్డకి వెళ్ళి చౌడుని తోముకొని పక్కనున్న రాతి దోనె (గుంట)లో పోసింది వెంటతీసుకెళ్ళిన రాతెండి బొక్కెనలో వాగులోని నీళ్ళని తెచ్చి ఆ గుంటలో పోసింది. ఆ మట్టి నీళ్ళు కలవగానే సబ్బునీళ్ళవలె అందు లోని నీళ్ళన్నీ నురగనురగగా పొంగుని చిమ్మినాయి. ఆ నీళ్ళలో బట్టలన్నీ ముంచి తెల్లగా ఉతికి పెద్ద బండకు ఆరేసింది ఎల్లమ్మ. బట్టలన్నీ ఆరేదాకా కాస్త సేద దీరుదామని వాగు ఒడ్డున ఇసుకు మేటకి ఆనుకొని ఉన్న తుమ్మచెట్టు కిందికెళ్ళి నడుం వాల్చింది ఆమె. మెల్లిగా నిద్రలోకి జారుతున్న ఆమె మదిలో ఏవో ప్రశ్నలు తిరగాడుతున్నాయి. మా అత్తా మామ ఈ వాగు దగ్గరే బట్టలు ఉతికినరు. నేను నా భర్త ఇక్కడే బట్టలు ఉతుకుతున్నాం. రేపు నా పిల్లలూ ఇదే పని చేయాలా? ఈ వృత్తిలో ఏం ఎదుగుదల లేదు. ఆరునెలలు ఉతికితే కుండెడు వడ్లు ఇస్తరు. 'ఈ దండగ పని నా పిల్లలు చేయొద్దు. ఆల్లని ఎట్లన్నజేసి మంచిగ సదివించుకుంటా' అని మనసులో అనుకుంటూ నిద్రలోకి జారుకుంది. గంటన్నర తర్వాత ముఖం మీద ఏదో నీళ్ళ చినుకులు పడినట్లు స్పర్శ తగలడంతో కళ్ళు తెరిచి చూసింది. బాగా మబ్బు పట్టినట్లు స్పర్శ తగలడంతో కళ్ళు తెరిచి చూసింది. బాగా మబ్బు పట్టి పెద్ద

వాన వచ్చేలాగా ఉంది. అప్పటిదాకా ఎండకి తళతళా తెల్లగ మెరిసిన బండ మేఘాలు ఆవరించడంతో వంటింట్లో మసిపారి తాటాకులా నల్లగా కనిపిస్తుంది. వాగెమ్మటి మేకలు కాసే గోపాలు, పొలంలో పనిచేస్తున్న నారయ్య, బుడ్డపరకలు పట్టడానికి వచ్చిన పోరగాండ్లు అందరూ వానజాడ చూసి ఇండ్లకి పోయినారు. అంతా నిశ్శబ్దంగా ఉంది. ఎల్లమ్మ గబగబా ఉరికి బట్టలన్నీ తీస్తుండగానే వాన మొదలైంది. బట్టలన్నీ మూటకట్టి తుమ్మచెట్టు మొదట్లో పెట్టి రెండు తాటి ఆకులు కప్పి, ఇంకొక ఆకు నెత్తిమీద పెట్టుకుని నిలబడ్డది ఎల్లమ్మ.

వాన అంతకంతకూ పెరగడంతో వాగు ఉప్పొంగింది. పైనుంచి వస్తున్న వరద ఎల్లమ్మ కాళ్ళను తాకింది. బట్టల మూటని తీసుకెళ్ళి బండమీద పెట్టి చెట్టుకు తగిలించిన సల్ల టిఫిని కోసం మళ్ళీ వాగు దగ్గరికొచ్చిన ఎల్లమ్మకు నీళ్ళలో ఏదో జంతువు కొట్టుకొని వస్తున్నట్టు కనిపించింది. మొదట మొసలి ఏమో అనుకొని భయపడ్డది ఆమె. ఆ వరదకు కొట్టుకొచ్చిన ఆ జంతువు సరిగ్గా ఎల్లమ్మ కాళ్ళకి అడ్డం పడి మూతి పైకెత్తి చూసింది. అది నల్లని చాయతో మొకం మీద తెల్లని మచ్చతో ఉన్న బర్రెదూడ. రెండు నెలల వయసు ఉంటుందేమో. దాన్ని చూడగానే "మాయమ్మే యాడనించి కొట్టుకువచ్చినవు తల్లీ" అంటూ ఒడ్డుకు తీసుకెళ్ళి వణుకుతున్న దాని శరీరాన్న ంతా గుడ్డతో తూడ్చింది. ఇంతలో వాన తగ్గింది. ఆకలిగా ఉందేమోనని టిఫిన్‌లోని సల్లని ఆ దూడకి తాపింది ఎల్లమ్మ. చుట్టూరా వెతికి చూస్తే ఎక్కడా దాని తల్లి జాడ కనపడలేదామెకు. అడవిల ఉంటే వేటకుక్కలు కరిచి తింటాయేమోనని ఇంటికి తీసుకెళ్ళి సాదుకుంది ఆ దూడను. శుక్రవారం నాడు దొరికిందని ఆ దూడకు లక్ష్మి అని పేరు పెట్టింది ఎల్లమ్మ. ఇప్పుడు దాని వయసు అయిదేండ్లు. లక్ష్మికి ఒక చిన్ని దూడ పుట్టింది. పొద్దున సాయంత్రం నాలుగు లీటర్ల పాలు ఇస్తుంది. ఒక్కరోజు సల్లతాపి బతికించినందుకు నాలుగు లీటర్ల పాలు ఇస్తుంది. తన కుటుంబానికి ఆసరాగా నిలిచి తోడైన లక్ష్మి ఇప్పుడు ఎల్లమ్మ కుటుంబంలో సభ్యురాలైంది.

అనుకోని అతిథిలా వచ్చి ఆ కుటుంబానికి అండగా నిలిచిన లక్ష్మిని ఆ ఊరివాళ్ళంతా దేవతలాగా చూసేది. దానిని దాని బిడ్డని ఎక్కడైనా పొలం గట్ల మీద మేస్తున్నా ఎవ్వరూ అల్లించేవారు కాదు. లక్ష్మి కోసం ఎవరి పొలంలోనైనా ఎల్లమ్మని పచ్చిగడ్డిని కోసుకోనిచ్చేవారు.

ఎండాకాలం ఆ ఊరిలోని బర్రెలన్నీ అడవికెళ్ళి మేత మేసి చెరువులో నీళ్ళు తాగి, అందులో ఈతకొట్టి



**అనుకోని** అతిథిలా వచ్చి ఆ కుటుంబానికి అండగా నిలిచిన లక్ష్మిని ఆ ఊరివాళ్ళంతా దేవతలాగా చూసేది. దానిని దాని బిడ్డని ఎక్కడైనా పొలం గట్ల మీద మేస్తున్నా ఎవ్వరూ అల్లించేవారు కాదు. లక్ష్మి కోసం ఎవరి పొలంలోనైనా ఎల్లమ్మని పచ్చిగడ్డిని కోసుకోనిచ్చేవారు.

సాయంత్రానికి ఇళ్ళకు చేరేది. ఎండకాలం వాగు ఎండిపోతది. వాగులో అక్కడక్కడా గుంటల్లో నీళ్ళు ఆగేది. ఆ ఊళ్ళో బర్రెలు మాత్రం వాగులో నీళ్ళు ఉన్నా చెరువులోనే సేదదీరడానికి ఇష్టపడతాయి. ఆరోజు ఊళ్ళో బర్రెలతో సావాసంగా లక్ష్మి కూడా చెరువు దగ్గరకు వెళ్ళింది.

అప్పటికే చెరువు సగం పూడింది. చెరువు మధ్యలో జాతీయ రహదారి పడింది. నిజానికి ఆ వూరికి రోడ్డు చెరువు దక్షిణ భాగాన చెరువు అవతల నుంచి పాతరోడ్డు ఉంది. జాతీయ రహదారి అక్కడినుంచే నిర్మించాల్సి ఉంది. రోడ్డు కాంట్రాక్టర్ వెంకటేశం చెరువు అంచు నుంచి రోడ్డు వేస్తే ఆరు కిలోమీటర్లు వేయాల్సి వస్తది. చెరువు మధ్యలోంచి వేస్తే మూడు కిలోమీటర్లు వస్తది. కిలోమీటరుకి 10 కోట్ల చొప్పున 30 కోట్ల డబ్బు ఆదా అవుతుంది. లాభం వస్తదని పాతరూల్స్ మార్చి కొత్త డిజైన్ గీపించి అక్రమంగా చెరువు మధ్యలోంచి రహదారి నిర్మించాడు.

అప్పటినుంచి రైతులు, పశువులు చెరువు వైపు వెళ్ళాలంటే రెండొందల మీటర్ల పొడవున్న రహదారిని బిక్కుబిక్కుమంటూ ప్రాణాలు అరిచేతిలో పెట్టుకొని దాటేది.

ఆరోజు పొద్దున్నే ఇళ్ళలోంచి మేతకెళ్ళిన బర్రెలన్నీ ఎండాకాలం తొమ్మిది గంటలకే సూర్యుడు ఎండకాక వీపులని తాకి సురసురలాడటంతో చెరువువైపు మళ్ళినాయి. ఎండకి జాతీయ

కథ

రహదారి తళతళా మెరుస్తుంది. బర్లన్నీ రోడ్డుని దాటి చెరువులోకి దిగినాయి. సాయంత్రం దాకా నీళ్ళలోనే మునుగుతూ తేలుతూ ఆటలాడాయి. చిన్నగా పొద్దుగూకింది. పక్షులు గూళ్ళకు చేరినాయి. సూర్యుడు గుట్టలచాటుగా జారుకున్నాడు. లక్ష్మి దాని దూడ ఎక్కడుందో? అని వెతికింది. చెరువు ఒడ్డున లొట్టపీసు చెట్లకు తలను రుద్దుతూ ఆటలాడుతుంది దాని దూడ. దాని దగ్గరకెళ్ళి 'పొద్దు పోయింది ఇంటికెళ్దాం పదా' అంటూ మూతిని నిమురుతూ తలతో నెమ్మదిగా గుద్దుతూ సైగ చేసింది లక్ష్మి. లక్ష్మి, దాని దూడ ఒడ్డుకు ఎక్కడంతో వాటి వెంటే ఊర్లోని మిగిలిన బర్లు నీళ్ళలోంచి పైకెక్కినాయి. అప్పటికే పద్దు బాగా పోయింది. మసకమసకగా చీకటి పడుతుంది. బర్రెలన్నీ రోడ్డు ఎక్కినాయి కానీ అవతలినుంచి ఇవతలికి దాటుదామంటే నిమిషానికో లారీ, కారు, బస్సులొస్తున్నాయి. వెనకనుంచి వచ్చిన బర్లన్నీ ఒక్కసారిగా చెరువులోంచి రోడ్డు మీదకి రావడంతో ముందున్న బర్రెలు ఓ పది పదిహేను రోడ్డు మీదకి నడిచాయి. అంతే అటుగా వస్తున్న 24 చక్రాల పెద్ద సిమెంట్ లోడు లారీ ఒకటి దడేలుమంటూ బర్రెలని గుద్దింది. ఆ వేగానికి డ్రైవర్ సడన్ బ్రేక్ తొక్కడంతో బ్రేక్ ఫేలైంది. అంతే పెద్ద కొండలాంటి ఆ లారీ బర్లన్నింటినీ తొక్కుతూ పోయింది. నీళ్ళలోంచి ఒడ్డున పడ్డ చేపపిల్లల్లా గింజుకుంటూ పది బర్లు ఆ రోడ్డు మీదే ప్రాణాలు విడిచాయి. పొద్దున్నే ఊరు ఊరంతా రోడ్డుమీద పోగైంది. ఎల్లమ్మ తన బర్రె విగతజీవిగా పడి ఉండటం చూస్తూ బోరున ఏడ్చింది. రోడ్డునిండా కిలోమీటర్ల మేర ట్రాఫిక్ ఆగింది. పోలీసులు, ట్రాఫిక్ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. "మా బర్రెలన్నీ సచ్చినాయి. మాకెవ్వరు న్యాయం చేస్తారు" అంటూ జనం పెద్దగా మొత్తుకోసాగారు. ఇంతలో ఊర్లో చోటా మోటా రాజకీయనాయకులు నినాదాలు మొదలుపెట్టినారు. కేంద్రప్రభుత్వ లోపం అని కొందరు, రాష్ట్రప్రభుత్వ లోపం అని ఇంకొందరు అరవసాగారు. అంతే పోలీసులు లాఠీలకు పని చెప్పారు. దొరికిన వారిని దొరికినట్లు కొట్టారు. గట్టిగా అరిసేవారిని లాక్కెళ్లి జీబుల్లో ఎక్కించారు. అలా అరగంట లాఠీ మోతల తర్వాత ట్రాఫిక్ క్లియర్ అయింది. ఆ మరుసటిరోజు అరెస్టు చేసినవారిని విడిచిపెట్టారు. 'బర్రెలను రోడ్డు మీదకు వదిలితే జైలుశిక్ష' అని అప్పన్నపేట రోడ్డుమీద పెద్ద బోర్డు రాసి పెట్టారు పోలీసులు.

రోజులు గడుస్తున్నాయి. జనం ఎవరి పనులకు వారు పోతున్నారు. కాంట్రాక్టర్ వెంకటేశం మిగిలిన చెరువుని ఆక్రమించి ఎవరికి అప్పజెప్పాల్సిన ముడుపులు వారికి అప్పజెప్పిండు. ఇప్పుడు ఊర్లో జనం కాంట్రాక్టర్‌ని ఎదిరించలేక, పోలీసులకు ఫిర్యాదులు చేయలేక పక్క ఊర్లకెళ్ళి హమాలీ పని చేస్తూ అడ్డామీద కూలీలుగా వెళ్తూ బతుకుతున్నరు. ఎల్లమ్మ మాత్రం మూతికి నల్లబ్యాడ్జ్ కట్టుకొని, చేతిలో ప్లకార్డు పట్టుకుని రోడ్డు పక్కన కూసుని నెలలుగా పోరాటం చేస్తూ నిరసన తెలుపుతుంది. "మా చెరువు మాకు కావాలి! ప్రాణాలు తీస్తున్న రోడ్డుని ఊరవతలకి తరలించాలి" అంటూ రాసి ఉన్న ప్లకార్డులని ఆ దారివెంట పోయే వాళ్ళు రోజూ చదవటం, "ఈమె ఒక్కదానివల్ల ఏం సాధ్యమైద్ది" అంటూ జాలిపడటం అందరికీ అలవాటైపోయింది.

> **పక్షులు గూళ్ళకు చేరినాయి. సూర్యుడు గుట్టలచాటుగా జారుకున్నాడు. లక్ష్మి దాని దూడ ఎక్కడుందో? అని వెతికింది. చెరువు ఒడ్డున లొట్టపీసు చెట్లకు తలను రుద్దుతూ ఆటలాడుతుంది దాని దూడ. దాని దగ్గరకెళ్ళి 'పొద్దు పోయింది ఇంటికెళ్దాం పదా' అంటూ మూతిని నిమురుతూ తలతో నెమ్మదిగా గుద్దుతూ సైగ చేసింది లక్ష్మి.**

అదే సందర్భంలో కొన్నిరోజులకు 'సమ్మక్క సారక్క జాతర' ప్రారంభమైంది. వరంగల్ రహదారులన్నీ ఫుల్‌గా ట్రాఫిక్ జాం అయ్యాయి. కంట్రోల్ రూంలు, అధికారులు నిరవధికంగా పనిచేసినా ట్రాఫిక్ క్లియర్ కాకపోవడంతో హైదరాబాద్, విజయవాడ, బెంగుళూరు, చెన్నై వెళ్లే వాహనాలన్నింటినీ సూర్యాపేట మీదుగా, అప్పన్నపేట జాతీయరహదారి గుండా మళ్ళించారు. దాంతో వేలకొద్ది కార్లు, బస్సులు, అప్పన్నపేట మీదనుంచి వెళ్ళసాగాయి. అలా వెళ్తున్నప్పుడు చాలామంది ప్రయాణీకులు రోడ్డు పక్కన దీక్ష చేస్తున్న ఎల్లమ్మను చూసి సెల్‌ఫోన్లలో ఫోటోలు, వీడియోలు తీయడం చేశారు. కొంతమంది ఆగి మరి ఎల్లమ్మతో మాట్లాడేవారు. అలా ఎల్లమ్మ చేస్తున్న పోరాటాన్నంతా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, ట్విట్టర్, యూట్యూబ్‌లలో పెట్టారు. 'మా చెరువు మాకు కావాలి' అని చేస్తున్న ఎల్లమ్మ పోరాటాన్ని గెలిపిద్దాం అంటూ సోషల్ మీడియాలో వార్త వైరల్ అయింది. విషయం పత్రికల్లోకి ఎక్కింది. ఎల్లమ్మ పోరాటాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న కోర్టు ఈ విషయాన్ని సుమోటాగా స్వీకరించి దీనిపై వివరణ ఇవ్వాలంటూ 'నేషనల్ హైవే అథారిటీ', జాతీయ రహదారుల మంత్రిత్వశాఖను కోరింది.

దాంతో జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ ఒక కమిటీని వేసి నివేదిక తెప్పించుకుంది. 'చెరువుని అక్రమంగా పూడ్చారని' నివేదికలో తేలడంతో కాంట్రాక్టర్ వెంకటేశంకి కాంట్రాక్టు క్యాన్సిల్ చేసి, చనిపోయిన బర్లకు అతడితోనే నష్టపరిహారం కట్టించింది ప్రభుత్వం. జాతీయ రహదారిని చెరువు అవతలినుంచి వేయించి, చెరువుని మళ్ళీ పూడిక తీయించారు. ఎల్లమ్మ ధైర్యాన్ని, పోరాటాన్ని, స్ఫూర్తిని గుర్తించిన ప్రభుత్వం ఆమెకు రెండు ఎకరాల పొలం ఇచ్చి, పది దేశీ జాతి బర్రెలనిచ్చి డైరీ ఫాం పెట్టించింది.



# శ్వాసధార



డా॥ రూప్‌కుమార్ డబ్బీకార్, 99088 40186

దీపం నిశ్శబ్దంగా వదిలి వెళ్లిన మట్టిదివ్వె
లోలోపలి గదిని దాటి దారి మళ్ళిన గాలి కేక ఇప్పుడు...
అక్కడొక నిర్జీవ ప్రతిమ
జవాబు దొరకని అనేక ప్రశ్నలకు జవాబుగా -

శిథిల దేహాల వివృత నీడలలో
కాగితపువ్వుల సమూహంలో
అపశబ్దాల రోదన వలయాలు
అక్కడ...
దుఃఖపు అగాధాలలో
ధూళుల ఆలింగనాలు
జిహ్వాగ్రాల నుండి రాలి పడుతున్న పొడిపొడి మాటలు
తడిలేని కన్నీళ్లు
పాతచొక్కా చిరుగుల గవాక్షాల నుండి
తొంగి చూస్తున్న నిషిద్ధ నేత్రాలు
అక్కడ -

ముక్కలుగా చీలిన ప్రతిబింబాలు
శూన్యంలో ఏడుపు రాగాలు
బతుకు ఆనవాళ్లను క్షణంలో మటుమాయం చేసే జడుల మధ్య
ఉలుకూ పలుకూ లేని
నిర్జీవ ప్రతిమ మాత్రం ఏడుస్తూనే ఉంది
ప్రతిదీ కొనుగోలుకు సిద్ధం చేసిన వ్యవస్థలో
దుఃఖాన్ని అమ్మే దుకాణాలను వెతుకుతున్న
కాగితపువ్వులే సమూహాల మధ్య
శవం మాత్రమే ఏడుస్తోంది...

అక్కడ ఇప్పుడెవరూ లేరు
బిత్తరపోయిన మట్టి దివ్వెలో
మౌన వస్త్రాల్ని కుప్పగా పోసి
నగ్నంగా పారిపోయిన
ప్రతిబింబాల జాడలు తప్ప...
ఇప్పుడు -

అడుగుల చప్పుడు వినిపిస్తున్నంత మేర
శవ రోదన, విరిగిన ముక్కలై
ప్రవహిస్తున్న ఓ శ్వాసధారయే

# దేశభక్తిని ప్రబోధించే బృహత్ సంకలనం "పద్య ప్రభంజనం"

పద్యాలలో దేశభక్తి...



దాస్యం సేనాధిపతి
94405 25544

అష్టావధాని, దేశభక్తిని అణువణువున పుణికి పుచ్చుకున్న కవి శ్రీ అవుసుల భానుప్రకాశ్ గారి ప్రధాన సంపాదకత్వంలో "పద్య ప్రభంజనం" పేరుతో దేశభక్తి పద్య బృహత్ సంకలనాన్ని వెలువరించి పద్య ప్రక్రియను సుసంపన్నం చేశారు. సంగారెడ్డిలోని మెతుకుసీమ సాహితీ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ప్రచురింపబడిన ఈ గ్రంథంలో వర్ధమానులు ప్రవర్ధమానులు రాసిన పద్యాలున్నాయి. డా॥ అయాచితం నటేశ్వరశర్మ, కంది శంకరయ్య, దోరవేటి చెన్నయ్య, డా॥ జి.లక్ష్మణరావు, పి.విట్టుబాబు, గుండు మధుసూదన్ వంటి పండితులతో ఏర్పడిన సంపాదక మండలి మరియు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, ఆచార్య బేతవోలు రామబ్రహ్మం గారల మార్గదర్శనంలో ఈ పద్యకావ్యం రూపుదిద్దుకోవడం విశేషం. తెలంగాణ రాష్ట్రంలోని పది ఉమ్మడి జిల్లాలకు చెందిన కవులతో పాటు రాష్ట్రేతర తెలుగు కవులు తమ రచనలు పంపి ఈ గ్రంథానికి శోభను కూర్చారు. అవధాన సహస్రఫణి, బృహత్ ద్విసహస్రావధాని బ్రహ్మశ్రీ డా॥ మాడుగుల నాగఫణిశర్మ గారు నుడివినట్లు ఛందోమయమైన పద్యం అంటే హార కుండల కేయూర కిరీటాదులతో సర్వాభరణ భూషితురాలైన మహాసరస్వతీ దేవీ ప్రత్యక్షం కావడమే ! నిజమే కదా!

భారతీయ సంస్కృతి పట్ల శ్రద్ధాభక్తులను ప్రకటిస్తూ... దేశభక్తిని ప్రబోధిస్తూ ఇందలి పద్యాలు తీర్చిదిద్దబడ్డాయి. అష్టకాల నరసింహరామశర్మ, డా॥ ఎన్. గోపి, వద్దిపర్తి పద్మాకర్, డా॥ బి.యం.రామశర్మ, డా॥ నందిని సిధారెడ్డి, డా॥ ఏనుగు నరసింహారెడ్డి, ఆచార్య సూర్యాధనంజయ్, తల్లోజు యాదవాచార్యులు, చిటితోటి విజయకుమార్, శాస్త్రుల రఘురామశర్మ, పెరంబుదూరు రంగాచార్య, బోర్పట్ల హన్మంతాచారి తదితరుల ఆశీరాభినందనలు ఈ కావ్యానికి నిండుదనాన్ని కూర్చాయి. మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్, లాడెమనీల మల్లేశం దంపతులు, బోర్పట్ల సుధాబాయి హన్మంతాచారి దంపతులు, శేషక్కం ప్రమీల దంపతులు, శాస్త్రుల స్వయంప్రభ రఘురామశర్మ దంపతులు, గంప సుజాత, సిద్దిరాములు దంపతుల ఔదార్యంతో ఈ గ్రంథం వెలుగులోకి రావడం విశేషం !

పద్యాలెందుకు? కాలం చెల్లిపోయింది అనుకుంటున్న నేపథ్యంలో ఈ బృహత్ కావ్యాన్ని మెతుకుసీమ సాహితీ సాంస్కృతిక సంస్థ వారు డా॥ పూసల లింగాగౌడ్ గారి నేతృత్వంలో అవుసుల భానుప్రకాశ్ సారథ్యంలో వెలువరించడం అభినందనీయం. డా॥ కూరెళ్ళ విఠలాచార్య, మామిడి హరికృష్ణ, దేశపతి శ్రీనివాస్, గన్నమరాజు మనోహరబాబు, ఆచార్య బన్న అయిలయ్య, డా॥ జె. చెన్నయ్య, డా॥ రఘు, డా॥ సాగి కమలాకరశర్మ, డా॥ పత్తిపాక, డా॥ లక్ష్మణ చక్రవర్తి గార్ల సలహాలు సూచనలతో వెలువడిన ఈ బృహత్ పద్య సంకలనానికి డా॥ పి. భాస్కరయోగి, గాజుల రవీందర్, నవీన్ ఆచారి, మహారెడ్డి మహిపాల్ రెడ్డి, తరుణ్ చక్రవర్తి, డా॥ మాడుగుల నారాయణమూర్తి, నంది శ్రీనివాస్, ఎన్.సి. హెచ్.చక్రవర్తి, సాగర్ల సత్తయ్య, ఎన్.సాయిప్రసాద్, బస్వోజు సుధాకరాచారి, వడ్ల రాజయ్య, వర్కోలు లక్ష్మయ్య, గోగులపాటి కృష్ణమోహన్, జి.కృష్ణగౌడ్, డా॥ ఎం. దత్తాత్రేయశర్మ తదితరుల ఆత్మీయ సహకారం లభించింది.

650 మంది కవులు, కవయిత్రులు రాసిన పద్యాలను ఇందులో పొందుపరిచి పద్య ప్రక్రియకు పునర్ వైభవాన్ని తేవడానికి ప్రయత్నించడం ప్రశంసించదగింది. పద్మశ్రీ, మహామహోపాధ్యాయ భాష్యం విజయసారథి గారి ఆశీస్సులతో వెలువడిన ఈ కావ్యంలోని పద్యాల్లో సంప్రదాయంతో పాటు.. నవ్య సంప్రదాయాన్ని, జాతీయ వాదాన్ని, భారతీయ సంస్కృతిని, ఆధ్యాత్మిక చింతనను, మానవతా

పుస్తక పరిచయం

వాదాన్ని, సమానత్వాన్ని, ఏకాత్మవాదాన్ని, స్త్రీ జనాభ్యుదయాన్ని, దైవీశక్తుల ఆవశ్యకతను ధర్మపరిరక్షణ, దేశభక్తి వంటి అంశాలకు చోటు కల్పించడం విశేషం!

పద్యం పాత చింతకాయ పచ్చడని, ఇంకా పద్యమెందుకని పద్యాలింకా పాఠ్యపుస్తకాల్లో ఎందుకని అవాకులు-చెవాకులు పలికేవారు తయారయ్యారు. దానికి ఆగ్రహించిన ధర్మాగ్రహమూర్తులు ఇలా అన్నారు.

"పద్యమ్మునెవడురా పాతిపెట్టెదనంచు
నున్మాదియై ప్రేలుచున్నవాడు.."

అన్న మాటలూ ఈ గ్రంథ ఆవిర్భావానికి నేపథ్యమేనని పేర్కొనవచ్చు.

ఇందులోని పద్యాలు మనదేశం యొక్క ఔన్నత్యాన్ని సంస్కృతీ సంప్రదాయాలను భారతీయతను, జన్మభూమి గురించిన భక్తిభావనను, ప్రగతి ఫలాలను, వేదభారతిని, భారతీయంలోని మానవీయతను, గాంధీగారు ప్రబోధించిన దేశభక్తిని, ధార్మిక భారతాన్ని, భరత భూమిని, జాతి వైభవాన్ని - భారతీయ విద్యలను, భారత ప్రదీప్తిని, చాటిచెప్పేలా ఛందోబద్ధంగా కొలువుదీరాయి..

భారతమాత సౌష్టవాన్ని, భారతీయ సాంస్కృతీ వైభవాన్ని, భారత ప్రశస్తిని చాటుతూ రత్నగర్భ భారతిగా, పుణ్యభారతిగా భారతీయతను ప్రకటించే విధంగా పద్యాలకు అక్షరాకృతినిచ్చారు. భారతదేశ ఘనతను ప్రకటిస్తూ ఘనతర భూమిగా, దివ్యధాత్రిగా ఆవిష్కరించిన పద్యాలూ ఉన్నాయి.

మన దేశకీర్తిని చాటి చెబుతూ.. దేశభక్తిని ప్రబోధిస్తూ.. భారతీయ ఔన్నత్యాన్ని తెలియజెబుతూ.. వీరధాత్రిగా, ధీర భారతిగా, ముక్తి ప్రదాతగా, చదువుల దీవిగా, సమైక్య భారతిగా, భవ్యభారతిగా, ప్రియభారతిగా, భాగ్యభారతిగా, జ్ఞానధాత్రిగా, వేదమాతగా, ఆర్షభారతంగా, కర్మభూమిగా, ధర్మగామిగా, యాగధరిత్రిగా, భరత ధాత్రిగా అభివర్ణిస్తూ కవులు, కవయిత్రులు తమ పద్యాలకు జీవం పోశారు.

మరికొందరు కవులు లాల్ బహదూర్ శాస్త్రి, అంబేద్కర్, అబ్దుల్ కలాం, వివేకానందుడు, చంద్రశేఖర్ ఆజాద్ వంటి మహనీయుల బోధనలను సందేశాత్మకంగా ఛందోబద్ధ పద్యాల్లో నిక్షిప్తం చేశారు. సీసపద్యాలతో పాటు ఉత్పలమాల, ఆటవెలది, శార్దూలం, తేటగీతి, కందం, చంపకమాల.. తదితర వృత్తాల్లో 650 మందికి పైగా కవులు, కవయిత్రులు ఈ సంకలనంలోని పద్యాలను రూపుదిద్దారు.

"భారతాంబ ! నీకు వందనములు"
"భారత మాత నీకు వందనంబు"
"భారతాంబ నీకు ప్రణతులిడుదు"
"భవ్య చరిత వినుము భరతవీర"
"కర్మభూమి మనది ధర్మభూమి"
"భరతమాత! కొలుకు భాగ్యమలర"
"భారతమాతయె కద భవ్యచరిత"
"ప్రణుతి జేతు నిన్ను భారతాంబ"




వంటి మకుటాలతో ఈ బృహత్ పద్య సంకలనంలో మనకు పద్యాలు దర్శనమిస్తాయి.

అమ్మ భారతి! నీకు నేనంజలింతు అన్న మకుటంతో తమ పద్యాల ద్వారా మిర్యాలగూడకు చెందిన రావిరాల అంజయ్య భారతదేశ ఔన్నత్యాన్ని చాటిచెప్పారు.

"నాదేశం నా సంస్కృతి" శీర్షికతో అష్టావధాని మాడుగుల నారాయణ మూర్తి ఉత్పలమాల పద్యాలను అందించారు. "నేను భారతీయు డనంటూ" ఎం.వి. పట్వర్ధన్ పద్యాలను రాస్తే తోకల రాజేశం గౌతమ బుద్ధుని బోధనలను ప్రస్తుతిస్తూ తమ పద్యాలను తీర్చిదిద్దారు.

"మానవసేవయే మాధవ సేవ" అన్న అంశంపై మడిపల్లి భద్రయ్య రాస్తే.. "దివ్య భారతమాత!" "వందే! స్మరామి" అన్న మకుటంతో డా॥ మాడుగుల భాస్కరశర్మ భారతాంబకు వందనాలు సమర్పించారు.

పుణ్యభారత సురనుత పుడమి నాది! మకుటంతో ముత్యబోయిన మలయశ్రీ "భారతదేశమే స్వర్గమంటూ" తమ పద్యాల ద్వారా స్వాభిమానాన్ని చాటుకున్నారు.

వందనమంద జేసెదను భారతమాతకు పేర్మి తోడుగన్ అంటూ "మాతృభూమి" శీర్షికతో మోతె హరిప్రియ తమ పద్యాలను తీర్చిదిద్దితే రామోజు లక్ష్మీరాజయ్య తెలంగాణ ఆవిర్భావ నేపథ్యాన్ని వివరిస్తూ తమ భావాలను పద్యాల్లో పొందు పరిచారు. "మన సంస్కృతి" గురించి శేషం నరేశాచార్య రాస్తే... "భారత కీర్తి కేతనము" భాసిలె విశ్వమునందు ఖ్యాతియై! అంటూ వేదాంత సురేష్ బాబు తమ పద్యాలను తీర్చిదిద్దారు.

శ్రీ భాగ్యమ్మిడు రైతుకూలి పుడమిన్ శ్రీ భారతిన్ మ్రొక్కెదన్ అంటూ మహామహోపాధ్యాయ తిగుల్ల శ్రీహరిశర్మ భారత భక్తి శీర్షికతో తమ పద్యాలను రాశారు. "భారతీయత" శీర్షికతో ఇమ్మడోజు

భద్రయ్య, "భారతీయ విద్యల" గురించి కొరిడె విశ్వనాథ శర్మ గారు, "ఆత్మసదనం" పేరుతో డా॥ జి.లక్ష్మణ రావు, భారతీయతకు అద్దం పడుతూ అష్టావధాని తిగుల్ల శ్రీకాంత్ శర్మ, "వారసత్వ సంపద" శీర్షికతో నంది శ్రీనివాస్ పద్యాలను తీర్చిదిద్దారు.

"అగ్నిలేక వంటయసాధ్యమైనయట్లు
జ్ఞానమొక్కింత లేక మోక్షమ్ము నంద
జాలరని యెరిగించిరి జ్ఞానులెల్ల
ఆ దిశగ నీవు చనిన శ్రేయస్సు కలుగు"

అంటూ తేటగీతిలో ఆచార్య అనుమాండ్ల భూమయ్య "జ్ఞానయాత్ర" శీర్షికతో పద్యాన్ని రాశారు.

"ధీరచరితలున్న ధీశక్తి సంజాత
నవ్యకాంతుల నొప్పు భవ్యధాత్రి"

అంటూ 'నా దేశం' శీర్షికతో అపర్ణమధు, "నీతి పతాకము" పేరుతో ఎనుగంటి వేణుగోపాల్ రాస్తే... "భారత ప్రదీప్తి" శీర్షికతో ఎర్రోజు వేంకటేశ్వర్లు, "దివ్యభూమి" శీర్షికతో కటుకోజ్వల మనోహరాచారి, "ఆస్తి" శీర్షికల్లో గజానన్ థామన్ తమ పద్యాలను తీర్చిదిద్దారు. "భారతీ.. బృందావని" పేరుతో గడ్డం లక్ష్మయ్య, "చాణక్యం" పేరుతో గాజుల రవీందర్, "భారతావని" శీర్షికతో జనమంచి పద్మావతి, "నా దేశం" పేరుతో జి.వి.కృష్ణమూర్తి, "జన్మభూమి" గరిమ గురించి డి. రాజారాం మోహన్ తమ భావాలకు ఛందోబద్ధ అక్షరాకృతి నిచ్చారు.

"మా భూమి" పేరుతో డా॥ డింగరి నరహరి ఆచార్య ఆటవెలదిలో తమ పద్యాలను రాస్తే.. "జాతీయ పతాకం" గురించి తత్వాది కృష్ణశర్మ, "మాతృ భారతి" గురించి డా॥ తత్వాది ప్రమోద్ కుమార్ రాశారు. "నా దేశం" శీర్షికతో దేవరం సతీశ్ కంద పద్యాలను తీర్చిదిద్దారు. భారత సంస్కృతీ వైభవాన్ని పాక రాజమౌళి తమ పద్యాల్లో నిక్షిప్తం చేశారు.

"ముక్తిని గోరినట్టి మునిముఖ్యులు భారతధాత్రి లోపలన్
భక్తుల సచ్చరిత్రములు పాడి తరించిరి నేటి మానవుల్
రిక్తములైన కోరికల రేవడులై విహరింపనేల? స
ద్భక్తియె ముక్తి మార్గమును దాచక చూపు తరించు వారికిన్"

అంటూ డా॥ బొద్దుల లక్ష్మయ్య గారు ఉత్పలమాల పద్యాన్ని రాశారు. "భారతీయత" గురించి రామక విఠల శర్మ, "భారతదేశం" పేరుతో ఆచార్య రావికంటి వసునందన్, "భారతాంబ" గురించి వి.ఆర్.గణపతి, "ఘనతర భూమి" శీర్షికతో శ్రీదాస్యం లక్ష్మయ్య రాశారు.

"పచ్చచీరను కట్టియు భరత జనని
యాదరించి యన్నమిడెడి యన్నపూర్ణ
భిన్న సంస్కృతులలరారు వన్నె గాంచి
భాషలెన్ని యున్నను జన భావమొకటె.."

అంటూ సంగనభట్ల చిన్న రామకిష్టయ్య భారతదేశ ఔన్నత్యాన్ని చాటిచెప్పారు.

**నవ్యకాంతుల నొప్పు భవ్యధాత్రి" అంటూ 'నా దేశం' శీర్షికతో అపర్ణమధు, "నీతి పతాకము" పేరుతో ఎనుగంటి వేణుగోపాల్ రాస్తే... "భారత ప్రదీప్తి" శీర్షికతో ఎర్రోజు వేంకటేశ్వర్లు, "దివ్యభూమి" శీర్షికతో కటుకోజ్వల మనోహరాచారి, "ఆస్తి" శీర్షికల్లో గజానన్ థామన్ తమ పద్యాలను తీర్చిదిద్దారు. "భారతీ.. బృందావని" పేరుతో గడ్డం లక్ష్మయ్య, "చాణక్యం" పేరుతో గాజుల రవీందర్, "భారతావని" శీర్షికతో జనమంచి పద్మావతి, "నా దేశం" పేరుతో జి.వి.కృష్ణమూర్తి, "జన్మభూమి" గరిమ గురించి డి. రాజారాం మోహన్ తమ భావాలకు ఛందోబద్ధ అక్షరాకృతి నిచ్చారు.**

భోగిని, సింగభూపాల, పోతనల సంవాదాన్ని డా॥ సంగనభట్ల నర్సయ్య తమ పద్యాల్లో పొందుపరిచారు. "భారత సంస్కృతి" గురించి సముద్రాల వేణుగోపాలాచార్య, "దేశానికి పట్టిన చీడల వదిలిద్దాం" అంటూ ఎస్. వేణుశ్రీ, 'దివ్యధాత్రి' గురించి స్తంభంకాడి గంగాధర్ రాశారు.

'మహిత భారతి' శీర్షికతో వురిమళ్ల సునంద, 'పుణ్యభూమి' శీర్షికతో డా॥ చక్రవర్తుల లక్ష్మీనరసమ్మ రాస్తే.. బండి ఉష తమ ఆటవెలది పద్యాల్లో భారతీయ సంస్కృతీ వైభవాన్ని ఆవిష్కరించారు.

"ఎందరు మాకు స్వేచ్ఛకయి ఎంత తపించిరో? నిండు జీవితం
బెందరు ధారవోసిరో? బ్రిటీషుల హింసకు పాత్రులైన వా
రెందరో? వారె మాకు స్మరణీయులు యోధులు నింటివేల్పులా
యందరకేను నా హృదయ మారగ మ్రొక్కెద విఠలేశ్వరా !"

అంటూ "మరపునకు రాని వారు" శీర్షికతో డా॥ కూరెళ్ళ విఠలాచార్య తమ పద్యాలను రాశారు.

"భారతమాత విముక్తికి
వీరులు ప్రాణము పణముగ పెట్టిన చరితన్
ధీరుల త్యాగము రేపటి
పౌరుల కందింప వలయు బాధ్యత తోడన్" అంటూ

"నాదేశం" శీర్షికతో కంద పద్యాల ద్వారా సాగర్ల సత్తయ్య పిలుపునిచ్చారు. "ప్రణతి" శీర్షికతో డా॥ తిరునగరి, "పర్వదినం" శీర్షికతో పున్న అంజయ్య, "దేశభక్తి" శీర్షికతో పెసరు లింగారెడ్డి, "భారతీయ వైభవం" గురించి రాధేయ తమ పద్యాలను రూపుదిద్దారు.

తరుగని సచ్చరిత్రగల ధన్యజనుల్ జనియించినట్టి యీ
భరత వసుంధరా స్థలిని వాసము జేసిరి మున్ను దేవతల్
నిరుపమ దీప్తితో వెలిగి నిండగు పున్నెము తోడ నెందరో
నరులిట నిల్వ, వారిగని నాటుము నీ

స్థిర భక్తినీ ధరన్ !

అంటూ "ప్రచోదనము" శీర్షికతో అష్టావధాని డా॥ అయాచితం నటేశ్వర శర్మ రాశారు.

"భవ్యభారతీ" అంటూ అష్టావధాని డా॥ బోచ్కర్ ఓంప్రకాశ్, "మన సంస్కృతి" శీర్షికతో డా॥ కాసర్ల నరేశ్ రావు, "భారతీయ వనిత" పేరుతో డా॥ వెంకన్నగారి జ్యోతి, "దేశసేవ" శీర్షికతో డా॥ శారద హన్మాండ్లు, తమ పద్యాలను రాశారు. "అమ్మా! రక్షింపవే!", "భారతాంబా!" శీర్షికతో ఆర్ష విద్యానిష్ఠ రాచాలపల్లి దేవీదాస శర్మ, "భారతీయ సంస్కృతి" పేరుతో అష్టావధాని చుక్కాయిపల్లి శ్రీదేవి, "ఉగ్రవాదము" శీర్షికతో డా॥ ఎస్.ఎం.హుస్సేన్, "భారతీయం" శీర్షికతో డా॥ ప్రొద్దుటూరి ఎల్లారెడ్డి, "దేశభక్తి" పేరుతో రావూరి వనజ, "జాతి దివ్వెలు" పేరుతో వల్లభాపురం జనార్దన, "రాష్ట్ర భక్తి" పేరుతో వై.రుక్మాంగదరెడ్డి తమ పద్యాలను తీర్చిదిద్దారు.

ఆలికి నర్ధదేహము, ననంగుని చావుకు మించుకన్ను, లో
కాలికినై, విషంబు గళమందున, భక్తులకాత్మ, దేవతా
పాళికి బుత్రు, నర్జునుని పాలికి బాశు పతంబు, నీక నీ
వే లయకారి వార్త తతి వేడెడు నిన్ను చిదంబరేశ్వరా !

అంటూ "శివభారతం" శీర్షికతో అష్టావధాని అష్టకాల నరసింహ రామశర్మ తమ పద్యాలను రాశారు.

"భారతదేశ ప్రాశస్త్యం" పేరుతో 'అష్టావధాని' తల్లోజు యాదవాచార్యులు, "భారతీయం" పేరుతో స్వర్ణకంకణ సత్కార గ్రహీత శాస్త్రుల రఘురామశర్మ, "మన వారసత్వం" పేరుతో అష్టావధాని అవుసుల భానుప్రకాశ్, "దేశభక్తి" శీర్షికతో వరుకోలు లక్ష్మయ్య, "శౌర్య భారతి" పేరుతో అన్నాడి జ్యోతి, "దేశ ప్రశస్తి" పేరుతో అమ్మన చంద్రారెడ్డి, "భారత ధీరశక్తి" పేరుతో ఉండ్రాళ్ళ రాజేశం రాశారు.

"సందేశము" పేరుతో ఐతా చంద్రయ్య, 'యోగభారతం' పేరుతో డా॥ కాచాపురం దుర్గాదేవి, "వీర భరతమాత" పేరుతో గంభీరావుపేట యాదగిరి, "మన భారతం" పేరుతో దేశపతి కృష్ణమూర్తి, ముక్తి ప్రదాత పేరుతో పప్పుల రాజిరెడ్డి రాశారు.

భారతీయ సంస్కృతులను బాగుగాను చదవరా! అంటూ పెందోట వేంకటేశ్వర్లు హితవు పలికారు.

"విందగు భారత ధర్మము
పొందుగ ప్రజకెంతో మేలు పూర్ణతనిడగా,
నందరి కన్నను మిన్నది
యెందున లేదింక మంచి నెరుగగ మహిలోన్ !"

అంటూ మచ్చ అనురాధ జన్మభూమి భారతి శీర్షికతో రాశారు. 'సమైక్య భారతి" శీర్షికతో డా॥ మహ్మద్ షరీఫ్ రాస్తే "భారతీయ సంస్కృతీ వైభవం" శీర్షికతో మాడుగుల మురళీధర శర్మ, "దేశ సంస్కృతి" పేరుతో మిట్టపల్లి పరుశరాములు, "సకల కళలు" శీర్షికతో లక్ష్మీకిరణ్ జబర్దస్త్, "సమైక్య భారతం" పేరుతో సముద్రాల శ్రీదేవి తమ పద్యాలను తీర్చిదిద్దారు.

"భారత మాత" పేరుతో శతావధాని మలుగ అంజయ్య, "ప్రణతులివే" అంటూ అష్టావధాని దోరవేటి చెన్నయ్య, "వేదభూమి నా పుణ్యభూమి" అంటూ గోగులపాటి కృష్ణమోహన్ రాశారు.

**"భారతదేశ ప్రాశస్త్యం" పేరుతో 'అష్టావధాని' తల్లోజు యాదవాచార్యులు, "భారతీయం" పేరుతో స్వర్ణకంకణ సత్కార గ్రహీత శాస్త్రుల రఘురామశర్మ, "మన వారసత్వం" పేరుతో అష్టావధాని అవుసుల భానుప్రకాశ్, "దేశభక్తి" శీర్షికతో వరుకోలు లక్ష్మయ్య, "శౌర్య భారతి" పేరుతో అన్నాడి జ్యోతి, "దేశ ప్రశస్తి" పేరుతో అమ్మన చంద్రారెడ్డి, "భారత ధీరశక్తి" పేరుతో ఉండ్రాళ్ళ రాజేశం రాశారు.**

"యుగ పురుషులు" శీర్షికతో డా॥ చీదెళ్ళ సీతాలక్ష్మి ఆటవెలది పద్యాలను రాశారు.

కళలకు కాణయాచి యన కమ్మని కాంతుల వెల్లులీనుచున్
కళకళలాడె జాతి ఘనకావ్య సుధారస ధారలన్నదా
తళుకులనీనే శిల్పమయి ధాత్రిని భారతి నవ్యశోభలన్
కళకళలాడె జీవనము కమ్మని సంస్కృతి ప్రాభవమ్ములన్ !

అంటూ "దివ్యభూమి" శీర్షికతో డా॥ పి.సరళ రాశారు.

"వైదిక పరమైన వైజ్ఞానికంబైన
ధర్మ కార్యకాంతి దండిగాను
భారత భువిపైన భవ్య సంస్కృతి శోభ
తరతరాల నుండి తరలుతోంది"

అంటూ వడిచర్ల సత్యం తరతరాల శోభను తమ ఆటవెలది పద్యంలో ఆవిష్కరించారు.

"అతితర జ్యోతి, సర్వ సమిష్టి చచిత్త
విపులతర శాఖికా సమావిష్కృత స్వ
రూప మీ నేలతల్లి సర్వోపనిషదు
పాన్య పరతత్త్వ మామెకు ప్రణతులివియె!"

అంటూ "వందేమాతరం" శీర్షికతో అష్టావధాని ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య రాశారు.

"యుగ యుగమ్ముల నుండి యీ యుర్వి పైన
సంస్కృతికి సభ్యతకును ప్రశస్తమైన
గురు పదమ్మును బొంది యకుంఠితముగ
వర యశశ్శాలివైతివి భరత పుత్ర!"

అంటూ అష్టావధాని కంది శంకరయ్య రాశారు.

"నరుని నారాయణుండను నయము దెలిపి,
మానవుల సేవయే సేవ మాధవునకు,
సత్యమిద్దియే యనుచును స్వాగతించె!
గాంధి చూపిన బాటయే కనక

పథము!" అంటూ

డా॥ ఎన్.ఎస్.వి.ఎస్. చారి మహాత్మునికి నమస్సులందించారు.

"భారత ప్రస్తుతి" పేరుతో గుళ్ళపల్లి తిరుమల కాంతికృష్ణ, "భరతమాత పిలుపు" శీర్షికతో నన్నపురాజు రమేశ్వరరాజు రాశారు.

"కారణజన్ముడాతడె !
యుగాధమునుంచినవారి గావగా
గౌరవ మందజేసి, బహుకాలము
పీడుతులైన వారికిన్ !
ధీరత తోడ విద్యలను దీప్తి వెలుంగగ
నేర్చె నెంతయో !
భారతదేశ గౌరవము భాసిల జేసిన
తండ్రి నెంచెదన్ !"

అంటూ డా॥ పల్లేరు వీరస్వామి అంబేద్కర్ పై రాశారు.

"మహాత్ముని మార్గము" పేరుతో డా॥ వజ్జల రంగాచార్య, మగువల మగటిమి పేరుతో వెలపాటి రామారెడ్డి తమ పద్యాలను రాశారు.

ఇంకా ఈ గ్రంథంలో శతావధాని డా॥ జి.యం.రామశర్మ, అష్టావధాని ముద్దు రాజయ్య, అష్టావధాని చింతా రామకృష్ణారావు, అష్టావధాని చిటితోటి విజయ్‌కుమార్, అష్టావధాని ముత్యంపేట గౌరీశంకరశర్మ, అష్టావధాని ముదిగొండ అమరనాథ శర్మ, అష్టావధాని సురభిశంకర శర్మ, అష్టావధాని డా॥ గౌరీభట్ల రఘురామ శర్మ, సహజకవి అష్టావధాని బండికాడి అంజయ్య గౌడ్, అష్టావధాని ఐతగోని వెంకటేశ్వర్లు, అష్టావధాని డా॥ జంధ్యాల సుబ్బలక్ష్మి, డా॥ మారుమూల దత్తాత్రేయశర్మలు రాసిన పద్యాలున్నాయి.

"మీరు పుట్టినట్టి మీ దేశమున మీర
యుండకుండ యేల దండయాత్ర
పనులు చేసి బ్రతుక పరమార్థ
మందురు?
పోరుగు దోచు దుష్టబుద్ధి చచ్చు!"

అంటూ

ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి గారు రాశారు.

"ఇదీ నేటిభారతం" అంటూ డా॥ అక్కిరాజు సుందర రామకృష్ణ "చంద్రశేఖర్ ఆజాద్" శీర్షికతో ఆచార్య ఫణీంద్ర రాశారు.

భావోద్వేగ విభాతముల్ వరలు నీ
భావ్యోత్తమంబౌ కళా
శ్రీ వాసంతము లా హిమాలయ
సరుల్ చిద్రూప పద్యద్వధూ
జీవమ్ముల్ పెను శౌర్య గాథలు, నదీ
శింజాన ధ్వన్యంబులన్
సేవన్ జేయగ జన్మమొక్కటి గదా
శ్రీకార శుంభత్ ప్రభా! అంటూ

డా॥ కాంచనపల్లి గో.రా. రాశారు.

"నేతాజీ" శీర్షికతో జె. బాపురెడ్డి, భాసుర భారతి శీర్షికతో డా॥ నలువోలు నరసింహారెడ్డి, "భరతమాత" శీర్షికతో నారదకోట్ల అరుణ, "బంగారు భూమి" పేరుతో పద్మ చిగురాల రాశారు.

శాస్త్రమును చేతబట్టియే సాగవలయు
నవరసంబైన శస్త్రంబు నందవలెను
భారతావని యనగ ప్రపంచమునకు
మార్గదర్శన మొనరించు మంచి
గురువు

అంటూ ఆచార్య మసన చెన్నప్ప "మార్గదర్శక భారతావని" పేరుతో తమ పద్యాలను తీర్చిదిద్దారు.

మన రాముని కృత్యమ్ములు,
మన కృష్ణుని బోధనములు, మన
పద్ధతులున్
మన భారత సంస్కృతిగా
తనరారుచు విశ్వమునకు "దారి"ని
జూపున్

అంటూ భారత సంస్కృతి పేరుతో 'పద్యమౌళి' డా॥ రాధశ్రీ రాశారు.

'భారతీయత' పేరుతో లక్ష్మీ మదన్, "పుత్రోహం" పేరుతో డా॥ వడ్లూరి ఆంజనేయ రాజు, "భారతమాత" శీర్షికతో విరించి తమ పద్యాలను రూపుదిద్దారు. ఇలా పై వారితోపాటు ఇంకా తెలంగాణ ఉమ్మడి పది జిల్లాలకు చెందిన కవులు, కవయిత్రుల పద్యాలెన్నో కొలువుదీరాయి. కొత్తగా మొదటిసారి పద్యాలు రాసినవారందరూ ఇంతటితో ఆపకుండా మున్ముందు మరిన్ని పద్యరచనలు చేయాలని కోరుకుందాం.

**"భారతీయత" పేరుతో లక్ష్మీ మదన్, "పుత్రోహం" పేరుతో డా॥ వడ్లూరి ఆంజనేయ రాజు, "భారతమాత" శీర్షికతో విరించి తమ పద్యాలను రూపుదిద్దారు. ఇలా పై వారితోపాటు ఇంకా తెలంగాణ ఉమ్మడి పది జిల్లాలకు చెందిన కవులు, కవయిత్రుల పద్యాలెన్నో కొలువుదీరాయి.**



పై వారితో పాటు సుమారు 129 మంది రాష్ట్రేతర కవులు తమ పద్యాలను రాసి ఈ గ్రంథానికి నిండుదనాన్ని కూర్చారు. ఈ గ్రంథం వెలుగులోకి రావడానికి సహకరించిన దాతలకు వందనాలు తెలియజేద్దాం.

ఇలా పద్యం కనుమరుగవుతోందని భావిస్తున్న తరుణంలో ఎంతో శ్రమకోర్చి అందమైన ముఖచిత్రంతో 650 మంది కవులు కవయిత్రులతో ఛందోబద్ధ పద్యాలను దేశభక్తిని ప్రబోధించేలా రాయించి పద్యానికి పునర్ వైభవాన్ని తెచ్చేందుకు కృషి చేసిన ప్రధాన సంపాదకులు అవుసుల భానుప్రకాశ్ గారికి, వెలువరించిన మెతుకు సీమ సాహితీ సాంస్కృతిక సంస్థ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేద్దాం. మొదటిసారి పద్యాలను రాసినవారే ఎక్కువ ఉన్నప్పటికీ పద్య ప్రక్రియపై వారికి ఉన్న మక్కువను అభినందిద్దాం. పద్యరచనను మున్ముందు కూడా కొనసాగించాలని కోరుకుందాం. ప్రతీ గ్రంథాలయంలో ఉండదగిన గ్రంథమిది !

కవిత

# నాన్న ఆశయం

జాధవ్ అంబాదాస్, 94902 31380

మా అయ్య నిలువుగా ఎండిన కట్టెలా అయ్యాడు
ఎప్పుడు మంచంతో మైత్రి చేసేస్తాడేమోననే
భయం పీడిస్తుంది నన్ను
మా అమ్మ నడుము కొక్కెలా అయ్యింది
ఎప్పుడు క్రిందికి పడిపోతుందోననే
భీతి చంపేస్తుంది నన్ను
"మనకు అప్పు లెందుకు తీరవు నాన్న?" అని నేనడిగితే
అప్పుడు అమాయకంగా బదులిచ్చారు మా నాన్న!
"ప్రతి ఏడాదికొచ్చే సంపాదన
మన కడుపులను నింపదు బాబు!
ఎంత వద్దని అనిపించిన
మిమ్మల్ని చదివించడానికి
అప్పులు చేసుకోక తప్పదు వడ్డీ కట్టడంలోనే
గొంతుపై నుండి లారీ టైరు వెళ్ళినట్టుంటుంది
కాని అప్పుల కుప్పలు
తలపై అదృశ్య పర్వతంలా బరువెక్కుతుంటాయి
నన్ను పాతాళానికి ఒత్తేస్తాయేమోననే బెంగ నాకు
కడుపులో ఆకలిమంట చెలరేగుతున్నా
హమాలి పనిలో నిమగ్నమై
నిండు గోనెసంచులను
రోజంతా విశ్రాంతి లేకుండా మోసినప్పుడల్లా
వీపుపై చర్మం ఎర్రటి జెండావలె
మెరుస్తూ మండినప్పుడు
అక్కడి నుండి పారిపోవాలనో

ఆ పని మానేయాలనో అనుకుంటుంటాను
కాని, మీ కోసం సహిస్తున్నాను
అలా ఇరవైనుంచి అరవైఏండ్ల వయస్సొచ్చింది
నా వీపు పై చర్మం వలిచిపోయి
నన్ను లోలోపల అరిచేటట్టు చేసినా
నా ఎముకలు క్రుళ్ళి ముక్కలై
నన్ను భూమి పాలు చేసినా
నా రక్తం చెమటల రూపంలో
బయటికొచ్చి నన్ను తడిపినా నా కాళ్ళు బెణికిపోయి
నన్నెంత వెనక్కి లాగినా హమాలి పని చేస్తునే ఉంటాం!
నా జీవితానికి ఇదే ఉద్యోగమేమో?
నీవు ప్రయోజకుడివి అయ్యేంత వరకు
నాకు, మంచానికి అభిన్న మిత్రుత్వం కుదురుతుందేమో?
నువ్వు బాబాసాహెబ్ వలె చదివి
గొప్పవాడివి కావాలని దేవుళ్ళెందరికో మొక్కాను.
నేను పడే కడగండ్లు
మీకు వారసత్వంగా రాకూడదనే నా ఆశయం!
నీకు కొలువు వచ్చిందంటే
పంట పొలాల్లోకెళ్ళి కేరింతలు కొడుతా
కంటనీళ్ళు పెట్టుకొని ఆనందసాగరంలో మునకలు వేస్తా..
మంట పెట్టుకొని నా గత కష్టాలను కాల్చేస్తాం"
అంటూ విరమించారు మా నాన్న గారు
అప్పుడు
నా కళ్ళు మేఘాలలా వర్షించాయి
ఆ కన్నీటి వర్షంలో "నాన్న ఆశయం" తడిసి
నా హృదయలోగిలిలో మొలకగా ప్రాణం పోసుకుంది



వ్యాసం

# తెలుగు భాషా ప్రేమికుడు... పాల్కురికి సోమనాథుడు

**పాల్కురికి సోమనాథునిపై పరిశోధనలో కొత్తదారి...**




డి. ప్రకాష్
97031 44447


ప్రజా జీవనం పరిస్ఫురించే కావ్యాలు కలిగి వుండడం ఉత్తమ సాహిత్యానికి, ఒక ప్రధాన లక్షణం. ఏ సాహిత్యమైనా ఎక్కువ కాలం ప్రజల నాలుకల మీద నాటబడాలన్నా, ప్రజలకు దగ్గరకు వెళ్ళాలన్నా భాష అత్యంత ప్రధానమైన పాత్ర పోషిస్తుంది. ఈనాడు ఇంగ్లీషుకున్న గౌరవం ఆ కాలంలో సంస్కృత భాషకు వుండేది. సంస్కృత మర్యాదలతో చంపూ రచన చేసి వృత్తాలలో, జాతులలో, ఛందస్సులో కావ్యాలు వెలువడుతున్న రోజులవి. తెలుగు సాహిత్యం అనువాదంతో మొదలయ్యింది. మహాభారతాన్ని సంస్కృతం నుండి తెలుగులోకి అనువదించినవారిలో నన్నయ మొదటివాడు. నన్నయ అనుసరించిన కవితా సంప్రదాయం మార్గ పద్ధతికి చెందినది. ఇతివృత్తం పురాణేతిహాసాలకు సంబంధించినది. కాగా, పాల్కురికి సోమన తన రచనలను ఎంచుకున్న తీరు ఇందుకు పూర్తిగా భిన్నం. నన్నయ ఏర్పరిచిన మార్గ కవితా ఘంటా మార్గాన్ని ధిక్కరించడమంటే మాటలు కాదు! ఏ భాషకైనా పుట్టినిల్లు, మెట్టినిల్లూ జనమే. భాషలన్నీ జనం కోసమే. తన మత ప్రచారం సామాన్యులకు చేరాలంటే ప్రజలభాషలోనే కావ్యం రాయాలనుకున్నాడు. సామాన్యులంటే శ్రమజీవులే కదా! వారి నాలుకల్లో కదలాడే తెలుగు భాషను సచ్చిపోకుండా చేయుటంలో ఆయన పడిన కష్టాలు, చేసిన పోరాటాలు, అనుభవించిన న్యూనత భావాలు అనేకం.

ఓరుగల్లుకు 16 మైళ్ల దూరంలో పాలకుర్తి ఆయన జన్మస్థలం. క్రీ.శ. 1160 నుండి - 1240 మధ్యకాలం వాడు. కాకతీయ రాజుల కాలానికి చెందినవాడు. ఈ వీరశైవ కవిసార్వభౌముడు వర్ణవ్యవస్థను తిరస్కరించి, కుల సమానత్వాన్ని ప్రతిపాదించిన విప్లవకారుడు. శ్రుతి, స్మృతి పురాణేతిహాసాలలో వ్యాకరణ, ఛందో లంకార, షటర్క, వైశేషిక, హఠయోగ, వైద్య, రసవాద, జ్యోతిష, భరత, సంగీతాది సకల శాస్త్ర కళలలో ప్రావీణ్యమున్నవాడు. పాల్కురికి సోమన బహుభాషావేత్త. పాల్కురికి తెలుగులోనే కాకుండా, సంస్కృతంలో, కన్నడంలోనూ రచనలు చేసిన బహుగ్రంథ రచయిత. మూడు భాషలలోనూ రచనలు చేసిన మొదటి కవి పాల్కురికి, ఇతడి కవితా గురువు కరస్థలి విశ్వనాథుడు.



అనుభవసారం, చతుర్వేదసారము, చెన్నమల్లు సీసములు, వృషాధిప శతకం తెలుగు పద్యరచనలు. బసవ పురాణం, పండితారాధ్య చరిత్ర, మల్లమ్మ దేవి పురాణం (అలభ్యం), ఇవి ద్విపద రచనలు. గద్యాలు, ఉదాహరణలు, పంచక, అష్టకం, స్తవాలు కూడా రచించారు. సోమనాథ భాష్యం, రుద్రభాష్యం, సంస్కృత బసవోదాహరణ, వృషభాష్టకం, త్రివిధ లింగాష్టకం అనేవి సంస్కృతంలో రాసినవి కాగా, సద్గురు రగడ, చెన్న బసవరగడ, బసవ లింగ నామావళి, మొదలైనవి కన్నడ భాషలో లఘు రచనలు.

సంస్కృతాన్ని అర్థం చేసుకోవడంలో

ఉన్న ఇబ్బంది తెలుగులో లేదని భావించి, ప్రచారానికి పాటయే ఉన్నతమైనదిగా భావించి, సంస్కృతం సరసన తెలుగు భాషను కూర్చుండబెట్టిన ప్రప్రథమ ప్రజాకవి. ద్విపద, శతక, ఉదాహరణ ప్రక్రియలకు ఆద్యుడు, తెలుగు భాషాభిమాని పాల్కురికి సోమనాథుడు.

"ఉరుతర గద్య పద్యోక్తులకంటె
సరసమై పరఁగిన జానుఁదెనుంగు
చర్చింపగా సర్వ సామాన్య మగుటఁ
గూర్చెద ద్విపదలు గోర్కి దైవాఱఁ"

బసవ పురాణం ప్రథమాశ్వాసం
160-180 పేజీ -07

పాల్కురికి కాలం నాటికి 'గద్య పద్యోక్తులు' అంటే పద్యం, గద్యం కలిసిన చంపూ కావ్య సంప్రదాయం కొనసాగుతుంది. పాల్కురికి తనరచనల్లో, వస్తువు ఛందస్సు, భాషల్లో నన్నయ పాటించని దేశీయతను పాటించాడు. "జాను తెనుగు" అంటే జనులు మాట్లాడుకునే దేశీయమైన తెనుగు. కన్నడంలో 'జాణ్ణుడి" అనే మాట కనిపిస్తుంది. ఆ "జాణ్ణుడి" జనుల భాషయే. తెలుగులో జాను తెనుగు అయింది. సంస్కృత భూయిష్టమైన భాషకాక దేశీయమైన పదజాలం ప్రజల నోళ్ళల్లో వాడుకలో వున్న తెలుగు భాషలో రచిస్తానని అన్నాడు.

"ఆరూఢ గద్య పద్యాది ప్రబంధ
పూరిత సంస్కృత భూయిష్ట రచన
మానుగా సర్వ సామాన్యంబు గామి
జాను తెనుగు విశేషము ప్రసన్నతకు"

- పండితారాధ్య చరిత్ర అవతారిక

వ్యవసాయం చేస్తున్న శ్రమజీవులకి సులభంగా అర్థం కావాలంటే వ్యవహారంలో ఎలా మాట్లాడుకుంటామో, అలాగే రాయాలి. అదే జాను తెనుగు. ఆ కాలంలోనే వ్యవహారిక భాషలో కవిత్వం ప్రవేశపెట్టిన ఘనత సోమనదే.

"తెలుఁగు మాటలనంగ వలదు.
వేదములు కొలఁదియ కాఁజాడుఁ
డిలనెట్టులనినఁ
బాటి తూకమునకును బాటి యౌనేనిఁ
బాటింప సోలయుఁ బాటియకాదె"

బసవ పురాణం ప్రథమాశ్వాసము
160-180 పేజీ. 07

వేద భాషయైన సంస్కృతానికి ఇచ్చే గౌరవం తెలుగు భాషకు ఇవ్వమన్నాడు. తెలుగు భాషని తక్కువగా, హీనంగా చూడవద్దని హెచ్చరించాడు. "తన కావ్యాలలో తెనుగు ఉందని తిరస్కరిస్తారేమో! సాక్షాత్తు వేదోపనిషత్తుల సారమంతా తెలుగులోకి తెస్తున్నాను. ఈ దేశీయ ఛందస్సుపై చిన్నచూపు వద్దని అవి వేదముల పాటివని ప్రకటించాడు. కొలమానం విషయంలో "తూము" ప్రమాణం తూముదని, "సోల ప్రమాణం సోలదని" రెండూ వేటికవే గొప్పవని పరస్పర పూరకాలని అచ్చమైన పల్లెభాషలో ఉపమానం చెప్పాడు.

భాషపట్ల ఆయనకున్న విశేషాభిమానాన్ని "అల్పాక్షరములలో అనల్పార్థమలను కూర్చి తన సరళతర ప్రజ్ఞాపాటవాలను వ్యక్తీకరించాడు.

"అల్పాక్షరముల ననల్పార్థ రచన
కల్పించుటయే కాదె కవి వివేకంబు;"

బసవ పురాణం ప్రథమాశ్వాసము
170-180

విస్తృత వర్ణలకంటే, అధికంగా సమాసాలు గుప్పించి రాసేకంటే సరళంగా ఉండాలని పాల్కురికి నినాదం.

ఏ కవికైనా కవి గౌరవాన్ని యిచ్చేది వారి భాషే. భాష వల్లనే కవి ప్రజల నోళ్ళల్లో బ్రతుకుతాడు. అందరికీ కన్పించే అతి సామాన్యమైన అంశాన్నే కవి అందంగా వర్ణిస్తాడు. అలా చెప్పి ఆశ్చర్యాన్నీ, ఆనందాన్ని కలిగిస్తాడు.

"తెల్లవారు జామున కోడిపుంజు తొలికూతను" 'స్వభావోక్తి'తో కళ్ళకు కట్టినట్టుగా ఇలా వర్ణించాడు.

"తొలికోడి కనువిచ్చి నిలిచి మైపెంచి
జలజల రెక్కలు సడలించి నిల్చి
గ్రక్కున కాలారి కంఠంబు విచ్చి
ముక్కున నీకెలు చక్కొల్పి కడుపు
వెక్కించి మెడసాచి నిక్కి మిన్సాచి
కొక్కొరో కుఱ్ఱని కూయకమున్న"

బసవ పురాణం

ఈ పాదాలలో ("కంఠంబు") అనే తత్సమ పదం మినహాయిస్తే మిగతావన్ని అచ్చ తెలుగు పదాలు. కోడికూతని ఊళ్ళల్లో ఉండే ఉత్పత్తి కులాలు, శ్రమజీవులు నిత్యం వినే సుప్రభాతం.

**ఈనాడు ఇంగ్లీషుకున్న గౌరవం ఆ కాలంలో సంస్కృత భాషకు వుండేది. సంస్కృత మర్యాదలతో చంపూ రచన చేసి వృత్తాలలో, జాతులలో, ఛందస్సులో కావ్యాలు వెలువడుతున్న రోజులవి. తెలుగు సాహిత్యం అనువాదంతో మొదల య్యింది. మహాభారతాన్ని సంస్కృతం నుండి తెలుగులోకి అనువదించినవారిలో నన్నయ మొదటివాడు. నన్నయ అనుసరించిన కవితా సంప్రదాయం మార్గ పద్ధతికి చెందినది. ఇతివృత్తం పురాణేతిహాసాలకు సంబంధించినది.**

తెలుగు సాహిత్య చరిత్రలో అనేక నూతన సాహితీ ప్రక్రియలకు శ్రీకారం చుట్టి, నవశకానికి నాంది పలికాడు. సమకాలికుడైన వ్యక్తిని కావ్య నాయకుడిగా చేసిన కవుల్లో మొదటివాడు. తొలి తెలుగు స్వతంత్ర కవి. తెలంగాణ వాడుక పదాలను, నుడికారాలను, సామెతలను, తెలంగాణ సంస్కృతిని, తన రచనల్లో రికార్డు చేసిన తొలి ప్రాంతీయాభిమాన కవి. ఏ కవి ప్రయోగించని "త్రిభంగి" ఛందస్సును "అనుభవసారం" తన తొలి రచనల్లో ప్రయోగించాడు. గ్రామీణ ప్రాంతాల్లో కాయకష్టం చేసుకునే ఉత్పత్తి కులాల భాషకు కావ్య గౌరవం కలిగించిన జానపద కవి. సమకాలీన సాంఘికాంశాలనే కాకుండా చారిత్రకాంశాలను కూడా సాహిత్య రచనల్లో మేళవించి, భాషలో, ఛందస్సులో, పద ప్రయోగంలో నవ్యత చాటిన దేశి కవితోద్యమకారుడు. తెలుగు భాష ప్రేమికుడు పాల్కురికి సోమనాథుడు.

కథ

# సిదానం - సీకులు

భాషా మూలాల గురించి ఒక అన్వేషణ....



డా॥ గంధం విజయలక్ష్మి
96666 04322

దోస్త్ మేరా దోస్త్ తుహై మేరా జాన్ రేడియోలో పాట వస్తుంటే నా చెవి గొట్టమ్లు కెంచి నా మనస్సు గొట్టమ్లా జేరే అప్పుడు నా దోస్త్ గుర్తుకొచ్చిండు. నా యాది అంత నా దోస్త్‌తో ఉన్న దినాలు యాదికచ్చి పానమంతా ఎటో ఎల్లిపాయె. గా దినాలు నా మనసుల గిర్రున దిరగవట్టె. కండ్లను కప్ప గుడ్లలెక్క జేసుకొని రొడ్డెమ్మంట జూస్తుంటిని. మా అమ్మ ఏమె పింకె గటు గిటు దిరుగుతున్నవ్? ఎవరి కోసం నెటికిస్తున్నవ్?

కొత్తగ సిగమోస్తే గోడలు పట్టుకొని ఊగులాడినట్లు ఎం దిరుగుడే అది? అని అమ్మ జోరుజోరుగా పల్లాటాలు పల్కవట్టే.

కులం కన్ను గద్దుకన్ను అన్నట్టు. నీ కన్ను నా మీదనే నువ్వు జర నోరు మూస్కో. ఏందే బాగా దత్తు జేస్తున్నవ్? నీ ఏశం ఎడదాకనో పోతుంది? అని అమ్మ అంటుండగానే

గుడ్డి కొంగకు పెత్తనమిస్తే

ఎగిరెగిరి పెద్ద కొంగల పొడిచె అన్నట్లు నా మీద ఎగిరెగిరి పడ్తున్నవ్ అని నేను అమ్మతో అనెటప్పుడే అంత దూరం నుంచి నాట్యం జేసే నా దోస్త్.

నా దోస్త్‌ను చూడంగనే నా పాణం లేచొచ్చినట్టయింది.

ఏదైనా ఉపాయం జేసి మా అమ్మను బురిడి కొట్టాలే. సిర్సువాంలో ఒక ఉపాయం అచ్చింది అమ్మ నెట్టశాంతి నెట్టుశావిడి ఏగిత్తది అంటుకొస్త అని జానిపోత.

నా దోస్త్ అంబ్యాత్కుడు పల్లాటములు పల్కుంటిమి సిదానం పున్నెం మెస్కినం. మా అమ్మ మీద సాకులు జెప్పుకుంట సీకులు మెస్కిన. రోషమున్న నేస్తమా నీకు కోపమెక్కువ అన్నట్టు నా దోస్త్ సిర్సువాం మిరంకొట్ల లెక్క అయింది.

కార్వడి కాగానే కాళ్ళల్ల కాళ్ళు వేస్కుంట మత్తెజేరితి.

నేను జేరిన అని అనంగానే సైగజేసి ఇకిలించి కార్వడిలో కలిసిపోయే. నా దోస్త్ ఎడికి వోయినవు అని ఇర్రమర్రజూసే మా అమ్మ నా దోస్త్‌తో తిరగడం, నా దోస్త్ దగ్గర మలగడం, శావిడి కర్కోడిశాఖం మెస్కుడు, మేమిద్దరం తిరుగుతుంటే పగడికంటే గుడ్లు ఎస్కోని చూస్తది.

మా అమ్మ పల్లాటాలు ఖ్యాతరు జెయ్యట జానుత. అప్పుడు మా అమ్మ మొకం కర్కువాం లెక్క కొర కొరలాడుతది. ఏం మాట్లాడవేమే అంటుగదిమింది.

మత్తులో ఉన్న నేను మత్తె అని గూడ జూడకుండ దత్తు దత్తు జేసుకుంటు ఎర్కుండి ఎరుకలామెను అడిగినట్లు మత్తునెత్తికెక్కి గదిమించిన. అంతే చింతకొట్ల లాకుడాలతో దెహిపితే వీపంతా చింతపండు అయింది.

కార్వడి నా దోస్త్ దగ్గరికి జానిపోయ్యి
దోస్త్ మేరా దోస్త్ తుహై మేరాజాన్
వాస్తవంరా దోస్త్ నువ్వే నాప్రాణం
ఈ పాట విన్నంగనే ఎంటనే మదిలో దు:ఖం ఆపుకోలేక బొల్లున ఎడ్చుకుంటు జెప్పిసిన నా దోస్త్‌కు. నా దోస్త్ విన్న వెంటనే అగ్గిమీద గుగ్గిలమైండు. ఆ మొకం జూస్తే దనియాలు మెంతు లు ఏగుతాయా అన్నట్టు ఎర్రవడ్డది.

మా అమ్మతో జగడం ఆడడానికి జేబులో చెయ్యి వెట్టుకుని బయలుదేరిండు. నాదోస్త్‌ను చూడగానే మా అమ్మ ఖంగుతిన్నది. జివాల్టు మార్పిల్లితే ఐదు తెల్లాలు అచ్చినయి. ఆ తెల్లాలతో సిదానం సీకులు మెస్కినం నీకేదంట. నాపింకె పెయి సున్నం సున్నం జేస్తవ? నీకిప్పుడే ఇడుపు కాగితం జేపిస్త. గుసాయిలను జానిపిస్త ముచ్చిలిక కడతా అంటూ నాదోస్త్ రకరకాల భంగిమలతో మా అమ్మను భయపెడ్తుంటే మా అమ్మ మొకం చిన్నపోయింది.

గొయ్యి తియ్యిబోయి బాయిల బడ్డట్లు అనుకుంటున్నది. మా అమ్మ నా దోస్త్‌తో చదువుకునే పింకె గివ్వేమి అలవాట్లు? నువ్వేమి జెప్పద్దు సదువుకోదు ఈతసాపలు అల్లుతది. ఇది నా వారసురాలు ఎట్లనన్న పెంచుతా దా పింకె మెత మెసుకుదాం. కురుగాండ్ల శాఖముతో మా అమ్మ గట్లనే మేడి గుడ్లేసుకొని బిత్తరవోయి జూస్తున్నది.

నా చేయివట్టి మత్తెలోకి నడిపించిండు అలా నడిపించిన ఆ చేయి ఇప్పుడు ఆకాశం అంచున చుక్కగా చేరి నన్ను చూసి తళుక్కుమంటున్నది.

కవిత

# ఆమనగల్ టూ గిరికొత్తపల్లి



**తగుళ్ళ గోపాల్, 95050 56316**

ఈ బస్సును చూసినప్పుడల్లా
కదులుతున్న జాతరే గుర్తొస్తది.

ఏ ఊరి దగ్గర
అంబేద్కర్ బొమ్మ కనబడినా
గొంతెత్తి హారన్ గొట్టి
మంచిగా పోయి రావాలని
మనసులోనె దండం బెట్టుకుంటది.

దూరం నుంచి కూతేసే
మూడు కాళ్ళ ముద్దను చూసి
మనసు నిమ్మలం చేసుకుంటది.
చెయ్యెత్తిన కాడ ఆగి
కొత్తగా సుట్టరికం కలుపుకుంటది.

జరసేపు ఆగు సారు
మనుమడు పండ్లు తెచ్చుకోనీక పోయిండని
అవ్వ ఒకటే గీములాడుతుంటే
లోపటలోపట్నె నవ్వుకుంటది.

గుంతలు, మెట్టలు వచ్చిన దగ్గర
గుణుగకుండా పోతది.
ఏ భిక్షగాడు ఎక్కినా
అంటు, ముట్టు అని
దూరం జరుపదు.

దీనికి ఎంత దయనో గాని
నడవలేని ముసలమ్మలొస్తే
ముందలనే కూర్చో బెట్టుకుంటది
బాలింతరాలొస్తే
లేచి నిలబడి గౌరవిస్తది.

కాలేజీ పిల్లలంటే
ఎంత ప్రేమనో గాని
లోపల సీట్లు లేకుంటే
నెత్తి మీద ఎక్కించుకుంటది.

కిటికీ అద్దం పక్కన
సీటు దొరికితే
భూగోళాన్ని చుట్టొచ్చినంత
సంబురపడే పిల్లలు

పన్నెండేళ్ళ పిలగాడికి
పదేండ్లు కూడా పడలేదని
టిక్కెట్టు తీసుకునే దగ్గర
గొడవకు దిగే తల్లులు




ఆపి కదిలినంతలనే
జీవితాన్ని తీపి చేసుకుంటూ
అల్లంరబ్బ అమ్ముకునే వాడు

అందరి ఆకలిపోరాటాలను
ఒక కంట కనిపెట్టుకొని పోతుంటది.

తాగి, వెనుక సీట్లో పడుకుంటే
తిట్టుకుంటనే, ఇన్ని నీళ్ళు చల్లి
వాళ్ళ ఊరు దగ్గర దించిపోతది.

చిల్లర డబ్బులను చూస్తే
చిన్న పిల్లోలే మురిసిపోతది.
పెద్ద నోట్లను ఇస్తే
ఇంకా ఎంతియ్యాలనో మర్చిపోకుండా
టికెట్ వెనుక బుద్ధిగా రాసుకుంటది.
ఎవరి సొమ్ము ఉంచుకోకుండా
పంచుకోమని చెప్పి
ఇద్దరిద్దరికి జతగలిపి పోతది.

బెండకాయ సంచుల్ని
ఆకు కూరల మూటల్ని
మార్కెట్ల దించడమే గాని
రైతు కడుపుగొట్టడం తెల్వదు దీనికి

ఏ ధర్నాలోనైనా
కండ్లద్దాల మీద రాళ్ళేస్తే
ఎవరు చేసిన పాపమో
నాకు తగిలిందని దిగులు పడుతది.

నెలకోసారి ఛార్జీలు పెరిగితే
నా చేతిల ఏం లేదని
నోరు లేని దానోలే తలదించుకుంటది.

భార్య పిల్లలను వొదిలేసి వచ్చిన
తండ్రిలాగ తొందరపడుతూ
ఎంత రాత్రి అయినా
నిద్ర చేసే తావును చేరుకుంటది

పడుకునే ముందల
లోపల కలెదిరిగి చూసుకుంటే
ఎవరో మర్చిపోయి పోయిన
బజ్జీల పొట్లాలు
సగం తిని వదిలేసిన
కుర్కురే ప్యాకెట్లు
సీటుకు అంటుకపోయిన
ఆకుకూరల కాడలు
నలిగిపోయిన
సిగరెట్టు డబ్బాలు

అందరూ దిగిపోయినంక
ఎంత బాధ పడుతదో ఈ బస్సు
నిద్ర పడుతదో లేదో గాని
తెల్లారుగట్లల్ల ఐదింటికే లేచి
ఊరూరులో సూర్యుడిని దించి
పట్నం రోడ్డెక్కుతది.

కవిత



# పడిన గోడలు లేస్తాయి !!



కె.ఎస్. అనంతాచార్య, 94411 95765

అవును నిజం పరిణామాలెప్పుడూ ఒకేలా ఉండిపోవు
విజయాలెప్పుడూ శాశ్వతమూ కావు
పదవీ దర్పాలు నీటి బుడగ చందాలు!

చప్పట్లు నిరంతరం మెప్పుకోరే కానక్కర్లేదు!
స్వపక్షంలోనూ ప్రతిపక్షులుంటారు!

దండలు మెడలు మార్చుకోవచ్చు
శాలువాలు పార్టీ మారినట్టు!

కన్నీళ్లకు ఒకే అర్థం ఉండదు
కడగండ్లకు శాశ్వత చిరునామా ఉండదు

అవమానాలు కొంగుపట్టుకు వేలాడే నక్షత్రకులు కావు!
పైకమెప్పుడూ పైపైనిచుట్టమే!

నిరాశ నిస్పృహలు చుట్టపు చూపులే!
ఆలుమగలు కానే కావు విచారమెప్పుడూ అర్ధాంగిలా
సహచరి అనుకోకు సుమా
భయభ్రాంతులు మనసు గూటి పక్షులు అసలే కావు

అన్నీ ముషాఫిర్ లే మూడు నెలల ముచ్చటకై
వచ్చిన చుట్టాలే వసంత కాలపు చంద్రకాంతులే

చిరిగియే వస్త్రాల కొరకు ఫాషన్ పరేడ్లు దేనికి?
ఆవిరయ్యే నీటిపై అత్యాశ లెందుకు?

విరిగిన కాళ్ళు పరుగెడుతాయ్ మూగనోళ్లు వాదిస్తాయి
గుర్తుంచుకో పడినగోడలూ తలెత్తుకుని లేస్తాయి!!

# ధిక్కారానికి ప్రతీక ప్రజాకవి కాళోజి .... - ఎమ్మెల్సీ కవిత

## తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో కాళోజీ జయంతి వేడుకలు

తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 9న ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు సంబురంగా జరిగాయి. తెలంగాణ జాగృతి అధ్యక్షులు, శాసనమండలి సభ్యులు కల్వకుంట్ల కవిత ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రజాకవి కాళోజీ జీవితం ధైర్యానికి, ధిక్కారానికి ప్రతీక అని, ఆయన రచనలు ప్రజల పక్షం అని అభివర్ణించారు. తెలంగాణ ఉద్యమానికి కాళోజీ రచనలు స్ఫూర్తినిచ్చాయని, తన జీవితాన్ని ప్రజాసాహిత్యానికి అంకితం చేసిన తెలంగాణ ముద్దుబిడ్డ కాళోజి తరతరాలకు ఆదర్శనీయుడని కొనియాడారు. కాళోజి స్ఫూర్తితో తెలంగాణ జాగృతి అనేక సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. అక్టోబర్ 15, 16వ తేదీలలో హైదరాబాదులో సాహిత్య సభలు నిర్వహిస్తున్నట్లు ఆమె ప్రకటించారు. ఈ సందర్భంగా 2022వ సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వ కాళోజీ నారాయణరావు స్మారక పురస్కార గ్రహీత శ్రీరామోజు హరగోపాల్ ను ఎమ్మెల్సీ కవిత ఘనంగా సత్కరించారు. మంచి కవి గానే కాక చరిత్ర పరిశోధకులుగా కూడా హరగోపాల్ అందరికీ సుపరిచితులని అన్నారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో వీరు సభ్యులుగా ఉన్న చరిత్ర



బృందం చేసిన పరిశోధనలతో "తెలంగాణ చరిత్ర" త్వరలో ప్రచురణ కానుందని కవిత తెలియజేశారు. అలాగే తెలంగాణ సారస్వత పరిషత్ వానమామలై వరదాచార్యులు స్మారక పురస్కారాన్ని అందుకున్న తెలంగాణ గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ అయాచితం శ్రీధర్, ఎక్రె జాతీయ పురస్కారానికి ఎంపికైన ఘనపురం దేవేందర్ లను ఎమ్మెల్సీ కవిత సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్, తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్, తెలంగాణ అధికార భాషా సంఘం చైర్మన్ మంత్రి శ్రీదేవి, తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి రంగు నవీనాచారి, తెలంగాణ జాగృతి నాయకులు మంచాల వరలక్ష్మి, మోహన్ రెడ్డి, కుమార స్వామి, విక్రాంత్ రెడ్డి, తిరుపతివర్మ, కోదారి శ్రీను, భిక్షపతి, ప్రశాంత్, బాల ప్రసాద్, అయినంపూడి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.





## ప్రముఖ కవి గన్ను కృష్ణమూర్తి అస్తమయం

ప్రముఖ కవి, రచయిత కథా రచయిత, పరిశోధకులు గన్ను కృష్ణమూర్తి (70), సెప్టెంబర్ 9, 2022న తుదిశ్వాస విడిచారు, కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురై హైదరాబాదులో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ప్రస్తుతం కామారెడ్డిలో నివాసం ఉంటున్న గన్ను కృష్ణమూర్తి వరంగల్ జిల్లా, కేసముద్రం వాస్తవ్యులు. ఉద్యోగరీత్యా కామారెడ్డిలో కామర్స్ లెక్చరర్‌గా స్థిరపడ్డారు.

వారి అన్న కీ.శే. గన్ను సుదర్శన్ కూడా రచయితనే. గన్ను కృష్ణమూర్తి ఆత్మకు శాంతి కలగాలని 'తంగేడు' వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతుంది.

# ఘనంగా "తరాజు" విమర్శనాగ్రంథం ఆవిష్కరణ...




"తరాజు" విమర్శనాగ్రంథం ఆవిష్కరణ రవీంద్ర భారతి మినీ హాల్లో ఆగస్టు 28 2022 జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ రచయితలు విమర్శనా గ్రంథాలలో నిర్ణయాలు చేయకూడదని ప్రతిపాదనలు మాత్రమే చేయాలని అభిలషించారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన జూలూరి గౌరీ శంకర్ సాహిత్య అకాడమీ చైర్మన్ మాట్లాడుతూ ఇందులో ప్రతిపాదనలే ఉన్నాయని పేర్కొన్నారు. కాంచనపల్లి తన జీవితాన్ని సాహిత్యంగా మలుచుకున్నారని అభినందించారు.

అధ్యక్షత వహించిన సంగిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ కాంచనపల్లి గోవర్దన్ రాజు వాళ్ళ మేనమామ గగ్రెపల్లి సత్యనారాయణరాజుతో స్ఫూర్తి పొంది సాహితీ లోకంలోకి వచ్చారని పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్. రఘు, మాట్లాడుతూ కాంచనపల్లి ఈ పుస్తకంలో తనకు ప్రాచీన గ్రంథాల మీద, కొత్త సాహిత్యం మీద ఉన్న అవగాహన చూపించారని పేర్కొన్నారు. తర్వాత ప్రముఖ కవయిత్రి దేవకీ దేవి తెలంగాణ సంస్కృతిని జీర్ణించుకున్న కవి కాంచనపల్లి అని పేర్కొన్నారు. ప్రముఖ సాహితీవేత్త బాణాల శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ గ్రంథంలో కాంచనపల్లి ఆంగ్ల సాహిత్య జ్ఞానం విమర్శ పట్ల కాంచనపల్లి అవగాహన తెలియవస్తుందని ప్రశంసించారు. ప్రముఖ కథా రచయిత కూర చిదంబరం వందన సమర్పణ చేశారు. పుస్తక రచయిత కాంచనపల్లి గోవర్ధనరాజు మాట్లాడుతూ తాను యువకవులకు సాహితీలోక ప్రవేశానికి మార్గం చూపించడానికి ప్రయత్నం చేశానని చెప్పారు.

ఈ సభను ఫీచర విజేందర్ రావు ఆయన భార్య ఫీచర సునీతారావు స్మృతిలో తన చేతుల మీదుగా నడిపించడం పట్ల పలువురు అభినందించారు.

# రవీంద్ర భారతిలో ఘనంగా కాళోజీ జయంతి వేడుక...

ప్రజాకవి కాళోజి నారాయణరావు 108వ జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 9న రవీంద్ర భారతిలో వేడుకలను ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా తెలంగాణ కవి, చరిత్రకారుడు, పరిశోధకుడు శ్రీరామోజు హరగోపాల్ ను కాళోజి స్మారక పురస్కారంతో సత్కరించింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర సాంస్కృతిక శాఖమాత్యులు శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ కవులకు సాహిత్య చరిత్రలో ప్రత్యేక స్థానం ఉందని ధిక్కారాన్ని ప్రజాస్వరాన్ని తెలంగాణ కవులు వినిపించినంతగా ఎవరికి సాధ్యం కాలేదని అన్నారు. కవులను రచయితలను సత్కరించుకోవడంలో తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు గర్వకారణంగా భావిస్తారన్నారు. ఈరోజు అవార్డు అందుకుంటున్న శ్రీరామోజు హరగోపాల్ తెలంగాణ ఉద్యమ కాలంలోనూ, ప్రస్తుతము నిరంతరాయంగా తెలంగాణ గొంతుకై ఆదర్శంగా నిలుస్తున్నాడని అభినందించారు. కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర హోంమంత్రి మహమ్మద్ అలీ మాట్లాడుతూ కవులు దేశానికి దిక్సూచులని వారి వలననే తరతరాలకు వారధులు ఏర్పడతాయని అన్నారు. కార్యక్రమంలో పురస్కార గ్రహీత శ్రీరామోజు హరగోపాల్



మాట్లాడుతూ పురస్కారం ప్రదానం చేయడం ద్వారా ప్రభుత్వం తనకు ఇచ్చిన గౌరవానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారులు కేవీ రమణాచారి, శాసనమండలి సభ్యులు గోరటి వెంకన్న, తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు జూలూరు గౌరీశంకర్, తెలంగాణ అధికార భాషా సంఘం అధ్యక్షులు మంత్రి శ్రీదేవి, తెలంగాణ సంగీత నాటక అకాడమీ అధ్యక్షులు దీపికా రెడ్డి, సాంస్కృతిక శాఖ ప్రభుత్వ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ, ప్రముఖ కవులు కే శివారెడ్డి, సుద్దాల అశోక్ తేజ, మల్లోజుల నారాయణ శర్మ, ఘనపురం దేవేందర్, ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్, సాహిత్యాభిమానులు హరగోపాల్ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

# సమసమాజ నిర్మాణంలో రచయితలది గొప్ప పాత్ర....

**- రాష్ట్ర ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖామంత్రి డాక్టర్ వి. శ్రీనివాస్ గౌడ్**

సమసమాజ నిర్మాణంలో రచయితలది క్రియాశీలక పాత్ర అని రాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజ్, యువజన సర్వీసులు, పురావస్తు, పర్యాటక, క్రీడా, సాంస్కృతిక శాఖా మంత్రి డా॥ వి. శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సెప్టెంబర్ 5న మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో జరిగిన పాలమూరు సాహితి పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలమూరు జిల్లా అంటేనే కవుల జిల్లా అని, సురవరం ప్రతాపరెడ్డి జన్మించిన నేల అని కొనియాడారు. ఆనాడు మన కవులను ఎక్కిరించిన ఆంధ్ర కవులను నిరసిస్తూ "గోల్కొండ కవుల సంచిక"ను 354 మంది కవులతో వెలువరించడం తెలంగాణ పౌరుషాన్ని చాటుతుందన్నారు. 2020 సంవత్సరానికి "కవిత్వమే ఓ గెలాక్సీ" కవితాసంపుటిని రచించిన ఐనంపూడి శ్రీలక్ష్మికి, 2021 సంవత్సరానికి "ప్రాణదీపం" కవితాసంపుటిని రచించిన గాజోజు నాగభూషణానికి మంత్రి పాలమూరు సాహితి పురస్కారాలను మెమెంటో, శాలువాలతో పాటు 5116/- నగదు పురస్కారాలను అందజేశారు. అలాగే యువకవి డాక్టర్ వెలుదండ వేంకటేశ్వరరావు రచించిన "వేంకటేశ శతకం" ను మంత్రి ఆవిష్కరించారు. సభకు అధ్యక్షత వహించిన జిల్లా కళాకారుల సంస్థ అధ్యక్షులు వి. మనోహర్ రెడ్డి మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో మేలిమి సాహిత్యాన్ని సృజిస్తున్న కవులకు ప్రతి సంవత్సరం పాలమూరు సాహితి పురస్కారాలను అందజేయడం అభినందనీయమన్నారు. విశిష్ట అతిథి, తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నాళేశ్వరం శంకరం



మాట్లాడుతూ పాలమూరు జిల్లా సాహిత్యం తెలంగాణ సాహిత్యానికి దిక్సూచి అని కొనియాడారు. అప్పకవి జన్మించిన నేల నుంచి పాలమూరు సాహితి పురస్కారాలను అందజేయడం గర్వించదగ్గ విషయమన్నారు. పాలమూరు సాహితి అవార్డు వ్యవస్థాపకులు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో బలమైన సామాజిక కవిత్వాన్ని ఆవిష్కరిస్తున్న కవులకు గత పన్నెండు సంవత్సరాలుగా పాలమూరు సాహితి పురస్కారాలను అందజేస్తున్నామన్నారు. ఆత్మీయ అతిథులుగా విచ్చేసిన కాళోజీ అవార్డు గ్రహీత కోట్ల వేంకటేశ్వర రెడ్డి, ప్రముఖ విద్యావేత్తలు కె.లక్ష్మణ్ గౌడ్, వాగ్దేవి జూనియర్ కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకట్ రెడ్డి లు మాట్లాడారు. పురస్కార గ్రహీతలైన ఐనంపూడి శ్రీలక్ష్మి, గాజోజు నాగభూషణం లు మాట్లాడారు. అనంతరం వేంకటేశ శతకం పుస్తకాన్ని డాక్టర్ విరివింటి సురేష్ బాబు సమీక్ష చేసారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా డాక్టర్ గుంటి గోపి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

# ధిక్కార కవి కాళోజి...

మిత్రుత్వమైనా, ధిక్కారమైనా తన భాషలోనే చేస్తానంటూ మాతృభాష ప్రాధాన్యతను చాటిచెప్పిన తెలంగాణ ప్రజాకవిగా కాళోజీ నారాయణరావు శాశ్వతంగా నిలిచి పోతారని 'తంగేడు' సాహిత్య పత్రిక సహసంపాదకులు, ప్రముఖ కవి డా॥ కాంచనపల్లి గోవర్ధన రాజు పేర్కొన్నారు. ప్రజాకవి కాళోజీ నారాయణరావు 109వ జయంతిని పురస్కరించుకుని తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా శుక్రవారం జూమ్ వేదికగా సాహితీ గౌతమి నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యాతిథిగా పాల్గొని మాట్లాడారు. కాళోజీ తెలంగాణ తెలుగులో అనేక ప్రయోగాలు చేశారని, సామెతలు, జాతీయాలు, నుడికారాలు విరివిగా ఉపయోగించారని వివరించారు. అనేక భాషలకు పదాలను తెలుగుతో మిళితం చేసి చమత్కారంగా కవిత్వం వెలువరించిన మహాకవిగా ఆయన కనబడుతారన్నారు. మాతృభాషలో మాట్లాడలేని వారు ప్రాంతీయతను గౌరవించలేరని ప్రకటించిన నిఖార్సయిన వ్యక్తిగా సమాజాన్ని కదిలించాడన్నారు.

సభాధ్యక్షత వహించిన సాహితీ గౌతమి అధ్యక్షులు డా॥ గండ్ర లక్ష్మణరావు మాట్లాడుతూ కాళోజీ ఓరుగల్లు కేంద్రంగా అనేక ప్రజా ఉద్యమాలు నిర్వహించాడని, ఆయన స్వభావమే భావమని, ప్రజల నాలుకలపై ఉండే సహజమైన భాష కోసం ఆయన తపించారని చెప్పారు.యాస కాళోజీ శ్వాస అని, ఆ యాసతోనే నిసర్గ సౌందర్యమైన కవిత్వం వెలువరించారన్నారు.



బ్లూబెల్స్ విద్యాసంస్థల యజమాని సునీతా మనోహర్ రెడ్డి, సాహితీ గౌతమి సహాధ్యక్షులు, సుదర్శనం వేణుశ్రీ, కార్యనిర్వాహక అధ్యక్షులు గాజుల రవీందర్ ప్రధాన కార్యదర్శి నంది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డా॥ తత్వాది ప్రమోద్ కుమార్, స్తంభంకాడి గంగాధర్, కటుకోజ్వల మనోహరాచారి, జి.వి.కృష్ణమూర్తి, మాదాడి నారాయణ రెడ్డి, రామమూర్తి, ఎమ్.ఆర్.వి.ప్రసాద్, సిరిపురం వాణిశ్రీ, కె.ఎస్.అనంతాచార్య, మాడిశెట్టి గోపాల్, బొడిగె శ్రీనివాస్, వేముల రాజేశం, పద్మావతి, గంగుల శ్రీకర్, గజేందర్ రెడ్డి, కొత్త అనిల్ కుమార్, వడాల రవీందర్, పత్తిపాక మోహన్, దోరవేటి చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

**స్వీ కా రం**



## కరోనా కాలంలో మా కాపురం

ఆచార్య జి. చెన్నకేశ రెడ్డి
హైదరాబాద్
సెల్ : 9492047027

వెల : రూ.150/-



## అపరాజిత

డా॥ కె. గీత

నెచ్చెలి ప్రచురణలు
వెల : రూ.250/-



## అసింట (కవితలు - పాటలు)

డా॥ కె. గీత

వెల : రూ.100/-



## కైరవ శతకము

వేణుశ్రీ
సెల్ : 83289 68755

వెల : రూ.65/-



## వాల్మీకి మొగ్గలు

కోలంట్ల రామకృష్ణ
కర్నూల్
సెల్ : 99668 04126

వెల : రూ.30/-



## ది లిటిల్ బుక్ ఆఫ్ ఎవ్రిథింగ్

డా॥ సరిపల్లి కృష్ణారెడ్డి

వెల : రూ. 350/-



## ఊహలకే ఊపిరొస్తే

కె. హరనాథ్
హైదరాబాద్
సెల్ : 97034 42598

వెల : రూ.140/-



## మనిషి పరిచయం

రామా చంద్రమౌళి
వరంగల్

జెవి పబ్లికేషన్స్
సెల్ : 80963 10140

వెల : రూ.200/-



## శ్రీనివాస వచనములు

బండ అరుణావిపాల్ రెడ్డి
మేడ్చల్

సాయిధీరజ్ పబ్లికేషన్స్
వెల : రూ.25/-



## గాండ్ల మిట్ట

ఆర్.సి. కృష్ణస్వామి రాజు
తిరుపతి
93936 62821

వెల : రూ.160/-



ప్రముఖ సాహితీవేత్త, ఉత్తమ ఉపాధ్యాయుడు...

## మడిపల్లి భద్రయ్య

(వర్ధంతి : సెప్టెంబర్ 18, 2021)